www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 18-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 32

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: దశమి ఉ. 11.23 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తర రా. 12.23 తదుపరి హస్త; వర్జ్యం: శేషం ఉ.7.13; దుర్ముహూర్తం: ఉ.5.45-7.28, అమృతఘడియలు: సా.4.15-6.03; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.37

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టీఎస్ స్థానంలో టీజీ

పీఎస్‌యూలు, ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలు..
విధిగా వాటి 'పేర్లు' మార్చుకోవాల్సిందే
లెటర్‌హెడ్‌లు, నోటిఫికేషన్లు, డాక్యుమెంట్లు,
జీవోలు, వెబ్‌సైట్లపై కూడా 'టీజీ' అనే ఉండాలి
అన్ని శాఖల అధికారులకు సీఎస్ ఆదేశాలు



13

ఆదాయాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించిన రాష్ట్ర సర్కారు భూములు, భవనాలు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువను భారీగా పెంచాలని యోచిస్తోంది. బహిరంగ మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ విలువకు మధ్య వ్యత్యాసాలను పరిశీలించి ఎంత పెంచాలనే దానిపై నిర్ణయం తీసుకోనుంది. రిజిస్ట్రేషన్ విలువలను దాదాపు రెట్టింపు చేయాలని భావిస్తోంది.



భూముల విలువలు రెట్టింపు?

ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ కొన్నిచోట్ల 100% వరకు పెంచే అవకాశం

పొలాలు, ప్లాట్లు, నివాస, వాణిజ్య భవనాలకు వర్తింపు

2022లోనూ వంద శాతం దాకా పెంచిన సర్కారు.. మరీ తక్కువ ధరలున్న చోట్ల భారీగా పెంపు

జిల్లా, డివిజన్, మండలాల వారీగా పెంపు కమిటీలు.. హెచ్‌ఎండీఏ పరిధిలో భారీగా పెరిగే చాన్స్

హైదరాబాద్ మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై అధికారుల స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. పెంపునకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో భూములు, భవనాలు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ ఎంత పెరుగుతుందనే విషయమై రియల్ ఎస్టేట్ వర్గాల్లో కూడా చర్చ మొదలైంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ విలువలను 50 నుంచి 100 శాతం వరకు పెంచే అవకాశం ఉంది. బహిరంగ మార్కెట్ విలువకు, రిజిస్ట్రేషన్ విలువకు మధ్య వ్యత్యాసాలను శాస్త్రీయంగా పరిశీలించి, ఎంత శాతం పెంచాలన్న దానిపై ఒక అంచనాకు రానున్నారు. మార్కెట్ విలువకు, రిజిస్ట్రేషన్ విలువకు భారీ వ్యత్యాసం ఉన్న చోట వంద శాతానికి మించి కూడా పెంచాలనే అభిప్రాయంతో అధికారులు ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో 2021, 2022 సంవత్సరాల్లో వరుసగా రెండుసార్లు భూముల రిజిస్ట్రేషన్ విలువలను పెంచారు. ఆ తర్వాత 2023లో ఎన్నికల సంవత్సరం కావడంతో పెంచలేదు. 2021 జులై 22న పెంచినపుడు 30 నుంచి 50 శాతం వరకు పెంపుదల ఉంది. ఆ తరువాత 2022 ఫిబ్రవరి 1న పెంచినపుడు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో కూడా భూముల రిజిస్ట్రేషన్ ధరలు 100-150 శాతం మేర పెరిగాయి. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రాష్ట్ర ఖజానాకు 2023-24లో సుమారు 15 వేల కోట్ల ఆదాయం వచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను సవరిస్తే ఆదాయం మరో రూ.2000 వేల కోట్ల వరకు పెంచుకోవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. 2021-22లో పెంచినపుడు రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.12,370 కోట్లకు పెరిగింది. అంతకుముందు కరోనా విపత్తును ఎదుర్కొన్న సంవత్సరం వచ్చిన ఆదాయం రూ.5,200 కోట్లు. 2021లో ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలతో పాటు స్టాంప్స్ డ్యూటీని కూడా 1.5 శాతం

మిగతా 13వ పేజీలో...

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచొద్దు

పేదలకు సొంతింటి కలను దూరం చేయొద్దు
భూముల మార్కెట్ విలువను రెట్టింపు చేసి.. స్టాంపు డ్యూటీని 3 శాతానికి తగ్గించాలి
ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు పెరగకుండా చూడాలి
ప్రభుత్వానికి రియల్టర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

13

మాఫీకి మార్గమిదీ!

సెక్షన్-8 కింద రైతు సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రణాళిక

హామీగా ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల రూపేణా ఆదాయ వనరులు



రైతుల పంట రుణాల మాఫీకి రేవంత్ సర్కారు కార్యాచరణ
కార్పొరేషన్ పేరుతో ఒకేసారి బ్యాంకుల నుంచి రూ. 32వేల కోట్లు
ఆ వెంటనే రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ అమలు
బ్యాంకులకు రుణం నెలవారీ వాయిదాలుగా 10-15 ఏళ్లలో చెల్లింపు
ట్రెజరీలో రెండు వేర్వేరు ఖాతాలు..
ప్రతినెలా ఆదాయం మళ్లింపు
మాఫీకి ఏపీ ఫార్ములానే..
కార్పొరేషన్‌కు చట్టబద్ధత కోసం బిల్లు

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): పంట రుణాల మాఫీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. రుణమాఫీ పథకం కోసం పంద్రాగస్టును గడువుగా పెట్టుకున్నప్పటికీ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. రూ.2 లక్షల దాకా ఉన్న రైతుల పంట రుణాలను ఒకేసారి మాఫీ చేసేందుకు ప్రత్యేకంగా రైతు సంక్షేమ కార్పొరేషన్ (ఫార్మర్ వెల్ఫేర్ కార్పొరేషన్- ఎఫ్‌డబ్ల్యూసీ) ఏర్పాటుచేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం తెలిసిందే. ఈ కార్పొరేషన్ ఏర్పాటు దిశగా కార్యాచరణ ప్రణాళికపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పంట రుణాలను ఒకేసారి మాఫీ చేయాలంటే సుమారు రూ.32వేల కోట్లు కావాలి. ఒకేసారి ఇంతపెద్ద మొత్తం ఖజానా నుంచి సమకూర్చడం అంటే కష్టం. అందుకే ప్రత్యామ్నాయ మార్గాల్లో భాగంగా సర్కారు 'ఎఫ్‌డబ్ల్యూసీ ఏర్పాటు' ఆలోచన చేసింది. ఈ కార్పొరేషన్‌కు ఆదాయ మార్గాలను చూపించి రుణమాఫీకి అవసరమయ్యే రూ.32 వేల కోట్లను కార్పొరేషన్ పేరుతోనే బ్యాంకుల నుంచి ఒకేసారి అప్పుగా తీసుకోనుంది. ఆ నిధులతో బ్యాంకులు, సహకార సంఘాల్లో రూ.2లక్షల దాకా

మిగతా 13వ పేజీలో...

రుణమాఫీయే అజెండా!

- నేటి కేబినెట్ భేటీలో దీనిపైనే ప్రధాన చర్చ
- నిధుల సమీకరణపై చర్చించనున్న మంత్రివర్గం
- అజెండాలో ఏపీతో విభజన సమస్యలు 13
- మార్కెట్ విలువలు.. రిజిస్ట్రేషన్ చార్జీల సవరణ
- ధాన్యం కొనుగోళ్లు.. వానాకాలం పంట విధానం
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాల పంపిణీ
- కేబినెట్ సమావేశం నిర్వహణకు ఈసీకి లేఖ

నాలుగో దశలో 69% పోలింగ్

96 ఎంపీ స్థానాలకు 13న ప్రక్రియ పూర్తి 2
తొలిస్థానంలో ఏపీ.. 81.86 శాతం నమోదు
లోక్‌సభ స్థానాల్లో.. ఒంగోలు 87%తో ఫస్ట్
ఎన్నికల సంఘం వెల్లడి

గ్రూప్-4 పోస్టులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక

టీఎస్‌పీఎస్సీ సైట్‌లో జాబితా
సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోండి
అధికారులు సూచన 13
నేడే టీఎస్‌ఈసెట్ ఫలితాలు



వచ్చే రెండు వారాలు భారీ వర్షాలు!

దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వానలు: ఐఎండీ
కోస్తాంధ్ర, తెలంగాణల్లో తేలికపాటి వర్షాలు 12



యూపీలోని బారాబంకీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీని సన్మానిస్తున్న మహిళలు

మహాలక్ష్మితో మెట్రోకు దెబ్బ!

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో మెట్రో 50% ఖాళీ

- ఈ పథకంతో ట్రాఫిక్‌కు, పర్యావరణానికీ ఇబ్బందులు
- ఎన్నికల కోసం ఖజానాను ఖాళీ చేసే హక్కు ఎవరికీ లేదు
- రంజాన్ మాసంలో యుద్ధం ఆపాలని ఇజ్రాయెల్‌ను కోరా
- ముస్లింల అంశంలో విమర్శలొస్తున్నా ఇలాంటివి చెప్పలేను
- కాంగ్రెస్, ఎస్పీ వస్తే అయోధ్య రామాలయంపైకి బుల్డోజరే!
- కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో.. మావోయిస్టు డాక్యుమెంట్
- గుడులు, మంగళసూత్రాల్లోని బంగారంపై కన్ను
- యూపీ, హిమాచల్, ముంబై ప్రచార సభల్లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మే 17: "బస్సు ప్రయాణాన్ని (మహిళలకు) ఉచితం చేశారు. మెట్రోను ఖాళీ చేశారు. మరిప్పుడు మెట్రో ఎలా నడుస్తుంది? దేశం ఎలా ముందుకు సాగుతుంది?" ..అంటూ ప్రధాని మోదీ కర్ణాటక, తెలంగాణలో అమలవుతున్న 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పథకంపై పరోక్ష విమర్శలు చేశారు! ఈ పథకం వల్ల ట్రాఫిక్‌కు, పర్యావరణానికీ ఇబ్బందులు కలుగుతాయని వ్యాఖ్యానించారు. అసలు.. ఎన్నికల కోసం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసే హక్కు ఎవ్వరికీ లేదని ఆయన తేల్చిచెప్పారు. రేవంత్ సర్కారు 'మహాలక్ష్మి' పేరిట ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల హైదరాబాద్ మెట్రోకు నష్టాలు వస్తున్నందున 2026 తర్వాత మెట్రోను విక్రయించే యోచన ఉందని ఎల్ అండ్ టీ ప్రెసిడెంట్

మిగతా 2వ పేజీలో...

మేడిగడ్డ రిపేర్లపై నేడు సీఎం నిర్ణయం!

- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు ఆమోదముద్ర వేయనున్న మంత్రివర్గం
- మేడిగడ్డ 7వ బ్లాక్‌లో గేట్ ఎత్తివేత



హైదరాబాద్, మహదేవపూర్ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): వానాకాలం లోపు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు చేయాలనే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) మధ్యంతర నివేదికపై శనివారం మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. కేంద్ర జల వనరులసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ ఛైర్మన్

మిగతా 3వ పేజీలో...



పరిశీలన పూర్తి.. పరిష్కారమెప్పుడు?

- ధరణి స్పెషల్ డ్రైవ్ అర్జీలకు లభించని మోక్షం
- ఎన్నికల హడావుడిలో ఫైళ్ల వైపే చూడని కలెక్టర్లు
- ఇప్పటికీ పెండింగ్‌లోనే 2.45 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది బాధితులు ఎదురు చూస్తున్నారు. ధరణి దరఖాస్తులకు సంబంధించిన అంతర్గత పరిశీలన పూర్తయినప్పటికీ, ఇంకా పెండింగ్‌లోనే ఉంచారు. ఈ ప్రక్రియను రెవెన్యూ అధికారులు ఎప్పుడు చేపడతారోనన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి దరఖాస్తులు పరిష్కారం కాక

మిగతా 13వ పేజీలో...



జేఎంఎం నుంచి సీతా సోరెన్ బహిష్కరణ

న్యూఢిల్లీ, మే 17: ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నుంచి మాజీ ఎమ్మెల్యే సీతా సోరెన్‌ను బహిష్కరిస్తూ ఆ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకొంది. ఆమె ప్రస్తుతం జైలులో ఉన్న మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు వదిన కావడం గమనార్హం. జేఎంఎం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె మార్చి 20న బీజేపీలో చేరారు. ప్రస్తుతం దుమ్కా నియోజక వర్గం నుంచి బరిలో ఉన్నారు. దీంతో, ఆమెను జేఎంఎం నుంచి ఆరేళ్లు బహిష్కరించారు.



రాయ్‌బరేలీలో తల్లి సోనియాను ఆప్యాయంగా ముద్దాడుతున్న రాహుల్

నా బిడ్డను మీకు అప్పగిస్తున్నా!

» 20ఏళ్లు నన్ను ఆదరించారు.. నా కుమారుడినీ అలాగే చూడండి

» నా దగ్గర ఉన్నదంతా మీరిచ్చిందే.. రాయ్‌బరేలీలో సోనియాగాంధీ

రాయ్‌బరేలీ, మే 17: 'మా అబ్బాయిని మీకు అప్పగిస్తున్నాను' అని రాయ్‌బరేలీ ఓటర్లను ఉద్దేశించి ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ వ్యాఖ్యానించారు. వరుసగా 20 ఏళ్లపాటుగా ఎంపీగా తనకు అవకాశం ఇచ్చినందుకు రాయ్‌బరేలీ ప్రజలకు సోనియా కృతజ్ఞతలు తెలిపారు శుక్రవారం ఇక్కడ జరిగిన ప్రచార సభలో రాహుల్, ప్రియాంకతో కలిసి ఆమె పాల్గొన్నారు. ' నా దగ్గర ఉన్న ప్రతిదీ మీరు ఇచ్చిందే. అందరినీ ఆదరించాలని, బలహీనులకు అండగా ఉండాలని, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలని మీరూ (రాయ్‌బరేలీ ప్రజలు), ఇందిరా గాంధీ నాకు నేర్పించారు. అవే పాఠాలు నేను నా పిల్లలు రాహుల్, ప్రియాంకలకు కూడా బోధించాను. నన్ను ఆదరించినట్టే రాహుల్‌ను కూడా చూడండి' అంటూ ఒకింత ఉద్వేగానికి సోనియా గురయ్యారు. సోనియా 2004లో రాయ్‌బరేలీలో గెలిచి తొలిసారి పార్లమెంటులో అడుగుపెట్టారు. అప్పటినుంచి ఆమె ఇక్కడి నుంచే లోక్‌సభకు ఎన్నికవుతున్నారు. అయితే, ఈసారి ఆమె రాజస్థాన్ నుంచి తొలిసారి రాజ్యసభకు వెళ్లారు. దీంతో ఈ ఎన్నికల్లో ఆమె స్థానంలో రాహుల్ పోటీచేస్తున్నారు. ఇదిలా ఉండగా, రాయ్‌బరేలీ తమ ఫ్యామిలీ సీటు అన్న ప్రియాంక వ్యాఖ్యలను అమిత్ షా తప్పుబట్టారు. "ప్రజాస్వామ్యంలో ఫ్యామిలీ సీట్లు ఉండవు. అన్నీ జనం సీట్లే ఉంటాయి" అని వ్యాఖ్యానించారు. 'ఇండియా'ను కుటుంబ కూటమిగా ఆయన ఎద్దేవా చేశారు.

ఏ సాక్ష్యాలతో కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు: సుప్రీం

న్యూఢిల్లీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎక్సైజ్ విధానం కేసులో సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు తాజా సాక్ష్యాధారాలు ఏమున్నాయో చెప్పాల్సిందిగా సుప్రీంకోర్టు ఈడీని ప్రశ్నించింది. తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ పై వాదోపవాదాలు విన్న సుప్రీంకోర్టు శుక్రవారం తన తీర్పును రిజర్వు చేసింది. ఈ లోపు రెగ్యులర్ బెయిల్ కోసం కింది కోర్టులో దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ ఆయనకు ఉన్నదని తెలిపింది. కేజ్రీవాల్ ఎన్నికల్లో ప్రచారం చేసుకునేందుకు వీలుగా ఆయనకు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్‌ను సుప్రీం ఇప్పటికే మంజూరు చేసింది. సిసోడియా అరెస్టు తర్వాత కేజ్రీవాల్‌కు సంబంధించి కొత్త సాక్ష్యాధారాలు ఏమి లభించాయో తమకు లిఖిత పూర్వకంగా వివరించాల్సిందిగా న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ఈడీని ప్రశ్నించారు. ఈడీ వద్ద ఉన్న సాక్ష్యాలన్నీ 2023 జులై, ఆగస్టు నెలలకు సంబంధించినవని, ఈ సాక్ష్యాలన్నీ సిసోడియా విషయంలో లభించినవేనని కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. గోవా ఎన్నికల్లో నిధుల ఉపయోగానికి సంబంధించి ఎలాంటి సాక్ష్యాలు లేవని ఆయన చెప్పారు. 2023 ఆగస్టు నుంచి మొత్తం రూ.100 కోట్ల ముడుపుల చుట్టే కథ తిరుగుతోందని, ఈ పాత కథ ప్రకారమే 2024 మార్చిలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, నిజానికి డబ్బు మళ్లింపే జరగలేదని సింఘ్వీ చెప్పారు. మనీలాండరింగ్ చట్టం సెక్షన్ 19ను ఈడీ తిరగరాస్తున్నట్లున్నదని సింఘ్వీ వ్యాఖ్యానించారు. అయితే, హవాలా ద్వారా ముడుపులు ముట్టాయని ఈడీ రుజువు చేసిందని, ఎన్నికల ప్రచారంలో ఉన్నవారే ఈ మొత్తాన్ని పంపిణీ చేశారని ఏఎస్‌జీ ఎస్వీ రాజు అన్నారు. నిందితుడు నేరస్తుడని నమ్మడానికి తగిన ఆధారాలు దొరకనంతవరకు సెక్షన్ 19కింద ఈడీ తన అధికారాలు ఉపయోగించరాదని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది.

ప్రజాస్వామ్య అంతమే మోదీ లక్ష్యం: కేజ్రీవాల్

ముంబై, మార్చి 17: ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శించారు. దేశాన్ని నియంతృత్వం వైపు ఆయన నడిపిస్తున్నారని అన్నారు. ముంబయిలోని బీకేసీ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన ఇండియా కూటమి సభలో ఆయన ప్రసంగించారు. మోదీతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని చెప్పారు. ప్రత్యర్థులను ఓడించలేకపోతే వారిని అరెస్టు చేసి జైలులో వేయాలన్న విధానాన్ని పాటిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ మోదీకి వ్యతిరేకంగా ప్రజలంతా ఉన్నారని, అందుకే ఆయన భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్ ప్రసంగిస్తూ మోదీ కష్టసమయంలో ఉన్నప్పుడు శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రే ఆయనకు ఎంతగా సాయపడ్డారో మహారాష్ట్ర ప్రజలకు తెలుసని, కానీ మోదీ ఇప్పుడు వాటన్నింటినీ మరిచిపోయారని విమర్శించారు.

పోలింగ్ ముగిసిన 48 గంటల్లో వివరాలన్నీ ఇవ్వాలి

» సుప్రీంలో పిటిషన్.. అత్యవసర విచారణ చేపట్టిన ధర్మాసనం

న్యూఢిల్లీ, మే 17: ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన 48 గంటల్లోగా ఓటింగ్‌కు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్లో పెట్టాలంటూ దాఖలైన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు అత్యవసర విచారణ చేపట్టింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం శుక్రవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో విచారణ ప్రారంభించింది. న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ ఎ.ఎస్.బోపన్న గౌరవార్థం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సభ ముగిసిన తర్వాత సీజేఐ విచారణను చేపట్టడం గమనార్హం. ఈ కేసును శుక్రవారమే చేపట్టాలంటూ ఉదయమే న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు. అందుకు స్పందించిన సీజేఐ కోర్టు సమయం ముగిసిన తరువాత కూడా విచారణ జరిపారు. ఈ అంశంపై సమాధానం ఇచ్చేందుకు సమయం కావాలని ఈసీ తరపు న్యాయవాది కోరడంతో ఇది సమంజసమేనని, వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. తగిన వెకేషన్ బెంచ్ ముందు ఈ నెల 24న లిస్ట్ చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు. ఏడీఆర్ స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్ దాఖలు చేసింది.

'ఓటరు గోప్యత'పై పిల్‌ను కొట్టేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, మే 17: ప్రస్తుత ఎన్నికల విధానంలో ఓటరు గోప్యతకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ పిటిషన్‌కు ఎటువంటి విచారణార్హత లేదని పేర్కొంది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. 'వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్) స్లిప్పులు, ఈవీఎంలలోని డేటా ఆధారంగా ప్రిసైడింగ్ అధికారి ఓటరు ఏ పార్టీకి ఓటేశారో గుర్తించవచ్చు' అని చెప్పారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేస్తూ.. ఈవీఎంలపై అనుమానాలు నిరాధారమంటూ గత నెల 26న ఇచ్చిన తీర్పును చదవలేదా? అని ప్రశ్నించింది. పిటిషనర్ న్యాయవాది లేదని బదులివ్వగా.. చదివి ఉంటే ఈ పిటిషన్ వేసేవారు కాదని వ్యాఖ్యానించింది. 'సాంకేతిక అంశాలను పరిశీలించిన తర్వాతే ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహించడమే సరైందని నిర్ణయించాం' అంటూ పిల్‌ను కొట్టేసింది.

రాజ్యాంగ ధర్మాసనం తీర్పే శిరోధార్యం

న్యూఢిల్లీ, మే 17: రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చే తీర్పులే శిరోధార్యమని, అంతకన్నా తక్కువ మంది సభ్యులతో ఏర్పాటయ్యే బెంచ్‌లు వాటిని పాటించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇది ఆమోదం పొందిన విధానమని, ఇందుకోసం ప్రత్యేకంగా చట్టం చేయాల్సిన అవసరం ఏమీ ఉండదని తెలిపింది. హరియాణాకు చెందిన ఓ భూవివాదం విషయమై 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. తదుపరి విచారణను ఆగస్టు ఏడో తేదీకి వాయిదా వేసింది.

కేజ్రీవాల్‌తో కాంగ్రెస్‌కే నష్టం: ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ, మే 17: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు రావడం, పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం చేయడం వంటివి కాంగ్రెస్‌కే నష్టం చేకూరుస్తాయని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అన్నారు. కేజ్రీవాల్ బయటకు రావడం వల్ల బీజేపీకి ఎలాంటి నష్టం జరిగే అవకాశం లేదన్నారు. ఆప్ పోటీ చేస్తున్న పార్లమెంటు స్థానాల్లో పంజాబ్‌లోని 13 చోట్ల కాంగ్రెస్‌తో నేరుగా తలపడుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

మహాలక్ష్మితో మెట్రోకు దెబ్బ!

(మొదటి పేజీ తరువాయి)

శంకర్ రామన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్న సంగతి తెలిసిందే. 'ఇండియా టుడే' ప్రతినిధి ప్రధాని మోదీని ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ అంశాన్ని ప్రస్తావనకు తేగా.. "ఒక నగరంలో మెట్రో రైళ్లు అందుబాటులోకి తెస్తారు. అంతలోనే.. ఎన్నికల్లో గెలవడం కోసం మహిళలకు ఉచిత బస్సు పథకం హామీ ఇస్తారు. అంటే.. మెట్రో ప్రయాణికుల్లో 50 శాతాన్ని తగ్గించేసినట్టే" అని మోదీ వ్యాఖ్యానించారు. అయితే.. ఢిల్లీలో ఈ పథకాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ సర్కారు 2019 నుంచి అమలుచేస్తోంది. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా.. ఎన్నికల సందర్భంగా టీడీపీ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లోని 'మహాశక్తి' కింద ఈ పథకం కూడా ఉండడం గమనార్హం. కాగా.. 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఈ అంశంతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'ముస్లిం వ్యతిరేకి' అంటూ విపక్షాలు తనపై చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో.. ఒక సంచలన విషయాన్ని ఆయన బయటపెట్టారు. ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో గాజాపై వైమానిక దాడులు ఆపాలని కోరుతూ తాను ఇజ్రాయెల్‌కు రాయబారిని పంపానని మోదీ చెప్పారు. తన మాటను మన్నించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేందుకు ఎంతో ప్రయత్నించారని గుర్తు చేశారు. కానీ, చివరికి రెండు, మూడు రోజులు యుద్ధం జరిగిందని తెలిపారు. ముస్లింల అంశంలో ప్రజలు తనపై విమర్శలు చేస్తున్నప్పటికీ ఇలాంటి విషయాలు ప్రచారం చేసుకోవడం తనకు నచ్చదని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ పేర్కొన్నారు. బాంబు దాడులు ఆపాలని తనతోపాటు ఇతర దేశాల నేతలు కూడా ఇజ్రాయెల్‌ను కోరారని, వారి ప్రయత్నాలు ఫలించి ఉంటాయని చెప్పారు. ఇక, ఇజ్రాయెల్‌కు వెళితే పాలస్తీనాకు కూడా వెళ్లాల్సిందే అనే సంప్రదాయాన్ని పక్కన పెట్టి ఆయా దేశాల్లో తాను వేర్వేరుగా పర్యటించానని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వాల పాలకులు ఇజ్రాయెల్‌కు వెళితే మొక్కుబడిగా పాలస్తీనాకు వెళ్లేవారని తెలిపారు. "ఒకసారి జోర్డాన్ గగనతలం మీదుగా పాలస్తీనా వెళుతున్నా. ఆ విషయం తెలుసుకున్న జోర్డాన్ అధ్యక్షుడు నాకు ఫోన్ చేశారు. మోదీజీ మీరు అలా ఎలా వెళ్లిపోతారు.. మీరు మా అతిథి.. మా ఆతిథ్యం స్వీకరించాల్సిందే అని ఇంటికి ఆహ్వానించారు. నేను వారి ఇంటికి వెళ్లి రాత్రి భోజనం చేశా. అనంతరం జోర్డాన్ అధ్యక్షుడి హెలికాప్టర్‌లో పాలస్తీనా బయలుదేరా. ఈ ప్రయాణంలో ఫ్లైట్ అటెండెంట్లుగా ఇజ్రాయెల్ వాళ్లు పని చేశారు. ఇలా ఆ మూడు ప్రాంతాలూ నా కోసం ఆకాశంలో ఒక్కటయ్యాయి' అని మోదీ పేర్కొన్నారు.



ముంబైలోని చైత్యభూమి వద్ద అంబేడ్కర్‌కు మోదీ నివాళి

కాంగ్రెస్, ఎస్పీ వస్తే.. రామాలయంపైకి బుల్డోజర్!

బారాబంకీ, ముంబై, మే 17: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు అధికారం ఇస్తే అయోధ్యలో నిర్మించిన రామాలయంపైకి బుల్డోజర్‌ను పంపుతాయని ప్రధాని మోదీ అన్నారు. బుల్డోజర్లను ఎక్కడ నడపాలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వద్ద ట్యూషన్ చెప్పించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోపై ముస్లింలీగ్ ముద్ర ఉందని గతంలో విమర్శించిన ప్రధాని.. తాజాగా దాన్ని మావోయిస్టు డాక్యుమెంట్‌గా అభివర్ణించారు. ఆలయాల్లోని బంగారంపైన, మహిళల మంగళసూత్రాలోని పుత్తడిపైన కన్నేసిన ఆ మ్యానిఫెస్టో అమలైతే దేశ ఆర్థికాభివృద్ధికి దెబ్బ అని.. దేశం దివాలా తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ముంబైలో జరిగిన పలు ప్రచార సభల్లో ప్రసంగించారు. దేశంలో అస్థిరత సృష్టించడానికే 'ఇండీ' కూటమి ఎన్నికల బరిలో నిలిచిందన్నారు. పోలింగ్ నడిచేకొద్దీ కూటమి పేకమేడలా కూలిపోతోందని.. బీజేపీ కేంద్రంలో హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని స్పష్టం చేశారు. శ్రీరామనవమి రోజు ఎస్పీ సీనియర్ నేత ఒకరు రామాలయం పనికిమాలినదని అన్నారని.. రామాలయానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మార్చేందుకు కాంగ్రెస్ సన్నద్ధంగా ఉందని మోదీ ఆరోపించారు. 'ఈ రెండు పార్టీలకు తమ ఓటుబ్యాంకు కంటే మించింది లేదు. వాటి బండారాన్ని నేను బయట పెడుతుండడంతో మోదీ హిందూ-ముస్లిం విభజన తెస్తున్నారని రచ్చచేస్తున్నారు. బీజేపీ తెచ్చిన ట్రిపుల్ తలాక్ చట్టంతో మన తల్లులు, సోదరీమణులంతా సంతోషంగా ఉన్నారు. బీజేపీని ఆశీర్వదిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ప్రధాని పదవిపై కాంగ్రెస్ పగటి కలలు కంటోందని మోదీ ధ్వజమెత్తారు. మత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని.. కానీ ఇండీ కూటమి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను లాక్కుని తమ ఓటుబ్యాంకుకు కట్టబెట్టాలని చూస్తోందని ధ్వజమెత్తారు.

లోకం తీరు

కేంద్రంలో వైసీపీ మీద ఆధారపడే ప్రభుత్వం రావాలి : మంత్రి



నాలుగో దశలో

69 శాతం పోలింగ్

» వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, మే 17(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నాలుగో దశ పోలింగ్‌లో దేశవ్యాప్తంగా 69.16 శాతం పోలింగ్ నమోదైంది. గత మూడు దశలలో జరిగిన ఎన్నికల కంటే నాలుగోదశలోనే అత్యధికంగా పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 13న దేశ వ్యాప్తంగా 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 96 పార్లమెంటు స్థానాల్లో పోలింగ్ జరిగింది. 10 రాష్ట్రాలలో జరిగిన పోలింగ్‌తో పోలిస్తే అత్యధికంగా ఏపీలో 80.66 శాతం(పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 81.86%) పోలింగ్ నమోదైంది. ఏపీలో ఒకే దశలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగడంతో అత్యధికంగా ఓటర్లు పాల్గొన్నట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా, ఏపీలోని 25 పార్లమెంటు స్థానాలలో అత్యధికంగా ఒంగోలులో 87.06శాతం, విశాఖపట్నంలో అత్యల్పంగా 71.11 శాతం పోలింగ్ నమోదైంది. ఏపీ తర్వాత రెండో స్థానంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో 80.22 శాతం నమోదైంది. నాలుగో దశలో పురుష ఓటర్ల పోలింగ్ 69.58 శాతం ఉండగా మహిళల పోలింగ్ శాతం 68.73గా నమోదైనట్టు ఈసీ వివరించింది. ఐదో దశ పోలింగ్ ఈ నెల 20న జరగనుంది. మొత్తం 49 పార్లమెంటు స్థానాలు సహా ఒడిశాలోని అసెంబ్లీ స్థానాలకు కూడా పోలింగ్ నిర్వహించనున్నారు.

బెంగాల్ బీజేపీ అభ్యర్థికి ఈసీ షోకాజ్ నోటీసు

» మమతపై చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, మే 17: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పేర్కొంటూ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు ఎలక్షన్ కమిషన్ షోకాజ్ నోటీసు జారీ చేసింది. తామ్‌లుక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆయన బుధవారం హల్దియాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ సీఎం మమతా బెనర్జీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించిన ఎలక్షన్ కమిషన్ ఆయన ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్టు ప్రాథమికంగా కనిపిస్తోందని తెలిపింది. దీనిపై సమాధానం చెప్పాలంటూ నోటీసు ఇచ్చింది. అభిజిత్ గంగోపాధ్యాయ చేసిన ప్రసంగం వీడియోను జత చేస్తూ బుధవారమే తృణమూల్ కాంగ్రెస్ ఈ ఫిర్యాదు చేసింది. అయితే ఈ వీడియో నకిలీదని బీజేపీ విమర్శించింది. గంగోపాధ్యాయ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు మమతా బెనర్జీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు తీర్పులు ఇవ్వడం గమనార్హం.

కన్హయ్య కుమార్‌కు చెంపదెబ్బ

న్యూఢిల్లీ, మే 17: ఈశాన్య ఢిల్లీ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్‌కు ఎన్నికల ప్రచారంలో శుక్రవారం చేదు అనుభవం ఎదురైంది. పూల దండ వేసేందుకు కన్హయ్య కుమార్ దగ్గరకు వచ్చిన కొందరు గుర్తు తెలియని యువకులు అతనిపై దాడి చేశారు. మెడలో దండ వేస్తూ కన్హయ్య కుమార్ చెంప మీద కొట్టారు. ఆపై, దాడిని కొనసాగిస్తుండగా చుట్టుపక్కల ఉన్నవారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గందరగోళం నెలకొనగా.. దాడికి పాల్పడిన యువకులు అక్కడ ఉన్న వారిపై నల్ల రంగు సిరా చల్లారు. ఢిల్లీ, కర్తార్‌నగర్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం వద్ద ఘటన జరిగింది. ఆప్ నేత, కర్తార్‌నగర్ కౌన్సిలర్ ఛాయ గౌరవ్ శర్మతో ఆప్ కార్యాలయంలో సమావేశమైన తర్వాత కన్హయ్య కుమార్ బయటకు రాగానే ఈ దాడి జరిగింది. దాడిని అడ్డుకోబోయిన కౌన్సిలర్ శర్మ, ఆమె భర్తపై కూడా ఆ యువకులు దాడికి పాల్పడ్డారు. కౌన్సిలర్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, దేశ విభజనపై మాట్లాడడం, సైన్యాన్ని అవమానించడంతోనే కన్హయ్య కుమార్‌పై దాడి చేశామని కొందరు యువకులు చెబుతున్న వీడియో వైరలైంది.

బిభవ్ 8 సార్లు చెంపపై కొట్టాడు

ఛాతి, కడుపులో బలంగా తన్నాడు.. బొక్కలు విరగ్గొడతానన్నాడు

» ఫిర్యాదులో స్వాతి మాలివాల్ ఆరోపణలు

న్యూఢిల్లీ, మే 17: ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్‌కుమార్ 7-8 సార్లు తనను చెంపపై బలంగా కొట్టాడని ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలివాల్ ఆరోపించారు. అకారణంగా తనపై దాడి చేశారని తెలిపారు. "సీఎం కేజ్రీవాల్‌ను కలిసేందుకు ఆయన ఇంటికి వెళ్లి కూర్చున్న నా దగ్గరకొచ్చిన బిభవ్.. ఒక్కసారిగా దాడికి దిగాడు. 7-8 సార్లు చెంపపై కొట్టాడు. ఛాతి, కడుపుపై కాలితో తన్నాడు. ఏం జరుగుతుందో అర్థం కాక నేను షాక్‌కు గురయ్యా. సాయం కోసం అరిచా. కానీ, ఎవ్వరూ రాలేదు. పరిగెడుతుంటే నా చొక్కా పట్టుకొని వెనక్కి లాగాడు. తల వెళ్లి టేబుల్‌కి తగిలింది. సున్నితమైన శరీర భాగాలపై పలుమార్లు కొట్టాడు. ఛాతీ, పొట్టపైనా కొట్టాడు. నెలసరి సమయమని, వదిలిపెట్టమని వేడుకున్నా వినిపించుకోలేదు" అని ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ చీఫ్ కూడా అయిన స్వాతి మాలివాల్ పోలీసులకు చేసిన ఫిర్యాదులో వివరించారు. "నీ ఇష్టం వచ్చింది చేసుకో. మాకేం కాదు. నీ బొక్కలు విరగ్గొట్టి, పాతిపెడతాం. ఆ ప్రాంతాన్ని ఎవ్వరూ కనిపెట్టలేరు" అని బిభవ్‌కుమార్ బెదిరించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఆమె ఫిర్యాదు తీసుకున్న పోలీసులు.. బిభవ్‌పై కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఈ నెల 13న జరగ్గా.. ఆప్ కూడా ధ్రువీకరించింది.

స్వాతి ముఖంపై గాయాలు..

దాడి ఆరోపణల నేపథ్యంలో ఆప్ ఎంపీ స్వాతికి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె ముఖంపై అంతర్గత గాయాలైనట్లు ఈ పరీక్షలో తేలిందని వైద్య వర్గాలు వెల్లడించాయి. కాగా, దాడి ఘటనపై తొలిసారి స్పందించిన స్వాతి.. అది చాలా దురదృష్టకరమన్నారు. ఈ విషయాన్ని రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, స్వాతిపై దాడి ఘటనలో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) నోటీసులు ఇచ్చినప్పటికీ బిభవ్ కుమార్ విచారణకు హాజరవలేదు. దీంతో శుక్రవారం ఎన్‌సీడబ్ల్యూ అధికారులు మరోసారి ఆయన ఇంటికి వెళ్లారు. అయితే ఆయన భార్య నోటీసులు తీసుకునేందుకు నిరాకరించడంతో గేటుకు అతికించి వచ్చారు. శనివారం బిభవ్ విచారణకు రాకపోతే తానే స్వయంగా వెళతానని ఎన్‌సీడబ్ల్యూ చీఫ్ రేఖా శర్మ తెలిపారు. ఈ ఘటన పట్ల కేజ్రీవాల్ మౌనంగా ఉండడంపై స్పందిస్తూ.. ఆయన మహిళకు అన్యాయం జరిగినా పట్టించుకోరన్న విషయం అర్థమైందన్నారు. కాగా, గతంలో తనకూ ఇలాంటి అనుభవాలు ఎదురైనట్లు ఆప్ మాజీ నాయకురాలు షాజియా సంచలన ఆరోపణలు చేశారు.



స్వాతి మాలీవాల్

అంతా బీజేపీ కుట్ర: ఆప్

స్వాతి బీజేపీతో చేతులు కలిపిందని ఆప్ ఆరోపించింది. కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకున్న బీజేపీయే ఈ కుట్రలు చేస్తోందని ఆప్ నేత అతిషి ఆరోపించారు. కేజ్రీవాల్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే స్వాతితో ఈ డ్రామాలు ఆడిస్తోందని ధ్వజమెత్తారు. కేజ్రీవాల్ ఇంట్లో స్వాతి మాలివాల్ సెక్యూరిటీ గార్డులతో ఘర్షణ పడుతున్నట్లుగా ఉన్న వీడియో విడుదల చేశారు. ఆమె దుస్తులేమీ చినిగిపోలేదని, తలకూ ఎలాంటి గాయం కాలేదని అతిషి తెలిపారు.

నెహ్రూ హయాంలోనే చైనా ఆక్రమణ

» ఇప్పుడు మోదీని దోషి అంటున్నారు

న్యూఢిల్లీ, మే 17: కాంగ్రెస్ పార్టీపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మరోసారి ధ్వజమెత్తారు. భారత తొలి ప్రధాని నెహ్రూ హయాంలోనే చైనా దురాక్రమణకు దేశ భూభాగాన్ని కోల్పోయామన్నారు. తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ సమీపంలో చైనా ఒక మోడల్ విలేజ్‌ను నిర్మిస్తోందని, తూర్పు లద్ధాఖ్‌లోని భూభాగాన్ని కబ్జా చేస్తోందన్న ప్రతిపక్షాల ఆరోపణలపై ఆయన దీటుగా స్పందించారు. మోడల్ గ్రామాన్ని నిర్మిస్తున్న ప్రాంతాన్ని 1950వ దశకం చివర్లో నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు చైనా స్వాధీనం చేసుకుందని చెప్పారు. వివాదానికి కేంద్రంగా మారిన ఈ గ్రామం లాంగ్జు అనే ప్రాంతంలో ఉందన్నారు. పార్లమెంట్ రికార్డులు పరిశీలించినా, సరిహద్దు వివాదంపై ఇంకేదైనా పుస్తకం చదివినా ఈ ప్రాంతాన్ని 1959లో చైనీయులు స్వాధీనం చేసుకున్న విషయం తెలుస్తుందని తెలిపారు. దీనిపై 1959లో నెహ్రూ పార్లమెంట్‌లో మాట్లాడుతూ 'నన్ను క్షమించండి. అది నా చేతుల్లో నుంచి జారిపోయింది' అని అన్నారని గుర్తుచేశారు. 'ఇక వారు చెబుతున్న రెండో అంశం వంతెన. ప్యాంగాంగ్ సరస్సుకు ఉత్తరం వైపు ఒక వంతెనను నిర్మిస్తున్నారు. ఇది ఖుర్నాక్ కోటకు సమీపంలో ఉంది. 1962 యుద్ధంలో చైనా ఖుర్నాక్ కోట ప్రాంతాన్ని ఆక్రమించుకొంది' అని జైశంకర్ పేర్కొన్నారు.




జైశంకర్

భారత ఆహార ఉత్పత్తుల్లో

400కిపైగా కలుషితం

న్యూఢిల్లీ, మే 17: 2019-2024 మధ్యకాలంలో భారత్ నుంచి ఎగుమతైన 400కిపైగా ఆహార ఉత్పత్తుల్లో కాడ్మియం, పురుగుమందులు, ఫంగస్ వంటివాటితో కలుషితమైనట్టు యూరోపియన్ యూనియన్ (ఈయూ) తాజాగా వెల్లడించింది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన 14 ఉత్పత్తుల్లోని విష రసాయనాలు శరీరంలోని వివిధ అవయవాలను దెబ్బతీస్తాయని గుర్తించారు. ఆక్టోపస్, స్క్విడ్ సహా 21 ఉత్పత్తుల్లో కాడ్మియం ఉందని, ఇది చాలా విషపూరితమని పేర్కొన్నారు. దీన్ని తీసుకుంటే దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి, హృద్రోగ సమస్యలను పెంచుతుందని, ఇది కేన్సర్‌కు కూడా కారణమవుతుందని తెలిపారు. ఈ నివేదిక ప్రకారం.. బియ్యం, మూలికలు, సుగంధ ద్రవ్యాలతో సహా 59 రకాల ఉత్పత్తుల్లో కేన్సర్‌కు కారణమయ్యే పురుగుమందులు ఉన్నాయి. మిరపకాయలు, బియ్యం, కాఫీ సహా 10 ఉత్పత్తుల్లో నిషేధిత మైకోటాక్సిన్-ఎ.. అశ్వగంధ, నువ్వుల గింజలతోపాటు 100 ఇతర ఉత్పత్తుల్లో సాల్మొనెల్లా ఉన్నాయి. కాగా, పంటలు, ఆహార ఉత్పత్తులపై రసాయనాలను మితిమీరి వాడుతున్నారని దాఖలైన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి శుక్రవారం నోటీసులు జారీ చేసింది.

పూర్తిగా 'ఎక్స్'గా మారిన ట్విటర్



పారిస్, మే 17: సామాజిక మాధ్యమ దిగ్గజం ట్విటర్ ఇక పూర్తిగా 'ఎక్స్'గా మారిపోయింది. ట్విటర్ పేరును ఎక్స్‌గా మారుస్తున్నట్లు ఆ సంస్థ అధినేత ఈలన్ మస్క్ గతంలోనే ప్రకటించి లోగోను మార్చినా.. ఆ సంస్థ వెబ్‌సైట్ మాత్రం ట్విటర్ పేరుతోనే కొనసాగుతూ వచ్చింది. తాజాగా వెబ్‌సైట్ పేరును కూడా "గీ.ఛొాయు" గా మార్చివేశారు. ఈ విషయాన్ని మస్క్ శుక్రవారం ప్రకటించారు. మస్క్ 2022లో ట్విటర్‌ను కొనుగోలు చేశారు. గతేడాది జులైలో ఆ సంస్థ పేరును ఎక్స్‌గా మార్చారు. కాగా, ఎక్స్‌ను చైనాకు చెందిన సోషల్ మీడియా యాప్ 'వీ చాట్'కు దీటుగా తీర్చిదిద్దుతానని మస్క్ ప్రకటించారు. వీచాట్‌లో వాయిస్, వీడియో కాల్స్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ బుకింగ్, పేమెంట్లు చేయవచ్చు. .

జాతీయంలో స్థానికం


» ఢిల్లీలో 52 చిన్నపార్టీల నుంచి అభ్యర్థులు

» జాతీయ పార్టీల నేతలకు కొత్త తలనొప్పి

అంజన్ ఆద్మీ పార్టీ.. ఆప్కీ అప్నీ పార్టీ.. గరీబ్ ఆద్మీ పార్టీ..! ఇవెక్కడి పార్టీలు..? ఈ పేర్లే వినలేదు ఎప్పుడూ అనుకుంటున్నారా? సరే.. లాగ్ పార్టీ, హమారా సాహి వికల్ప్ పార్టీ.. ఓటర్స్ పార్టీ..! మరి వీటి గురించైనా తెలుసా.. ఢిల్లీలో ఇలాంటి చిన్నాచితక 52 పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో తమ అభ్యర్థులను పోటీకి నిలిపాయి. మూడు జాతీయ పార్టీలకు చెందిన, పలుసార్లు ఎంపీలుగా నెగ్గిన బీజేపీ, ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ అభ్యర్థులకు వీరంతా చెవిలో జోరీగలా మారారు. వీటి తరఫున పోటీకి నిలిచినవారిలో కార్మికులు, మత గురువులు, జర్నలిస్టులు, లాయర్లు వంటి విభిన్న రంగాలకు చెందినవారు ఉన్నారు. అంజన్ ఆద్మీ, ఆప్కీ అప్నీ, గరీబ్ ఆద్మీ వంటి పార్టీలు రాష్ట్రంలో అధికార ఆప్ పేరును పోలి ఉన్నాయి. 1.52 కోట్ల మంది ఓటర్లున్న హస్తినలో ఏడు లోక్‌స్థానాలకు ఈ నెల 25న పోలింగ్ జరగనుంది.

గెలుపు ముఖ్యం కాదు..

అనామక పార్టీల నుంచి అభ్యర్థులుగా నిలిచినవారిలో ఎక్కువమంది తమ విజయం కంటే మూడు ప్రధాన పార్టీలకు చెందిన ఓట్లను సాధ్యమైనంతగా చీల్చాలని భావిస్తున్నారు. వాయువ్య ఢిల్లీ నుంచి వోటర్స్ పార్టీ తరఫున పోటీకి దిగిన నందారామ్ బగ్రి (71) తన చేతిలో ఉన్న నగదు రూ.వెయ్యి మాత్రమే అని అఫిడవిట్‌లో చూపారు. ఈ నియోజకవర్గం అభ్యర్థుల్లో ఈయనొక్కరే నిరక్షరాస్యుడు. "ఉచిత విద్యుత్తు, ఉచిత కరెంటు, ఖాతాల్లో రూ.15 లక్షల జమ వంటి ప్రధాన పార్టీలు ఇస్తున్న హామీలను మేం ఎప్పుడో ఇచ్చాం. మా నుంచే ఆ పార్టీలు కాపీ కొట్టాయి" అని బగ్రి పేర్కొంటున్నారు. యోగేందర్ చందోలియా (బీజేపీ), ఉదిత్ రాజ్ (కాంగ్రెస్)లను ఈయన సవాల్ చేస్తున్నారు. కాగా, ఒంటరి మహిళ సీమా రిజ్వీ (41) చాందినీ చౌక్ నియోజకవర్గం నుంచి భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌కు చెందిన ఆజాద్ సమాజ్ పార్టీ తరఫున బరిలో నిలిచారు. చాందినీ చౌక్‌లో కాంగ్రెస్ తరఫున మూడుసార్లు గెలిచిన జేపీ అగర్వాల్ పోటీకి దిగారు. వ్యాపారవేత్త ప్రవీణ్ ఖండేల్వాల్‌ను బీజేపీ టికెట్ ఇచ్చింది. పశ్చిమ ఢిల్లీ నుంచి పోటీ చేస్తున్న ఇండిపెండెంట్ జర్నలిస్టు రమేష్‌కుమార్ జైన్ (గరీబ్ ఆద్మీ పార్టీ)ది మరో ప్రత్యేకత. ఈయన తనకు ఓటు వేయాలని అడగడం లేదు. దాని బదులు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అభ్యర్థిస్తున్నారు. కాగా, గత రెండు ఎన్నికల్లోనూ ఢిల్లీలోని ఏడు స్థానాలనూ బీజేపీనే గెలుచుకుంది. ఈసారి ఇండియా కూటమిలో భాగంగా ఆప్ 4, కాంగ్రెస్ మూడు స్థానాల్లో అభ్యర్థులను దించాయి. - సెంట్రల్ డెస్క్



యాదగిరిగుట్టలో ఈ నెల 20 నుంచి 22 వరకు స్వామివారి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరి గుట్ట, పాతగుట్ట, దబ్బకుంటపల్లిలో వేడుకలు జరుగుతాయని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

- లేకపోతే కేంద్రం నిధులు దారిమళ్లే చాన్స్
- బీజేపీతోనే పంచాయతీల ప్రగతి: సంజయ్
- వెంకట్రామిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించండి
- సీఈవో వికాస్‌రాజ్‌కు రఘునందన్ విజ్ఞప్తి



వికాస్‌రాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న రఘునందన్

హైదరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులు గ్రామ పంచాయతీలకు నేరుగా అందాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని తప్పనిసరిగా గెలిపించాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. కేంద్రం గ్రామ పంచాయతీలకు విడుదల చేసే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించే ప్రమాదం ఉందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ ప్రజలను అడుగడుగునా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పి.. మాట తప్పిందని విమర్శించారు. నిన్నటి దాకా పార్లమెంట్ ఎన్నికల సాకు చూపి దాటవేత ధోరణిని ప్రదర్శించిందని, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోందని అన్నారు. 6 గ్యారెంటీల అమలుకు ఎన్ని నిధులు అవసరం..? విధివిధానాలేమిటి..? అనే దానిపై నేటికీ కసరత్తు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరు బాట చేపట్టాలని కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ నేతలకు సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం వడ్ల కళ్లాలను సందర్శించాలని, 20న తహశీల్దార్లు, కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాలని, 21న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షలు చేపట్టాలని కోరారు.

వెంకట్రామిరెడ్డిపై సీఈవోకు ఫిర్యాదు

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మెదక్ పరిధిలోని 27 పోలింగ్ బూత్‌ల పరిధిలో పంపిణీ చేసేందుకు తెచ్చిన రూ.84 లక్షలు ఒకే కారులో దొరికాయని.. అవి బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డివేనని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తరఫున ఆ పార్టీ ముఖ్య నేత హరీశ్ రావు, మరో ఆరుగురు ఎమ్మెల్యేలు డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. పట్టుబడిన రూ.84 లక్షలు బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి సంబంధించినవే అయినా.. ఆ కేసులో ఆయనను ఏ-5గా చేర్చారని పేర్కొన్నారు. తన ఫిర్యాదుపై ఇక్కడి అధికారులు స్పందించకుంటే ఢిల్లీ వెళ్లి చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని రఘునందన్‌రావు వెల్లడించారు.

ధాన్యం కొనుగోళ్లలో అంతులేని అవినీతి: ఏలేటి

ధాన్యం కొనుగోళ్లలో అంతులేని అవినీతి జరుగుతోందని, దీనికి బాధ్యత వహిస్తూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మిల్లర్లు విచ్చలవిడిగా దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దళారులకు లబ్ధి చేకూరేలా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ఆరోపించారు. తూకాల్లో మోసం, తాలు, తేమ పేరుతో ధరలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు.

నెత్తురోడిన రహదారులు

- రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం

జోగిపేట/చిట్యాల రూరల్/కూసుమంచి, మే 17: అతి వేగంతో వాహన ప్రయాణం ప్రాణాలు తీస్తోంది. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. ఇందులో సంగారెడ్డి జిల్లా జోగిపేట సమీపంలో రాంసాన్‌పల్లి శివారులో 161వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబమే బలైపోయింది. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం తాడ్కూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(35), సునీత(30) దంపతులకు కుమారుడు నగేష్(7) ఉన్నాడు. వీరు ముగ్గురు శుక్రవారం బైక్‌పై తాడ్కూర్ నుంచి హైదరాబాద్ బయలుదేరారు. రాంసాన్‌పల్లి శివారులో వీరి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఇక, ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద గేదెను తప్పించే క్రమంలో ఓ కారు బోల్తా పడింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఖమ్మంకు చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లు(54) మరణించారు. వెంకటేశ్వర్లు తన అల్లుడు దొడ్డపనేని నర్సింహారావుతో కలిసి ఆస్పత్రి పని నిమిత్తం గురువారం కారులో హైదరాబాద్ వచ్చారు. గురువారం రాత్రి ఖమ్మంకు తిరుగు ప్రయాణమైన వీరు జీళ్లచెరువు ఫ్లైఓవర్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఫ్లైఓవర్ దిగగానే ఓ గేదె హఠాత్తుగా అడ్డురాగా డ్రైవింగ్ సీట్‌లో ఉన్న వెంకటేశ్వర్లు సడన్ బ్రేక్ వేశారు. అతి వేగంగా ప్రయాణిస్తున్న కారు దీంతో అదుపు తప్పి బోల్తా కొట్టి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు డోరు ఊడిపోగా వెంకటేశ్వర్లు తల డివైడర్‌కు తగలడంతో అక్కడికక్కడే మరణించారు. మరోపక్క, నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆగి ఉన్న డీసీఎంను బైక్ ఢీకొట్టిన ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సురేంద్రకుమార్(23), ప్రమోద్ మరణించారు. యూపీకి చెందిన సురేంద్ర కుమార్, పంకజ్(20), ప్రమోద్.. చిట్యాల మండలం వెలిమినేడులో నివాసముంటూ భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల శివారులోని ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నారు. విధులకు వెళ్లేందుకు ముగ్గురూ ఒకే బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో వెలిమినేడు శివారులో సుర్కంటిగూడెం దాటాక రోడ్డుపై నిలిపి ఉన్న ఓ డీసీఎంను ఢీకొని ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో సురేంద్రకుమార్ మరణించగా.. పంకజ్, ప్రమోద్‌ను చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరినీ హైదరాబాద్ తరలిస్తుండగా ప్రమోద్ చనిపోయాడు.

మా ఆయన. కాదు మా ఆయనే!

భర్త కోసం ఠాణా మెట్లెక్కిన ఇద్దరు భార్యలు

దిల్‌సుఖ్‌నగర్, మే 17 ఆంధ్రజ్యోతి): అతడిని మా ఆయనే అంటోంది ఈమె.. కాదు కాదు మా ఆయనే అంటోంది ఆమె! ఇలా ఇద్దరు ఓ వ్యక్తి కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. భర్తను తన వెంటే పంపాలని ఒకరు.. కాదు కాదు తనవెంటే పంపాలని మరొకరు భీష్మించారు. ఆ ఇద్దరు మహిళల్లో ఒకరి పేరు హారిక (37), మరొకరి పేరు లావణ్య (25). ఈ ఇద్దరు మహిళలు కోరుకుంటున్న ఆ వ్యక్తి పేరు మధు! జీడిమెట్లలో నివసించే మధు 20 ఏళ్ల క్రితం ఏపీలోని గుంటూరు జిల్లా బాపట్ల మండలం ఎదుల పల్లి గ్రామానికి చెందిన హజీరత్ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టాక హజీరత్ అనారోగ్యంతో మృతి చెందింది. తర్వాత ఆమె చెల్లెలైన హారికను 2009లో మధు పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరూ దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని కోదండరామ్‌నగర్‌లో నివాసిస్తున్నారు. మధు స్పీచ్ థెరపిస్ట్‌గా పనిచేస్తుండగా, హారిక ఓ చీరల షోరూంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తోంది. తాను పనిచేస్తున్న చోట స్పీచ్ థెరపీ కోసం చేరిన ఏపీలోని కాకినాడకు చెందిన లావణ్య అనే యువతితో మధుకు పరిచయమైంది. ఇది ప్రేమకు దారితీసింది. లావణ్యను మధు 2022లో రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. వీరికి 2023లో సంతానం కలిగింది. అప్పటి నుంచి మధు లావణ్య దగ్గరకు రావడం తగ్గించాడు. ఆమె నిలదీయడంతో తన భార్యతో ఇబ్బంది ఎదురవుతోందని చెప్పి.. అప్పుడప్పుడు ఆమె వద్దకు వెళుతున్నాడు. అయితే భర్త మూడో పెళ్లి విషయం హారికకు తెలియడంతో లావణ్య వద్దకు వెళ్లకుండా భర్తను కట్టడి చేసింది. కాగా, భర్త తన ఇంటికి రావడం లేదంటూ లావణ్య శుక్రవారం కోదండరాంనగర్‌లోని మధు, హారిక ఉంటున్న ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. తమకు న్యాయం చేయాలని హారిక, లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగులకు త్వరలో ఒక డీఏ

- జూన్ 2 తర్వాత ఉత్తర్వులు
- బదిలీలు, మెడికల్ బిల్లులపై సర్కారు సానుకూలం
- సీఎంవో కార్యదర్శి శేషాద్రితో..

టీజీవో అధ్యక్షుడు ఏలూరి తదితర నేతల భేటీ

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో ఒక డీఏ లభించనుంది. జూన్ 2 తర్వాత ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఈ మేరకు సీఎంవో కార్యదర్శి శేషాద్రితో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ భేటీలో డీఏ తదితర అంశాలపై ప్రభుత్వం నుంచి హామీ లభించిందని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. జూలై తర్వాత మరో డీఏ కూడా కలిస్తే ఐదవుతాయి. అయితే, ప్రభుత్వం తొలుత ఒక డీఏ ఇచ్చేందుకు సానుకూలత వ్యక్తం చేసిందని శ్రీనివాసరావు తెలియజేశారు. ఆర్థిక పరమైన అంశాలు, ఆర్థికేతర అంశాలను పరిశీలించి.. ఆర్థికేతర అంశాలను వెంటనే పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఆర్థిక పరమైన అంశాల్లో పెండింగ్ డీఏలు, హెచ్‌ఆర్‌ఏ పెంపు, ఐఆర్, సప్లమెంటరీ బిల్స్‌పై అన్నీ ఒకేసారి కాకున్నా దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాసరావు వెల్లడించారు. సాధారణ బదిలీలు, మెడికల్ బిల్లులు, ఇతర సర్వీసు సంబంధిత అంశాలను పరిష్కరిస్తామని తెలిపిందన్నారు. పీఆర్‌సీ నివేదిక ఇవ్వడంలో జాప్యం జరిగితే ఐఆర్ పెంచాలని ప్రభుత్వాన్ని తాము కోరామని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో బుధవారం ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో టీజీవో ప్రతినిధులు సీఎస్ శాంత కుమారిని కలిసి 18 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి డిమాండ్‌కు సంబంధించి డిటైల్డ్ నోట్ కూడా సమర్పించారు. ఉద్యోగుల డిమాండ్లను సీఎస్ అదే రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం.. ఉద్యోగుల వినతులను పరిశీలించాలని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ఆదేశించారు. గురువారం టీజీవో నాయకులతో చర్చించిన వేం నరేందర్.. రుణమాఫీ తదితర కార్యక్రమాలు ఉన్నందున ప్రస్తుతానికి ఉద్యోగులకు ఒక డీఏ ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో టీజీవో నేతలు శుక్రవారం సీఎంవో కార్యదర్శి శేషాద్రితో సమావేశమయ్యారు.

మేడిగడ్డ రిపేర్లపై నేడు సీఎం నిర్ణయం!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మూడు బ్యారేజీలకు వర్షాకాలం ప్రారంభానికి ముందు అత్యవసరంగా చేపట్టాల్సిన తాత్కాలిక మరమ్మతులు, తదుపరి అధ్యయనాలను సిఫారసు చేస్తూ గతంలో నివేదిక అందించింది. దీనిప్రకారం ఇప్పటికిప్పుడు మరమ్మతులు చేయడానికి రూ.100 కోట్ల దాకా అవుతుందని లెక్కలు కట్టారు. అయితే, నిధులు వెచ్చించినా మున్ముందు మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినదని కచ్చితంగా చెప్పలేమంటూ ఇచ్చిన నివేదికల నేపథ్యంలో తదుపరి ఏం చర్యలు చేపట్టాలనే దానిపై మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, మేడిగడ్డలో కుంగిన ఏడో బ్లాకుకు చెందిన ఒక గేటును నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం పైకి ఎత్తారు. గత ఏడాది అక్టోబరు 21న 7వ బ్లాకులోని 20వ పిల్లర్ కుంగగా అప్పటి నుంచి బ్లాక్‌లోని గేట్లన్నీ మూసే ఉంచారు. బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులకు 85 గేట్లున్నాయి. మిగిలిన అన్ని బ్లాకుల గేట్లను అప్పట్లోనే ఎత్తి నీటిని ఖాళీ చేశారు. ఏడో బ్లాకులోని గేట్లను ముట్టుకోలేదు. తాజాగా వానాకాలంలో మేడిగడ్డ గేట్లన్నీ ఎత్తి ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చింది. దీంతో ఎస్‌ఈ కరుణాకర్ ఆధ్వర్యంలో ఏడో బ్లాకులోని ఒక గేటును ఎత్తారు. ఇదే బ్లాక్‌లోని మిగతా గేట్లను సైతం వారం రోజుల్లో ఎత్తే అవకాశం ఉంది. బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో వరద ప్రవాహానికి అడ్డంగా ఉన్న ఇసుక మేటలు తొలగింపును ముమ్మరం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మేలైన ఒప్పందం!

ఇరాన్‌తో ఒప్పందాలు చేసుకొనేవారు ఆంక్షలు ఎదుర్కోక తప్పదంటూ అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి వేదాంత్ పటేల్ చేసిన హెచ్చరికకు నిజంగానే అంత విలువ ఇవ్వాలా? ఆప్త మిత్రదేశంగా మారిన భారత్ మీద ఆంక్షలు విధించేంత సాహసానికి అమెరికా పూనుకుంటుందా? భారత్–ఇరాన్‌లు చాబహార్ ఓడరేవు అభివృద్ధికి సంబంధించి ఇంత పెద్ద ఒప్పందం చేసుకుంటున్నప్పుడు అమెరికాకు ఆమాత్రం తెలియకుండానే వ్యవహారం ఏకంగా సంతకాలవరకూ పోతుందా? భారత్ ఆర్థిక అవసరాలు, వాణిజ్య ప్రయోజనాలను అటుంచితే, ఈ ఒప్పందం చైనా విస్తరణ కాంక్షకు, దాని ఆధిపత్య ధోరణులకు అడ్డుకట్టవేసేందుకు ఉపకరిస్తుందని అమెరికాకు తెలియదా?

రెండు టెర్మినల్స్ ఉన్న చాబహార్ ఓడరేవులో షాహీద్ బెహెస్తీ టెర్మినల్‌ను భారతదేశం అభివృద్ధి చేసుకొని పదేళ్ళపాటు నిర్వహించుకోవడానికి వీలుగా ఆ ఒప్పందం కుదిరింది. 2016లోనూ నరేంద్రమోదీ ఇదే రకంగా పదేళ్ళకు వర్తించే ఓ ఒప్పందం కుదుర్చుకున్నారు. అమెరికా, యూరప్ దేశాలు ఇరాన్‌తో సయోధ్యకు వచ్చి అణుఒప్పందాన్ని కుదుర్చుకున్న సానుకూల పరిస్థితులు నరేంద్రమోదీకి అప్పట్లో ఉపకరించాయి. కానీ, 2018నవంబరులో అప్పటి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌మీద విధించిన ఆంక్షలతో ఆ పని సవ్యంగా సాగలేదు. గత ఒప్పందంనుంచి వైదొలగడంతో పాటు ఇరాన్‌మీద ఆంక్షలు విధించి ఆయన ఉద్రిక్తతలను తిరిగి తెరమీదకు తీసుకువచ్చారు. ఇంతటి స్వల్ప కాలంలో ఎంత పని పూర్తయివుంటుందో ఎవరైనా సులువుగా ఊహించవచ్చు. రోడ్లు, రైల్వేలైన్లు ఇత్యాది భారీ పనులు చేపట్టకుండానే దానిని నామమాత్రంగా ఆరంభించడమూ అప్పట్లో జరిగింది. 2003లో వాజపేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఇరాన్‌తో ఒప్పందం కుదిరినప్పటినుంచీ ఏవో ఆటంకాలు వస్తూనే ఉన్నాయి, అమెరికా ఏదో రకంగా అడ్డుపడుతూనే ఉంది. ఆ విధంగా చూస్తే ఇప్పటికి 21ఏళ్ళయినట్టు. కొత్త ఒప్పందంతో ఈ పని మళ్ళీ జోరందుకుంటుందని ఆశించాలి. ప్రస్తుత ఒప్పందం ప్రకారం, భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్) టెర్మినల్ కనీస వసతుల నిమిత్తం పన్నెండు కోట్ల డాలర్ల పెట్టుబడి పెడుతుంది, ఓ పాతికకోట్ల డాలర్ల రుణంతో మౌలికసదుపాయాల అభివృద్ధికి భారత ప్రభుత్వం సహకరిస్తుంది. మరిన్ని పెట్టుబడులతో, మరింత విస్తరించగలిగినప్పుడు ఇది మనదేశానికి అత్యంత లాభదాయకమైన ప్రాజెక్టు. మధ్య ఆసియా, పశ్చిమాసియా ఇంకా చెప్పాలంటే యూరప్ వరకూ మన వాణిజ్యాన్ని విస్తరింపచేస్తుంది. ఈ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఏర్పడే రోడ్లు, రైల్వేలైన్లు సరుకురవాణాను సులభతరం, వేగవంతం చేస్తాయి.

చాబహార్ అభివృద్ధి చెందితే భారత్‌కు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని అమెరికాకు తెలియకపోదు. పాకిస్థాన్‌లో బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ)లో భాగంగా చైనా అభివృద్ధి చేస్తున్న గ్వాదార్‌పోర్టు ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు ఇది ఉపకరిస్తుంది. హిందుమహాసముద్రంలో భారతదేశ ప్రాభవాన్ని, ప్రభావాన్ని విస్తరింపచేస్తుంది. అప్పట్లో ఇరాన్‌మీద ట్రంప్ ఆంక్షలు విధిస్తూనే, మనకు మాత్రం మినహాయింపులు ఇచ్చిన మాట మరిచిపోకూడదు. అఫ్గానిస్థాన్ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయానికి వచ్చినట్టు అమెరికా అప్పట్లో చెప్పుకుంది. ట్రంప్ ఏలుబడిలోనూ, ఇప్పుడు బైడెన్ కాలంలోనూ భారత్ అమెరికా మధ్య స్నేహం మరింత పెరిగింది. పరస్పర ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలు హెచ్చాయి. అమెరికా భౌగోళిక రాజకీయాలకు భారత్ అత్యంత కీలకం. చైనా విస్తరణ కాంక్షను నియంత్రణలో ఉంచాలంటే బలమైన భారత్ అవసరం. ఇరాన్‌తో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా భారతదేశం తన అవసరాల విషయంలో ఏ మాత్రం రాజీపడేది లేదని ప్రపంచానికి తేల్చిచెప్పింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో భాగంగా అనేక ఆంక్షలు ఉన్నప్పటికీ, రష్యా చమురు దిగుమతులను భారత్ యథేచ్ఛగా కొనసాగించింది. ఆదిలో గొంతుపెంచినప్పటికీ ఆ తరువాత అమెరికా పూర్తిగా చల్లబడిపోయింది. ఈ ఏడాది అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో, చాబహార్ ఒప్పందానికి వ్యతిరేకంగా అమెరికా ఏ చర్యలూ తీసుకొనే అవకాశాలైతే లేవు. రేపు రిపబ్లికన్లు అధికారంలోకి వచ్చినపక్షంలో వాతావరణంలో కొంత మార్పు ఉండవచ్చు. గాజా యుద్ధం కారణంగా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య గతంలో కంటే ఇప్పుడు మరింత వైరం పెరిగింది. డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధ్యక్షుడైనప్పటికీ మనమీద నేరుగా విరుచుకుపడే అవకాశాలైతే లేవు.

చలం: నేటికీ ఓ శేష ప్రశ్న

'రచయితలు రెండు రకాలు: ఒక ఉద్గ్రంథాన్ని వదిలిపోయేవారు. తాము స్వంతంగా గొప్పగా ఏదీ రాయకపోయినా, సారస్వతానికి కొత్త జీవనాన్నిచ్చేవారు. ఏ కొందరో ఈ రెండూ చేయగలవారుంటారు' అని చలం ఒక చోట చెప్పుకున్నారు. ఇలా రెండూ చెయ్యగలిగిన వారిలో చలం ముందు వరుసలో ఉంటారు. కీర్తి కోసం చలం రచనలు చేయలేదు. కీర్తి అతనిని కావాలని కావలించుకుంది.

ఆయన రచనల్లోని 'ఆక్రోశం' ఆయనదే అనే సాహితీ విమర్శకులున్నారు. వ్యక్తిగత జీవితం సాహిత్యంలో తొంగి చూడటం సహజమే. 'గీతాంజలి'కి ముందుమాటలో చలం 'ఈ గుడ్డి సృష్టి నా సవతి తల్లి. నన్ను కొడుతుంది. తిడుతుంది. నాకు దిక్కులేదు. కర్కశ భూయిష్టమైన ఈ ప్రపంచంలో దిక్కులేని ఏకాకిని, నా సోదరులని వంచించి, దోచుకుని, వారితో పోటీపడి, పీక్కొని, నేను దాక్కోవాలి. ఎవరిని నమ్మను? ఎవరని ప్రేమించను? ఈ మనుషులు నా స్వార్థానికి ఉపకరణాలు. ద్వేషంలో, మోసంలో వారిని మించి కపటిని కావాలి: లేదా నన్ను వంచిస్తారు' అంటారు. విశ్వకవి రచనాత్మను చలం ఖచ్చితంగా అంచనా వేసిన తర్వాతనే ఆయన గీతాంజలిని తెలుగులోకి తెచ్చారనిపిస్తుంది: 'గీతాంజలిని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన అభ్యంతరాలు– అద్వైత వేదాంతము, సైన్సు' అనటం అయనలోని తత్వాన్ని బహిర్గతం చేస్తుంది. చలంను అర్థం చేసుకోవడం సైతం క్లిష్టమే. ఆయన రచనలను చదివి 'చలం అంటే ఈయన' అని చెప్ప వీలవదు.

'నన్ను మెచ్చుకున్న వారంతా, నా రచనలు అర్థం చేసుకున్నారని భ్రమపడ్డాను' అనేది ఆయన ఆవేదన. చలం వ్యక్తిత్వంలో విభిన్నమైన పార్శ్వాలున్నాయి. స్త్రీ ప్రేమికునిగా, తండ్రిగా, భర్తగా, సంఘ బహిష్కర్తగా... ఇలా చలంలో అనేకమైన విభిన్న కోణాలు రచనల ద్వారా ఆవిష్కృతమయ్యాయి. వీటిని తనదైన శైలిలో ఆయన సాహితీ ప్రియులకు అందించారు. ఇక్కడ గమనించదగ్గ అంశం చలం శైలి. 'నేను రచనలు సాగించేటప్పటికీ నాకు తెలియకుండానే, నేను మాట్లాడే భాషలోనే రాశాను. తక్కిన కథలన్నీ పుస్తకాల భాషలో రాశాను. అసలు ఈనాడు భాషా ఉద్యమం అనేది ఒకటి ఉందని నాకు తెలీదు,' అంటారు. ఆయన భాష ఓ వరద. భయం, సంకోచం, భీతి లేని వాక్యాల ప్రవాహం. ఆయన రచనలను ప్రతిఘటించినవారే ఆ వాక్యాలను ప్రేమించారు. ఆయన భాషను అనుకరించే ప్రయత్నం చేశారు. 'రచయితలు, పత్రికలు చలం పేరు చెప్పకుండా చలాన్ని అనుకరించడం ప్రారంభించారు. భాషా దిగ్గజాల మోకాళ్ళుగిసలాడే పాత నీతుల గోడలు కూలాయి' అని ఆయనే తన ఆత్మకథలో రాసుకున్నారు.

గుడిపాటి వెంకటాచలం 1894 మే 18న మద్రాసు నగరంలో జన్మించారు. తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి కొమ్మూరి సాంబశివరావు. తాతగారు గుడిపాటి వెంకటరామయ్య దత్తత తీసుకోవడంతో ఇంటి పేరు గుడిపాటిగా స్థిరపడింది. చిన్నతనంలో నిత్య సంధ్యావందనం నిష్ఠగా చేసేవారు. ఉన్నత విద్య నేర్వక ముందే ఇతిహాస, పురాణాలను క్షుణ్ణంగా చదివారు. తన తండ్రి తన తల్లిని వేధించే తీరు ఆయనను బాధించింది. అది పసి మనసుపై బలమైన ముద్ర వేసింది. తన చెల్లెలు అమ్మణ్ణి పెళ్లి ఆగిపోవడం స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాల పైకి ఆయన దృష్టి మళ్ళింది. 1911లో పిఠాపురం మహారాజా కళాశాలలో ప్రవేశం పొందిన తరువాత రఘుపతి వెంకటరత్నం నాయుడు నాయకత్వంలో నడుస్తున్న బ్రహ్మసమాజం వైపు ఆకర్షితుడయ్యారు. బీఏ చదువు కోసం మద్రాసు వెళ్ళక ముందే చిట్టి రంగనాయకమ్మతో వివాహం జరిగింది. తన భార్యను కాన్వెంట్లో చేర్పించారు. కళాశాల చదువు తర్వాత తను కాకినాడలో ట్యూటరుగా చేరారు. తిరిగి బ్రహ్మ సమాజం ఉద్యమంలో పాల్గొన్నారు. రత్నమ్మతో ప్రేమలో ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. అనంతరం రాజమండ్రి ట్రైనింగ్ కళాశాలలో ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తర్వాత పాఠశాల తనిఖీ అధికారిగా పనిచేశారు. 'రాతిని, ప్రభుత్వ బానిసను, స్కూళ్ళ తనిఖీదారుణ్ణి, ఉపాధ్యాయ వర్గ ప్రాణ మూషికాలకు మార్జాలాన్ని' అని ఆయనే చెప్పుకున్నారు.



తెలుగులో స్త్రీల గురించి ఏ రచయితా చలం అంత గొప్పగా రాయలేదు అనడం అతిశయోక్తి కాదు. అసలు సిసలు స్త్రీవాద రచయిత చలం. చలం తన భావాలను వ్యక్తం చేయడానికి అనేక రచనా ప్రక్రియలను ఎన్నుకొన్నారు. ఎందరెందరు చదివితే అందరందరికి విస్తరించగల ఒకే ఒక్క తెలుగు రచయిత చలం.

చలం రచనల్లో వ్యక్తపరిచిన భావాలు, ప్రతిపాదించిన విషయాలు అప్పటి సమాజం మీద విపరీతమైన ప్రభావం చూపాయి. ఈ కారణంగా ఆయనను దూరంగా జరిపారు. స్త్రీ స్వేచ్ఛ పేరుతో విశృంఖల జీవన విధానాన్ని ప్రచారం చేస్తున్నాడని అతని కథల్లో బూతులు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఆయన పుస్తకాలను బహిరంగంగా చదివేందుకు కూడా భయపడేవారు. ఈ భయాలకు, వ్యతిరేకతకు ఆయన వ్యక్తిత్వం కూడా కారణమేనంటారు. అతనిలోని స్త్రీ లోలత్వాన్ని సమాజం సరిగ్గా అర్థం చేసుకోలేకపోయింది.

'అత్త అధికారం నుంచి భర్త ఆధీనం నుంచి తప్పించుకుంటున్న నవీన స్త్రీ షోకులకి, సంఘ గౌరవానికి, ఫ్యాషన్స్‌కి బానిస అవుతుంది. ఒక పురుషుడి నీడ కింద నుంచి లోకాన్ని ధిక్కరించగలిగే ఇల్లాలు, ఈనాడు సంఘ గౌరవం పేర, ఉద్యోగం పేర, ఫ్యాషన్ పేర వెయ్యి మందికి దాస్యం చేస్తోంది. నవీన స్త్రీకి తన చుట్టూ స్త్రీలందరూ అత్తలైనారు' అన్న 'స్త్రీ' రచనలోని చలం వ్యాఖ్యలను ఈ నాటికీ వాస్తవంగా స్వీకరించవచ్చు. ఇదే రచనలో మరోచోట 'భర్త వద్దని ఏడుస్తున్న చిన్నపిల్లలకి బలవంతంగా కట్టబెడుతుంది, భర్త కావాలని గోల పెడుతున్న వితంతువులకి నిరాకరిస్తుంది సంఘం. ఏం తెలివి,' అంటారు. ఇలా సమాజాన్ని ఏ 'లౌక్యమూ' లేకుండా ప్రశ్నించిన చలం ధిక్కారస్వరం వినిపిస్తున్నాడని భావించి సంఘం ఆయనను వెలివేయటంలో వింతేముంది. ఒకానొక దశలో ఆయనకు ఇల్లు అద్దెకివ్వటానికి కూడా ఎవరు అంగీకరించలేదు. 'వెలి'ని భరించలేక కుటుంబంతో ఆయన 'అరుణాచలం' 1950లో వెళ్ళిపోయారు. 1979 మే 4న మరణించారు.

చలం గురించి రాస్తూ శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కవితా సంపుటికి ఆయన రాసిన 'యోగ్యతా పత్రం'ను ప్రస్తావించకపోతే సమగ్రం అనిపించుకోదు. 'ఇది మహాప్రస్థానం సంగతి కాదు. ఇదంతా చలం గొడవ. ఇష్టం లేని వాళ్ళు ఈ పేజీలు తిప్పేసి (దీంట్లో మీ సెక్సుని ఉద్రేకించే సంగతులు ఏమీ లేవు) శ్రీశ్రీ అర్ణవంలో పడండి. పదండి ముందుకు...' అంటూ మొదలయ్యే ఈ ముందుమాటకు తెలుగు రచనల్లో అత్యంత ప్రసిద్ధమైనదిగా పేరుంది.

తెలుగులో స్త్రీల గురించి ఏ రచయితా చలం అంత గొప్పగా రాయలేదు అనడం అతిశయోక్తి కాదు. అసలు సిసలు స్త్రీవాద రచయిత చలం. చలం తన భావాలను వ్యక్తం చేయడానికి అనేక రచనా ప్రక్రియలను ఎన్నుకొన్నారు. అవన్నీ ఆయనకు పేరు తీసుకువచ్చాయి. 'ఆ నిమిషానికి కులాసాగా చదవటానికి పనికివస్తాయి. ప్రస్తుత కాలపు కుటుంబ జీవనాన్ని ప్రతిబింబిస్తాయి' అంటారు మునిమాణిక్యం. 'చలం ఒంటరి. ఆయన ఒంటరితనం తన చుట్టూ ఉన్న వారికి కూడా సోకిందేమోననుకుంటాను. అదే ఆయన్ను రమణాశ్రమం చేర్చింది' అంటారు కొడవటిగంటి. ఎందరెందరు చదివితే అందరందరి చలంగా విస్తరించగల ఒకే ఒక్క తెలుగు రచయిత చలం. నేటికీ ఒక శేష ప్రశ్న.

■ భమిడిపాటి గౌరీశంకర్


(నేడు చలం 130వ జయంతి)

చరిత్ర త్రాసులో నెహ్రూ, పటేల్

ఈ మే 27న జవహర్‌లాల్ నెహ్రూ 60వ వర్ధంతి. ఆయన రాజకీయ జీవితంలోని ఒక ప్రధాన అంశం... వల్లభ్‌భాయి పటేల్‌తో సహకారం.... పై ఈ వ్యాసం నిశిత దృక్కులు సారించనున్నది. స్వాతంత్ర్య పోరాటంలోనూ, స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలోను ఆ మహోన్నతులు ఇరువురూ దేశ సమస్యల పరిష్కారానికి సమైక్యంగా కృషి చేశారు. కలిసి మెలిసిపనిచేసే ఏ ఇరువురి మధ్య అయినా విధిగా ఉండే అభిప్రాయ బేధాలు వారిరువురి మధ్యా ఉండేవి. అయినప్పటికీ ఆ మహోన్నతుల మధ్య సంబంధాన్ని మొత్తంగా చూసినప్పుడు అదొక భాగస్వామ్యమని అర్థమవుతుంది మాతృదేశ సమున్నతికి వారు తమ అద్వితీయ సామర్థ్యాలను సమష్టిగా ఉపయోగించారు. నెహ్రూ, పటేల్‌ల వ్యక్తిత్వాల్లోని ఈ ఆవశ్యక సంపూరక తత్వాన్ని (కాంప్లిమెంటారిటీ)ని నరేంద్ర మోదీ, ఆయన బీజేపీ సహచరులు నిరాకరిస్తున్నారు. నెహ్రూను అప్రతిష్టపాలు చేసి, సర్దార్ పటేల్‌ను కీర్తించేందుకు లభించిన ఏ అవకాశాన్ని మోదీ తదితరులు ఏమాత్రం వదులుకోవడం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే నెహ్రూ చారిత్రక ప్రశస్తిని పూర్తిగా ఉపేక్షిస్తున్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మనలను పాలిస్తున్నప్పుడు, భారతీయ సమాజంలోని వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ఒక సంపూర్ణ ప్రజాసంస్థగా భారత జాతీయ కాంగ్రెస్ రూపొందడానికి నెహ్రూ, పటేల్ విశేషంగా పాటుపడ్డారు. ఇరువురూ సంవత్సరాల తరబడి జైలు వాసం చేశారు. అయితే స్వతంత్ర భారతదేశ తొలి కేబినెట్ సభ్యులుగా వారిరువురి కృషి మరింత ముఖ్యమైనది. హిందువులు, ముస్లింల మధ్య మతచిచ్చు రగిల్చి వలసపాలకులు మన దేశం నుంచి నిష్క్రమించారు. బహుశ, ఏ కొత్త దేశమూ అంతకంటే ఎక్కువ సమస్యాత్మక పరిస్థితుల్లో ప్రభవించి ఉండదు. ఒకవైపు అంతర్యుద్ధ పరిస్థితులు, మరోవైపు ఆహార కొరత; కుల, వర్గ, జెండర్ అసమానతలు; లక్షలాది శరణార్థుల పునరావాస సమస్యలు; 500ల సంస్థానాలను విలీనం చేయవలసిన బృహత్తర బాధ్యత... ఇన్ని క్లిష్ట పరిస్థితులను అధిగమించి దేశం సమైక్యంగా నిలిచింది. ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించి కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించింది. 1947–50 సంవత్సరాల మధ్య జాతి నిర్మాణానికి జరిగిన ఈ విశిష్ట కృషిలో మహోన్నత దేశ భక్తులు పలువురు పాలు పంచుకున్నారు. వారందరిలో, బహుశా, నెహ్రూ, పటేల్‌లు సర్వోత్కృష్టులు.

మహిళలకు, సకల మైనారిటీ వర్గాలకు సమాన హక్కులు కల్పిస్తామన్న భరోసాతో ఆసేతు హిమాచలం సమస్త భారతీయుల మధ్య భావ సమైక్యతను నిర్మించడంపై నెహ్రూ తన దృష్టిని కేంద్రీకరించారు. సార్వత్రిక వయోజన ఓటింగ్ హక్కు ప్రాతిపదికన బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణానికి ఆయన కృషి చేశారు. ప్రగతిశీల భావాలు, ఉదాత్త ఆదర్శాలతో నాటి భారత యువజనులకు ఒక స్ఫూర్తిగా నెహ్రూ నిలిచారు. ఇక పటేల్ భారతదేశ భౌగోళిక సమైక్యతను సాధించడంపై తన దృష్టిని కేంద్రీకరించారు. వందలాది సంస్థానాలను అహింసా పద్ధతుల్లో భారత్‌లో విలీనం చేయడంలో ఆయన అద్భుతంగా సఫలమయ్యారు. దేశ పాలనకు కీలకమైన సివిల్ సర్వీసెస్‌లో సంస్కరణలను తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర వహించారు. మరీ ముఖ్యంగా రాజ్యాంగ నిర్మాణంలో ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు పటేల్ విశిష్ట కృషి చేశారు.



> స్వాతంత్ర్యానికి ముందు, తరువాత కూడా నెహ్రూ, పటేల్‌లు సన్నిహిత సహచరులు అని చరిత్రకారులు ధ్రువీకరించారు. మరి వారిరువురు ప్రత్యర్థులు, పోటీదారులు అన్న భావన నేటి భారతదేశంలో ఎలా ప్రచారంలోకి వచ్చింది? ఇందుకు అసలు పాపం నెహ్రూ సొంత కుటుంబానిదే. నెహ్రూ అనంతరం కాంగ్రెస్ పార్టీ సర్దార్ పటేల్‌ను నిరాదరించి, నిర్లక్ష్యం చేయడం వల్లే నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ఆయనను తన సొంత ప్రయోజనాలకు స్వాయత్తం చేసుకోవడం సాధ్యమయిందని గోపాలకృష్ణ గాంధీ అన్న మాట పూర్తిగా నిజం. జీవితపర్యంతం కాంగ్రెస్ వాదిగా ఉన్న ఒక మహోన్నతుడు బీజేపీ ప్రతీకాత్మక ఆస్తి కావడం ఎంత విషాదం!

నెహ్రూ, పటేల్‌ల సమైక్య కృషిని చరిత్ర నమోదు చేసింది, ప్రస్తుతించింది. ఇరువురూ పరస్పరం గౌరవించుకునేవారు. అయినా ఇరువురి మధ్య సత్సంబంధాలు లేవనే అభిప్రాయం కూడా పలువురిలో ఉండేది. 1948 సెప్టెంబర్‌లో పటేల్ తన యువ సహచరుడు ఒకరికి రాసిన లేఖలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'జవహర్‌లాల్‌తో నా సంబంధాలపై మీరు తప్పుడు అసమంజసమైన అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని' మృదువుగా మందలించారు. ఆయన ఇంకా ఇలా రాశారు: 'మా మధ్య అభిప్రాయబేధాలు ఉన్నమాట నిజమే. నిజాయితీపరులు అందరి మధ్య ఉన్న విధంగానే మా మధ్య కూడా వివిధ అంశాలపై విభేదాలు ఉన్నాయి. అయితే మా మధ్య పరస్పర గౌరవాదరాలు, ప్రేమాభిమానాలు, విశ్వాసంలో ఎటువంటి తేడా చోటు చేసుకోలేదు'. ఒక ఏడాది అనంతరం నెహ్రూ 60వ పుట్టిన రోజు సందర్భంగా ఆయనను అభినందిస్తూ రాసిన ఒక వ్యాసంలో పటేల్ ఇలా రాశారు: 'అనేక సంవత్సరాలుగా వివిధ వ్యవహారాలలో ఇరువురమూ కలసికట్టుగా పనిచేశాము. పరస్పర ప్రేమాభిమానాలు సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ పెరుగుతూనే ఉన్నాయి'. నెహ్రూ సైతం పటేల్ పట్ల ఇటువంటి ప్రేమాభిమానాలనే వ్యక్తం చేసేవారు. 'కేబినెట్‌కు ఒక దృఢమైన స్తంభం' అని పటేల్‌ను 1947 ఆగస్టులో నెహ్రూ ప్రశంసించారు. మూడు సంవత్సరాల అనంతరం పటేల్ కీర్తిశేషుడు అయినప్పుడు పార్లమెంటులో నెహ్రూ ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తూ ఇలా అన్నారు: స్వాతంత్ర్య పోరాటంలో మన శ్రేణులకు ఆయన సమర్థ నాయకత్వం అందించారు. విజయోత్సవ వేళ, విపత్కర సమయాల్లోనూ ఆయన మనకు మంచి సలహాలనిచ్చారు. ఆయన ధైర్యసాహసాలు అద్వితీయమైనవి. క్రమశిక్షణ ఆదర్శప్రాయమైనది. సంస్థా నిర్వహణలో ఆయన ప్రతిభాపాటవాలు సాటిలేనివి. సంస్థానాల సమస్యను పరిష్కరించి భారత్‌ను సమైక్యపరచడమనే అత్యంత క్లిష్ట సమస్యను పటేల్ తన నాయకత్వ దక్షతతో అందరికీ ఆమోదయోగ్యమయ్యేలా పరిష్కరించారు. క్రమశిక్షణ విషయంలో దేశ ప్రజలు పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ విధ్యుక్త ధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించడం ద్వారా శక్తిమంతమైన, సంపద్వంతమైన భారత్ నిర్మాణానికి దోహదం చేయడమే వల్లభ్‌భాయ్ పటేల్‌కు సరైన నివాళి అవుతుంది'.

స్వాతంత్ర్యానికి ముందు, తరువాత కూడా నెహ్రూ, పటేల్‌లు సన్నిహిత సహచరులు అని చరిత్రకారులు ధ్రువీకరించారు. మరి వారిరువురు ప్రత్యర్థులు, పోటీ దారులు అన్న భావన నేటి భారతదేశంలో ఎలా ప్రచారంలోకి వచ్చింది? ఇందుకు అసలు పాపం నెహ్రూ సొంత కుటుంబానిదే. నెహ్రూ అనంతరం ప్రధానమంత్రి అయిన లాల్ బహదూర్ శాస్త్రి 1966 జనవరిలో గుండె పోటుతో – మరణించారు. తదుపరి ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీని నాటి కాంగ్రెస్ పెత్తందారులు ఎంపిక చేశారు. ఆమె అయితే తమ నియంత్రణలో ఉంటుందని వారు భావించారు. ఈ విషయంలో వారు ఘోరంగా పొరపడ్డారు. ఇందిర చాలా త్వరగానే కాంగ్రెస్ పార్టీపై పట్టు సాధించారు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ ద్వారా ఆమె తన నాయకత్వాన్ని మరింతగా పటిష్ఠం చేసుకున్నారు బంగ్లాదేశ్ యుద్ధంలో భారత్ ఘన విజయంతో విజయేందిరగా ప్రభవించిన ఇందిర కాంగ్రెస్‌పై తిరుగులేని అదుపు సాధించారు. ప్రభుత్వమూ, పార్టీ పూర్తిగా తన నియంత్రణలోకి రావడంతో కాంగ్రెస్‌ను ఒక కుటుంబ సంస్థగా మార్చివేసేందుకు ఆమె పూనుకున్నారు.

నవ భారతదేశ నిర్మాణానికి సర్దార్ పటేల్ చేసిన దోహదాన్ని ఇందిర పూర్తిగా విస్మరించలేదు, నిర్లక్ష్యం చేయలేదు. కనుకనే 1974లో ఆమె ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే జాతీయ పోలీస్ అకాడమీకి సర్దార్ పటేల్ పేరు పెట్టారు. అయితే తన తండ్రి కీర్తిని మరింతగా పెంపొందించేందుకే ఆమె ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. ఇందులో భాగంగానే న్యూఢిల్లీలో కొత్తగా నెలకొల్పిన ఒక విశ్వవిద్యాలయానికి జవహర్‌లాల్ నెహ్రూ పేరు పెట్టారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయిన తరువాత పటేల్, ఇతర కాంగ్రెస్ యోధులను ఉపేక్షించి నెహ్రూను కీర్తించడం ముమ్మరమయింది. 1989లో నెహ్రూ శతజయంతి వేడుకలను చాలా ఘనంగా నిర్వహించారు. అదే సమయంలో తాతగారితో సమానంగా తన తల్లి యశోచంద్రికలను చిరస్థాయిగా నిలిపేందుకు కూడా రాజీవ్ ప్రాధాన్యమిచ్చారు. ఇందులో భాగంగానే దేశ రాజధానిలో నిర్మించిన కొత్త అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇందిర పేరిట నామకణం చేశారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రను ఒకే ఒక కుటుంబ కథగా మార్చివేసే పనిని ఇందిర, రాజీవ్ ప్రారంభించారు. 1998లో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టిన సోనియా గాంధీ ఆ కృషిని కొనసాగించి మరింత ముందుకు తీసుకుపోయారు. కాంగ్రెస్ చరిత్ర గురించిన ఆమె అవగాహనలో సర్దార్ పటేల్‌కు ఎలాంటి స్థానం లేదు. అలాగే ఆజాద్, కామరాజ్, సరోజినీ నాయుడు తదితర కాంగ్రెస్ యోధుల సేవలను పూర్తిగా ఉపేక్షించారు. మహాత్మా గాంధీని గౌరవించినప్పటికీ పార్టీ చరిత్రను ఒకే ఒక కుటుంబ కథగా మార్చి వేశారు. కాంగ్రెస్ నాయకులలో నెహ్రూ, ఇందిరలను, మరీ ముఖ్యంగా రాజీవ్ గాంధీని మాత్రమే గౌరవించడం ఒక ఆనవాయితీ అయింది. 2004–14 సంవత్సరాల మధ్య దేశ వ్యాప్తంగా పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు రాజీవ్ పేరు పెట్టడం జరిగింది. ఆయన జయంతి, వర్ధంతిలను జరిపేందుకు ప్రభుత్వ నిధులను భారీ మొత్తంలో వినియోగించారు.

ఆరెస్సెస్ ప్రచారక్‌గా నరేంద్ర మోదీ, సంస్థ సంస్థాపకుడు, కెబి హెడ్గేవార్, వ్యవస్థాపకుడు ఎమ్ఎస్ గోల్వాల్కర్‌ను ఆరాధించారు; బీజేపీ నిర్మాణకర్తగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయలను అభిమానించారు. అయితే గుజరాత్ ముఖ్యమంత్రి అయిన తరువాత మాత్రమే సర్దార్ పటేల్ పట్ల తన అభిమానాన్ని చాటుకోవడాన్ని మోదీ ప్రారంభించారు. ప్రధానమంత్రి పదవిని ఆకాంక్షించిన మోదీ 2012లో సర్దార్ పటేల్‌ను బహిరంగంగా పలు విధాల ప్రస్తుతించసాగారు. మోదీని అనుసరించి బీజేపీ శ్రేణులు కూడా పటేల్‌ను పెద్ద ఎత్తున ప్రశంసించడం ప్రారంభించాయి. నెహ్రూ అనంతరం కాంగ్రెస్ పార్టీ సర్దార్ పటేల్‌ను నిరాదరించి, నిర్లక్ష్యం చేయడం వల్లే నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ఆయనను తన సొంత ప్రయోజనాలకు స్వాయత్తం చేసుకోవడం సాధ్యమయిందని గోపాలకృష్ణ గాంధీ అన్న మాట పూర్తిగా నిజం. గుజరాత్‌లో పటేల్‌కు ఒక బృహత్ స్మారక చిహ్నాన్ని నిర్మించారు. ప్రతి సందర్భంలోనూ ఆయన నామ జపం చేస్తున్నారు. జీవితపర్యంతం కాంగ్రెస్ వాదిగా ఉన్న ఒక మహోన్నతుడు బీజేపీ ప్రతీకాత్మక ఆస్తి కావడం ఎంత విషాదం!

స్వతంత్ర భారతదేశంలో రాజకీయాలు, రాజ్యనిర్వహణను రూపొందించిన, ప్రభావితం చేసిన అనేక జుగల్బందీలలో మొట్టమొదటిదాన్ని జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయి పటేల్ ప్రారంభించారు. తదనంతర జుగల్బందీలలో ఇందిరా గాంధీ, పి.ఎన్.హక్సర్; అటల్ బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ ఆడ్వాణీ; మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ; ఇటీవలి, ఇంకా కొనసాగుతోన్న నరేంద్ర మోదీ, అమిత్ షావి మిక్కిలి ప్రభావవంతమైనవి. స్వతంత్ర భారతదేశ తొలినాళ్లలో జాతి నిర్మాణానికి నెహ్రూ, పటేల్ నాయకత్వం వహించడం భారతీయుల అదృష్టమని ఒక పౌరుడుగానే కాకుండా, ఒక చరిత్ర కారుడుగా కూడా నేను సునిశ్చితంగా చెప్పగలను. మన ఆధునిక చరిత్రలో రాజకీయ భాగస్వామ్యాలు అన్నిటిలోకి నెహ్రూ–పటేల్‌ది సర్వోత్కృష్టమైనదీ, మహోదాత్తమైనదే కాకుండా అత్యంత ఆవశ్యకమైనది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

స్థానిక సంస్థల్లో సమవాటాకై బీసీలు పోరాడకతప్పదు!

పార్లమెంటు ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వీటిని నిర్వహించాలంటే మొదట బీసీ కులగణన అత్యవసరంగా జరగాలి. దీనికి ముందుగా మొత్తం బీసీ కులాలకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలి. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీసీ కులగణన జరుపుతామని రాహుల్ గాంధీ దగ్గర నుంచి కాంగ్రెస్ నేతలందరూ పదే పదే చెప్పారు. ఆ పార్టీ కులగణన చేస్తుందని, బడుగులకు న్యాయం చేస్తుందని బీసీ వర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

పార్లమెంటు ఎన్నికల ఫలితాలు జూన్ 4న రానున్నాయి. ఎన్నికల్లో బీసీలను తమవైపు తిప్పుకునేందుకు బీసీ కులగణన వాగ్దానం చేశారా? లేక చిత్తశుద్ధితోనే బీసీ కులగణన చేయటానికి సిద్ధపడతారా అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. మొత్తం తెలంగాణకు సంబంధించిన సామాజిక వర్గాలు ఎవరెవరు ఏ రకంగా ఉన్నారు? వాళ్ళ జీవనవిధానం ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ స్థితిగతుల లెక్కలు తీయాలి. రాష్ట్రంలో ఉన్న 130 బీసీ కులాలకు సంబంధించిన వారందరికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు రావాలి. అలాగే బీసీ వర్గాల్లో ఎంబీసీలకు, సంచారజాతులకు, అందరికీ న్యాయం జరగాలి. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇస్తామని వాగ్దానం చేశారు. 42 శాతాన్ని ఏ లెక్క ప్రకారం కేటాయిస్తారు? బీసీలెంతమందో తెలియకుండా ఇంత శాతం అని ఎలా చెబుతారు?

> రాష్ట్రంలో 12,769 గ్రామాలున్నాయి. బీసీ కులగణన జరిపి, పంచాయతీరాజ్ చట్టసవరణ చేసి, రిజర్వేషన్లు కేటాయిస్తే 6000కు పైగా గ్రామపంచాయతీలు వీరికి చెందుతాయి. కులగణన చేయకుండా రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లోకి వెడితే అది బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేసినట్టు అవుతుంది. కులగణన కోసం బీసీలంతా సంఘటితంగా నినదించాలి.

ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలున్నాయి. బీసీ(ఏ) గ్రూపులో 57 కులాలు, బీసీ(బీ) గ్రూపులో 234 కులాలు, బీసీ(సీ) గ్రూపులో ఒక కులం, బీసీ(డి) గ్రూపులో 35, బీసీ(ఇ)లో 14 కులాలున్నాయి. రాష్ట్రంలో ఉన్న 130 కులాల్లో స్థానిక సంస్థల్లో 7 నుంచి 10 కులాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉంది. మిగతా 120 కులాలు, అత్యంత వెనుకబడిన కులాలు, సంచార, అర్ధసంచార కులాలకు కనీస ప్రాతినిధ్యం లేదు. ఈ కులాలపై ఇంతవరకు సమగ్ర అధ్యయనం లేదు. వాళ్ళ దుర్భర జీవన విధానాన్ని స్వాతంత్ర్యం వచ్చాక పట్టించుకున్న పాలకులు లేరు. కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకమైనది. పార్లమెంటులో పంచాయతీ రాజ్ చట్టాన్ని రాజ్యాంగ సవరణ చేయకుండా బీసీలకు రిజర్వేషన్లు పెంచటం సాధ్యం కాదు. బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చినా, 50 శాతం మించకుండా మాత్రమే చేయాలి.

బీసీ కులగణన చేయాలంటే సుమారు 8 నెలల నుంచి ఒక సంవత్సర కాలం పడుతుంది. జనాభా గణనలాగే ఉపాధ్యాయుల చేత దీనిని చేయించాలి. ఇది బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జరగాలి. బీసీ కమిషన్ నివేదిక ఇవ్వకపోతే దానికి చట్టబద్ధత ఉండదు. బీసీ కులగణన అధ్యయనంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు స్పష్టత లేదు. విధివిధానాలు ఖరారు చేశాక రెండు దశల్లో సమగ్రంగా అధ్యయనం చేయాలి.

కులగణన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లోకి వెడితే అది బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేసినట్టు అవుతుంది. కులగణన కోసం బీసీలంతా సంఘటితంగా నినదించాలి. నేటికీ గ్రామాల్లో ఆధిపత్య వర్గాల పెత్తనమే నడుస్తోంది. ఊళ్లలో 50 శాతంగా ఉన్న బీసీలకు స్థానిక నాయకత్వాలు లేవు. తెలంగాణలో ఇంకా ఆధిపత్య వర్గాల కనుసన్నల్లోనే పంచాయతీ వ్యవస్థ నడుస్తోంది. రాష్ట్రంలో 12,769 గ్రామాలున్నాయి. బీసీ కులగణన జరిపి, పంచాయతీరాజ్ చట్టసవరణ చేసి, రిజర్వేషన్లు కేటాయిస్తే 6000కు పైగా గ్రామపంచాయతీలు వీరికి చెందుతాయి. మొత్తం 33 జిల్లా పరిషత్‌లలో సగం స్థానాలు వస్తాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్లలో సగానికి పైగా బీసీలకు రావాలి. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగు వర్గాలకు 50 శాతానికి పైగా సీట్లు లభించేలా కృషిచేయాలి. అన్ని పార్టీలు బీసీ నినాదాలిస్తున్నాయి. బీసీలు మాత్రం ఆచరణ కోసం చూస్తున్నారు. స్థానిక సంస్థల్లో బీసీ జనాభాకు అనుగుణంగా వాటా దక్కించుకుంటే తెలంగాణ రాజకీయ చిత్రం మారిపోతుంది. అది సామాజిక తెలంగాణకు తొలి అడుగు అవుతుంది.

• జూలూరు గౌరీశంకర్

కత్తుల వాన

హఠాత్తుగా వచ్చి గుండెలమీద తన్ని పోతుంది వర్షం
ఏమీ తెలియనట్టు, అసలేమీ జరగనట్టు
ఎవరో పిలిచినట్టు, ఏదో కొంప మునిగినట్టు.
నీళ్ళ బాణాల చివరన
కత్తులను కట్టుకొని ఎందుకు వస్తున్నట్టు?
వర్షానికి అగ్నిమీద తీవ్ర కోపం
దాడి చేసి ఉష్ణాన్ని ఆవిరి చేస్తుంది
ప్రకృతిని యంత్రంలో వేసి నుజ్జునుజ్జు చేస్తున్న
మనిషిని మాత్రం ఊరుకుంటుందా?
వర్షం భగభగ మండే కాలమ్మీద
జలఖడ్గాలను సంధించడానికి ఎన్నిసార్లు
వరదల శంఖారావాల్ని పూరించింది?
ఈ మనిషికేమన్నా సోయి వుందా?
తన ఒక్కని భౌతిక సుఖసౌఖ్యాల కోసం
కూచున్న కొమ్మ అమ్మనే బలి చేస్తున్నాడు.
ఎక్కడ చూసినా యంత్రాల మంట పుట్టిస్తున్నాడు.
మ్యాన్ పవర్‌ను మంటగలుపుతున్న 'మెషీన్ పవర్'
యంత్రపిశాచాల విషవిసర్జాల ప్రవాహాల్లో పడి
ప్రాకృతిక ప్రాణం కొట్టుమిట్టాడుతుంటే
చినుకు చూస్తూ ఊరుకుంటుందా?
వినాశక జ్వాల భూమిని భస్మం చేయక ముందే
వరుణాస్త్ర ప్రయోగం మానవ దుర్నీతి మీద.
వర్షం వస్తున్నట్టు ముందు తెలుస్తుంది మనకు కానీ,
యమభటుల వంటి నీటిశూలాల్ని
వెంట తెస్తుందని మనకు తెలియదు.
తెలిసేలోగా గుండెలకు చిల్లులు పడతాయి.
బతుకులు ప్రవాహాల్లో పడి కొట్టుకుపోతాయి.
మొదట ఎండిపోయిన హృదయ ఫలకంపై
చల్లచల్లగా చాన్పి చల్లినట్లే అనిపిస్తుంది.
మనసుకు స్వచ్ఛమైన మట్టివాసన వచ్చేసరికి
పులకించిపోతాం కడుపునిండా.
వాన రాకడ, ప్రాణం పోకడ
ఎవరికీ తెలియదని మనకూ తెలుసు,
కానీ 'కావలసిన అతిథి' కదా అని
ప్రేమగా పిలువగానే
ఆనందంగా వెళ్లి తలుపులు తెరుస్తాం
నిర్భయంగా, నిరాటంకంగా, నిట్ట నిటారుగా
నీటికత్తుల్ని నేరుగా గుండెలమీదే ఝుళిపిస్తుంది.
ఓ మహావర్షమా! మముగన్న తల్లివి నువ్వు
దిద్దుబాటు తోటలో గోడకుర్చీ వేస్తున్నాం
నీ తడి అణువులను అస్త్రాలుగా మార్చకు తల్లీ!

– దోర్బల బాలశేఖరశర్మ

సాధారణ బదిలీలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలు జరిగి ఆరు సంవత్సరాలు అయింది. కళాశాల విద్యాశాఖలో కూడా అధ్యాపకుల బదిలీలు కూడా ఈ కాలంలో జరగలేదు. మారుమూల ప్రాంతంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల పని పట్ల విసుగు కలిగి, పనితీరుపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఎన్నికల కోడ్ జూన్ మొదటి వారం వరకు ఉండడం, జూన్ 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం దృష్ట్యా ఉద్యోగుల పిల్లల చదువులకు ఆటంకం పేరుతో ఈ సంవత్సరం కూడా సాధారణ బదిలీలు జరగవేమోననే ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఎన్నికల సంఘం అనుమతితో సాధారణ బదిలీలను ఈ నెలలోనే నిర్వహించి, జూన్ మొదటి వారంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బదిలీ ఉత్తర్వులను ఇచ్చి, ఉద్యోగులను విడుదల చేస్తే ఇటు ఎన్నికల నిర్వహణకు, అటు పిల్లల చదువులకు ఆటంకం కలుగదు. పైగా ఉద్యోగుల చిరకాల వాంఛ నెరవేరుతుంది. కాబట్టి ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయ, ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలి. ఈ బదిలీలకు వారం లేదా పది రోజులు చాలు. పరిపాలనకు ఇబ్బంది లేకుండా సాంకేతికతను ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా వేగంగా పూర్తి చేయవచ్చు.

– ఎ.వి. రమణ, హన్మకొండ

పురుషులకూ పొదుపు సంఘాలు


తెలంగాణ రాష్ట్రంలో మహిళా పొదుపు స్వయం సహాయక సంఘాల మాదిరిగానే పురుష పొదుపు సంఘాలను కూడా ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీలలో ప్రతి గ్రామంలో 10 మంది సభ్యులుగా 18 నుంచి 60 సంవత్సరాల మధ్య పురుషులను ఒక పొదుపు సంఘంగా ఏర్పాటుచేసి బ్యాంకులలో పొదుపు ఖాతాలు తెరవాలి. రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతోంది. రాష్ట్రం నుంచి యువత పనుల నిమిత్తం పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. ధనవంతుల కంటే పేద ప్రజలపై ఎక్కువగా పన్నుల భారం పడి, వారి కొనుగోలు శక్తి తగ్గి, చివరకు నిత్యావసరాలు సైతం కొనుగోలు చేయలేక పోతున్నారు. ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని యువతను ఉపాధి మార్గాల వైపు మళ్ళించడానికి నైపుణ్యమున్న రంగాలలో యువకులకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పథకాలు ప్రారంభించాలి. అందు కోసం పురుషులకు పొదుపు సంఘాలను ఏర్పాటు చేయాలి.

– ఈదునూరి వెంకటేశ్వర్లు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.9 కనిష్ఠం 22.3

బోధన..వేదన..



- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- సబ్జెక్టు టీచర్లు లేక గాడితప్పుతున్న చదువులు
- ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోని పోస్టులు.. ఉపాధ్యాయులపై పెరుగుతున్న ఒత్తిడి
- కరోనా సమయంలో విద్యావలంటీర్లను తొలగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- కొత్త విద్యా సంవత్సరంలోనైనా విధుల్లోకి తీసుకుంటారని వలంటీర్ల ఎదురుచూపులు

జిల్లాలో సర్కారు విద్య గాడి తప్పుతోంది. తరగతి గదుల్లో పాఠాలు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తికాకపోవడంతో పదో తరగతిలో ఏటా అత్తెసరు ఫలితాలే వస్తున్నాయి. దీంతో సర్కారు బడుల్లో హాజరుశాతం పడిపోతుండడంతో పాటు వాటిపై తల్లిదండ్రులకు నమ్మకం రోజురోజుకు సన్నగిల్లుతోంది.

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్లతరబడి ఉపాధ్యాయపోస్టులు భర్తీకావడం లేదు. జిల్లాలోని 16 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 2023-24 గణాంకాల ప్రకారం ఆయా పాఠశాలల్లో 1,14,607 విద్యార్థులు చదువుతుండగా.. వారికి 6,200 మంది ఉపాధ్యాయులు బోధనలు అందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోంది. ప్రధానంగా సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పోస్టుల భర్తీ విషయంలో జాప్యం జరుగుతుండడంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షగా మారుతోంది. విద్యాశాఖ లెక్కల ప్రకారం స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 419, ఎస్‌జీటీ ఖాళీలు 128 ఉన్నాయి.

ఆదర్శ పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రతిపాదించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 440 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్ చాక్‌బోర్డు, మేజర్, మైనర్ మరమ్మతులను చేపట్టాలన్నారు. అలాగే తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ తదితర వాటిని రిపేర్ చేయించాలన్నారు. జూన్ 12లోగా పనులన్నింటిని పూర్తి చేసి విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

కొవిడ్‌తో విద్యా వలంటీర్ల తొలగింపు

కరోనా తాకిడి ముందు వరకు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 480 మంది విద్యా వలంటీర్లు పనిచేశారు. ఇందులో 45 శాతం మంది హైస్కూళ్లలో విద్యార్థులకు పాఠాలు బోధించగా, 55 శాతం మంది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేశారు. ప్రధానంగా సింగిల్ టీచర్, జీరో టీచర్ స్కూళ్లలో నిర్విరామంగా సేవలందించి నిరుపేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ప్రభుత్వం నెలవారీగా ఇచ్చే వేతనం రూ.12,500తోపాటు సాయంత్రం వేళల్లో ఇళ్ల వద్ద ట్యూషన్లు చెబుతూ కుటుంబాలను పోషించుకునేవారు.

కరోనా నేపథ్యంలో 2020 మార్చి 21 నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలులోకి రావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను బంద్ చేశారు. దీంతో విద్యావలంటీర్లను సైతం విధుల నుంచి అర్థంతరంగా తొలగించారు. అప్పటి నుంచి వలంటీర్లు పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సమస్య..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొంతకాలంగా ఉపాధ్యాయుల సమస్య వేధిస్తోంది. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారికి బోధించేందుకు

మిగతా 6వ పేజీలో..

జిల్లా విద్యాశాఖ వివరాలు	
691	మొత్తం పాఠశాలలు
6,200	పనిచేస్తున్న ఉపాధ్యాయులు
1,14,607	విద్యార్థుల సంఖ్య
480	గతంలో పనిచేసిన విద్యా వలంటీర్లు
23	సింగిల్ టీచర్ స్కూళ్లు
10	జీరో టీచర్ స్కూళ్లు
419 (సుమారు)	స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు
128	ఎస్‌జీటీ ఖాళీలు

ఈసారి కప్పుమనదే

- కర్మన్‌ఘాట్ పాఠశాలను సందర్శించిన ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్

చంపాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ నియోజకవర్గం సరూర్‌నగర్ మండలంలోని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) కెప్టెన్, యూనిసెఫ్ అంతర్జాతీయ అంబాసిడర్ పాట్ కమిన్స్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)ను పరిశీలించారు. విద్యార్థులకు సైన్స్ పరికరాల వినియోగం, ప్రయోగ విధానం, ప్రాజెక్టుల నిర్వహణ, శాస్త్రీయ దృక్పథంతో కొత్త పరికరాల తయారీ గురించి విద్యార్థులతో ముచ్చటించారు. ఏటీఎల్ ల్యాబ్‌లో చేతి పనులు, యంత్రపరికరాలు, త్రీడీ ప్రింటర్, సోల్డరింగ్ విధానం, రోబోటిక్స్ గురించి ఆయన తెలుసుకొని విద్యార్థులు తయారు చేసిన మోడళ్లను పరిశీలించారు. విద్యార్థులు చేరుకోవాల్సిన లక్ష్యాలను వివరించి వారు అడిగిన ప్రశ్నలకు పాట్ కమిన్స్ సమాధానాలిచ్చారు. తన తల్లి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఆయన క్రికెట్ ఆడి పలు మెలకువలు నేర్పించారు. ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడంతో ఈసారి కప్పు మనదేనంటూ విద్యార్థులు పాట్ కమిన్స్‌కు అడ్వాన్స్‌గా ఆల్ ది బెస్ట్ చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులతో ఆయన ముచ్చటించారు. పాఠశాలలో నలభై నిమిషాల పాటు పాట్ కమిన్స్ విద్యార్థులతో గడిపారు. రాచకొండ పోలీసులు కమిన్స్ రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా డీఈఓ సుశీందర్ రావు, ఎస్‌పీడీ మల్లయ్యబట్టు, యూనిసెఫ్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి శేషగిరి మధుసూదన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాస్ రావు, హెచ్ఎం పద్మ ఆయన వెంట ఉన్నారు.



విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడుతున్న ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ పాట్ కమిన్స్

ఒక్కో ప్రాంతంలో అర గంట పవర్ కట్

- విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు అమలు



హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభానికి ముందే విద్యుత్ లైన్ల మరమ్మతులను పూర్తిచేసే దిశగా విద్యుత్‌శాఖ చర్యలు చేపట్టింది. ఒక్కో ఫీడర్ పరిధిలో అరగంట విద్యుత్ బంద్ చేసి పనులు చేపట్టనుంది. ఈమేరకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మరమ్మతులు చేసుకునేందుకు వీలుగా ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్) ఇచ్చేందుకు విద్యుత్‌శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో శనివారం గ్రేటర్‌జోన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో కరెంట్ కోతలు ఉండనున్నాయి. ఎల్‌సీ తీసుకున్న సమయంలోనే ఆయా ఫీడర్ పరిధిలో సిబ్బంది మరమ్మతులు

మిగతా 6వ పేజీలో..

వాతావరణంలో మార్పులతో ఆరోగ్యానికి చేటు

- విజృంభిస్తున్న వైరస్ ● కలుషిత జలాలు, ఆహారంతో జాగ్రత్త

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వాతావరణ మార్పులతో అసాధారణ పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కాయడం, సాయంత్రం వర్షం పడి వాతావరణం చల్లబడడం...ఇలాంటి పరిస్థితులకు తట్టుకోలేక చాలామంది అస్వస్థతకు గురవుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వాతావరణంలో సమతుల్యత లోపిస్తున్నదని, ఇది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) ప్రభావం తీవ్రంగా ఉందని వివరిస్తున్నారు. గాలిలో తేమ, వాతావరణ కాలుష్యం వల్ల గొంతులో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నారు. గొంతులో ఇన్‌ఫెక్షన్ వల్ల వాయిస్ బాక్స్ దెబ్బతినడం, గొంతులో నొప్పి, వాపు, ఫ్లూ, దగ్గు, జలుబు, న్యుమోనియా, బ్రాంకైటిస్, అస్తమా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటాయన్నారు. ఎండ, చలి, తేమ

మిగతా 6వ పేజీలో..



కునుకు తీసేందుకు ప్రత్యేక పరికరం

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): కార్యాలయాల్లో కాసేపు కునుకు తీయడం (పవర్ న్యాప్) ఇటీవలి కాలంలో చాలా కార్పొరేట్ కంపెనీలలో ఓ ట్రెండ్‌గా కొనసాగుతున్నది. నగరంలోని పలు ఐటీ, ఐటీయేతర కంపెనీలు తమ కార్యాలయాల్లో మధ్యాహ్నం పూట ఉద్యోగులు విశ్రమించడానికి సమయం ఇస్తున్నాయి. 10 నుంచి 30 నిమిషాల పవర్‌న్యాప్స్‌తో అలసట తగ్గడంతో పాటు అప్రమత్తత పెరుగుతుందని అధ్యయనాలు చెబుతుండడంతో పలు కంపెనీలు ఉద్యోగుల కోసం ఆఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. అలాంటి వారికోసమే అర్బన్ నాప్స్ అంటూ స్ప్రికా సంస్థ నాప్ ప్యాడ్‌ను రూపొందించింది. నార్సింగ్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణా ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ నిర్వహించిన 10వ జాతీయ సదస్సులో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ న్యాప్ పాడ్ ఖరీదు 7.5 లక్షల రూపాయలు ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందులో జీరోగ్రావిటీ సీట్, బ్యాక్ మసాజ్, ఆక్సిజన్ థెరపీ, మెడిటేషన్ మ్యూజిక్, వెంటిలేటెడ్ సీట్, టైమ్డ్ వేకింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయన్నారు.

30 మందికి ఒకే బాత్‌రూమ్

- స్నానం చేసేందుకు పడిగాపులు
- చిన్న గదిలో నాలుగు పోలింగ్ కేంద్రాలు
- దుర్వాసనతో కూడిన బిర్యానీ..
- గంజిలాంటి ఉప్మా.. పాచిపోయిన అన్నం
- ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది పడరాని పాట్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు

రాజేంద్రనగర్ నియోజకవర్గం షైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల విధులు నిర్వర్తించా. 36 మంది సిబ్బందిలో 30 మంది పురుషులు, ఆరుగురు మహిళలు. పురుషులు 30 మందికి ఒకే బాత్‌రూమ్ అందుబాటులో ఉంది. తెల్లవారుజామున 5 గంటలకే కేంద్రాల్లో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఒకే బాత్‌రూమ్ ఉండడంతో 30 మందిమి కాలకృత్యాలు తీర్చుకొని.. స్నానం చేసేందుకు రాత్రి సరిగా నిద్రపోలేదు. మహిళా ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడ్డారు.

- విద్యాశాఖకు చెందిన ఓ ఉద్యోగి.

బహదూర్‌పురా అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓ పోలింగ్ బూత్‌లో ప్రిసైడింగ్ అధికారిగా విధులు నిర్వర్తించా. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ నాడు మధ్యాహ్నం వెజ్ బిర్యానీ ఇచ్చారు. దుర్వాసన వస్తుండడంతో తినకుండా పక్కన పడేయాల్సి వచ్చింది. ఉదయం గంజిలాంటి ఉప్మా ఇచ్చారు. పరిశుభ్రంగా ఆహారం లేకపోవడంతో వెంట తీసుకెళ్లిన పండ్లు, బిస్కట్లు తినాల్సి వచ్చింది.

- ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు.

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఓ పోలింగ్ బూత్‌లో పీవోగా డ్యూటీ చేశా. పోలింగ్ రోజు మధ్యాహ్నం పాచిపోయిన వెజిటబుల్ బిర్యానీ ఇచ్చారు. దానిని తింటే ఏమౌతుందో అని భయమేసింది. పోలింగ్ జరుగుతోన్న సమయంలో బయటకు వెళ్లి తినే అవకాశం లేదు. అరటిపండ్లు, బిస్కట్లు తెప్పించుకొని ఆకలి తీర్చుకున్నాం.

- ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు.

జియాగూడలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. అక్కడ మరుగుదొడ్లు, తాగునీటి వసతులు లేవు. కిచెన్‌లో వంట సామాగ్రి తొలగించకపోవడంతో దుర్వాసన వచ్చింది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. తరువాత వాటిని తీసేసి శుభ్రపర్చారు

- ఓ ప్రభుత్వ ఉద్యోగి.



పోలింగ్ కేంద్రం (ఫైల్)

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి):మహానగరంలో ఎన్నికల విధులు నిర్వర్తించిన సిబ్బందిలో కొందరు ఎదుర్కొన్న ఇబ్బందులివి. 'గతంలో ఈ తరహా సమస్యలు ఎదురయ్యాయి.. మీరు సరైన ఏర్పాట్లు చేయరు.. మేం విధులకు రాము' అని వినతి పత్రాలిస్తే.. ఇవేం కారణాలు.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.. సస్పెండ్ చేస్తామని హడలెత్తించిన ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో కనీస వసతుల కల్పనను మాత్రం ఎప్పటిలానే పట్టించుకోలేదు. దీంతో మెజార్టీ పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరైన సదుపాయాలు లేక రెండు రోజులు నరకం చూశామని ఉద్యోగులు చెప్పారు. మరుదొడ్లు, బాత్‌రూంలు సరిగా/సరిపడా లేకపోవడంతో అవస్థలు పడ్డామని పలువురు ఆంధ్రజ్యోతితో ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే భవనంలో నాలుగైదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసిన అధికారులు.. ఆ స్థాయిలో వసతులున్నాయా..? లేదా అన్నది పట్టించుకోలేదు. ఐదు పోలింగ్ కేంద్రాల్లో 20 నుంచి 25 మంది సిబ్బంది పని చేస్తారు. వారందరికి ఒకటి, రెండు బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు, స్నానం చేసేందుకు ఇబ్బంది పడ్డారు. '15 మందికి ఒకే బాత్‌రూమ్, మరుగుదొడ్డి ఉంది. దీంతో అర్ధరాత్రి 2 గంటలకు లేచి స్నానం చేయాల్సి వచ్చింది. నిద్ర సరిపోకపోవడంతో పోలింగ్ విధుల నిర్వహణలోనూ ఇబ్బంది పడ్డా' అని సనత్‌నగర్‌లో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా పని చేసిన ఓ అధికారి చెప్పారు. పడుకునేందుకు వసతి లేదని, దుప్పట్లు ఇచ్చే పరిస్థితి లేక నేల మీద పడుకోవాల్సి వచ్చిందని మరో ఉద్యోగి పేర్కొన్నారు. 'విద్యుత్ అంతరాయంతో ఫ్యాన్ తిరగలేదు. దీంతో రాత్రంతా పడుకోలేకపోయా' అని చార్మినార్ నియోజకవర్గంలో విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగి తెలిపారు.

ఆకలితో అలమటించి..

ఎన్నికల వేళ పోలింగ్ సిబ్బంది ఆకలితో అలమటించారు. ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లిన ఆదివారం.. పోలింగ్ డే సోమవారం.. రెండు రోజులపాటు కడుపు నిండా భోజనం లేక నీరసించారు. పోలింగ్ సిబ్బందికి ఏ ఆహారం ఇవ్వాలన్న దానిపై మెనూ రూపొందించారు. ఉదయం టిఫిన్, స్నాక్స్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్‌గా ఏం ఇవ్వాలన్నది పేర్కొన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మజ్జిగ/నిమ్మరసంతో పాటు.. ప్రతి రెండు గంటలకోసారి ఏదైనా ఆహారం ఉండేలా చూసుకోవాలని సూచించారు. పచ్చి కూరగాయలు, సమోసా వంటివీ ఇవ్వాలని మెనూలో ఉంది. పోలింగ్ రోజు మధ్యాహ్నం భోజనంగా ఎగ్ కర్రీ, వెజిటేబుల్‌కర్రీ, చట్నీ, సాంబారు వంటివి ఉండాలి. భోజనంలో పెరుగు తప్పనిసరి. కానీ మెనూ ప్రకారం ఒక్క పోలింగ్ కేంద్రంలోనూ సిబ్బందికి భోజనం అందలేదు. పాచిపోయిన వెజిటేబుల్ బిర్యాని, నీళ్ల ఉప్మా, చారు వంటివి మాత్రమే ఇచ్చారు. చాలా చోట్ల పెరుగు ఊసే లేదు. ఇక పోలింగ్ రోజు ఎండ ఎక్కువగా లేదని నిమ్మరసం/మజ్జిగ వంటివి చాలా చోట్ల ఇవ్వలేదు.

నిధులేమౌతున్నాయ్..?

పోలింగ్ సిబ్బందికి సదుపాయాలు, భోజనానికి ఎన్నికల సంఘం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నది. ఎన్నికల వ్యయంలో 50 శాతం ముందుగా నిధులు విడుదల చేసేది ఇందుకే. నియోజకవర్గాల వారీగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కేంద్రాల వద్ద సదుపాయాల కల్పన, భోజనం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వీటికి సంబంధించిన బిల్లులు ఏఆర్ఓలు ఆర్థిక విభాగానికి పంపుతారు. మెనూ ప్రకారం భోజనాలు అందించకుండా.. అవసరమైన సదుపాయాలు కల్పించకుండా కొందరు ఏఆర్ఓలు ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలున్నాయి. బిల్లులు మాత్రం అన్ని సదుపాయాలు కల్పించినట్టు, మెనూ ప్రకారం భోజనం అందించినట్టు పెట్టి నిధులు కాజేస్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే జరిగింది. ఓ నియోజకవర్గంలో రూ.2 కోట్లు ఎన్నికల వ్యయం కాగా.. ఇంకొన్ని చోట్ల రూ.4 కోట్లకుపైగా వెచ్చించడం గమనార్హం.

ఎఫ్‌ఎంజీఈ ఉత్తీర్ణులే వైద్యం చేయాలి

- అనుమతి లేకుండా ప్రాక్టీస్ చేస్తే చర్యలు ● విదేశీ విద్యను అభ్యసించిన వైద్యులకు కలెక్టర్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): విదేశీ విద్యను అభ్యసించి అనుమతి లేకుండా ఇక్కడి ఆస్పత్రుల్లో పని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. చాలా మంది విదేశీ వైద్యులు ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్‌ఎంజీఈ) పరీక్ష పాస్ కాకుండానే ఆస్పత్రుల్లో పని చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తనిఖీల్లో బయటపడితే ఆయా ఆస్పత్రుల యాజమాన్యం, వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఛైర్మన్ హోదాలో ఆయన హాజరయ్యారు. జిల్లా అదనపు కలెక్టర్ కదిరావన్, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటి, డీసీపీ మనోహర్, ఐఎంఎ సిటీ బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ మిన్హజ్, మాస్ మీడియా అధికారులు రాములు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ఆయన ప్రకటించారు.

- ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఆస్పత్రులు, వెల్‌నెస్ సెంటర్లు, ఫిజియోథెరపీ సెంటర్లు, ఐ క్లినిక్‌లు,

మిగతా 6వ పేజీలో..

వైశ్య లైమ్‌లైట్ అవార్డుల కోసం నామినేషన్స్

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): వైశ్య కమ్యూనిటీలో పలు రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వ్యక్తులను గుర్తించి, గౌరవించే వైశ్య లైమ్ లైట్ అవార్డుల కోసం నామినేషన్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఈ అవార్డుల వ్యవస్థాపకులు ఇమ్మడి శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జూన్‌లో జరుగనుందంటూ మోస్ట్ పాపులర్ వైశ్య మెన్ -2024 అవార్డును అందజేస్తామని పేర్కొన్నారు. మే 25లోగా తమ ఎంట్రీలను వెబ్‌సైట్ https://www.vysyalimelightawards.comలో పంపాలని ఆయన కోరారు.

రైతాంగ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి



మాట్లాడుతున్న మధుసూదనాచారి

చిక్కడపల్లి, మే 17(ఆంధ్ర జ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శతాబ్ధిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ కవి బండియాదగిరి సంస్మరణ సమావేశం శుక్రవారం సాయంత్రం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ బండెనక బండి కట్టి పదహారుబండ్లు కట్టి పాటను రాసిన ఆయన దొరలగుండెల్లో గుబులు లేపారన్నారు. బండి యాదగిరి వంటి త్యాగధనుల వల్లనే నేడు తెలంగాణ విముక్తి చెందిందన్నారు. ఆయన చరిత్ర నేటి యువతకు స్ఫూర్తినివ్వాలన్నారు. బండి యాదగిరి, సుద్దాల హనుమంతు వంటి కవులు, కళాకారులు తమ కలాలు, గళాలు, కళారూపాల ద్వారా సాయుధపోరాటాలకు మద్దతు కూడగట్టడంలో విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తంగిరాల చక్రవర్తి, ప్రముఖ గాయకుడు శ్రీరామసుబ్రహ్మణ్యం, గాయని గరిమెళ్ళ సీత పాల్గొన్నారు.

దాదర్ స్టేషన్ నుంచే రైళ్ల మళ్లింపు : దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ముంబై స్టేషన్‌లో నాన్-ఇంటర్‌లాకింగ్ పనులు, 10, 11 ఫ్లాట్‌ఫాం యార్డుల విస్తరణ పనుల దృష్ట్యా హైదరాబాద్ నుంచి వచ్చే రైళ్లను దాదర్ నుంచే మళ్లించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మే 15 నుంచి 30 వరకు హైదరాబాద్-సీఎస్‌టీ ముంబై రైలు(12702), మే 30, జూన్ 1న లింగంపల్లి-సీఎస్‌టీ ముంబై రైలు(17058), జూన్ 1న బీదర్-సీఎస్‌టీ ముంబై రైలు(22144), మే 31, జూన్1న హైదరాబాద్-సీఎస్‌టీ ముంబై రైలు (22731), జూన్ 1, 2 తేదీల్లో సీఎస్‌టీముంబై -హైదరాబాద్ రైలు(22732) దాదర్ వరకు నడుస్తాయని వివరించారు. జూన్ 1న సీఎస్‌టీ ముంబై-ఆదిలాబాద్ రైలు(11401), సీఎస్‌టీ ముంబై-బీదర్ రైలు(22143)-సీఎస్‌టీ ముంబై-లింగంపల్లి రైలు (17057)దాదర్ నుంచి బయలుదేరుతుందని రైల్వేఅధికారులు పేర్కొన్నారు. గుంటూరు-కాచిగూడ రైలు(17251) మే 18 నుంచి పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. కాచిగూడ-గుంటూరురైలు(17252), కాచిగూడ-మెదక్ రైలు(07577), మెదక్-కాచిగూడ రైలు(07578)ను మే19 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.

మైనార్టీ గురుకులంలో జాతీయ స్థాయి విద్య

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండీ సబిత



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండీ సబిత, ప్రిన్సిపాల్ కవిత, మాధవి

మౌలాలి, మే 17(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల (టీమ్రీస్)లో మైనార్టీ విద్యార్థినులకు జాతీయ స్థాయి విద్యను అందిస్తున్నామని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఎండీ సబిత అన్నారు. గురుకులాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీ చౌరస్తాలో మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో చేరాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో హైదరాబాద్ డీఎండబ్ల్యూఓ ఎండీ ఇయాస్ అహ్మద్, విజిలెన్స్ ఆఫీసర్స్ ఎండీ షకీల్ అలీ మాట్లాడారు. మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో జాతీయ స్థాయి విద్యను అందించడంతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, సనత్‌నగర్ పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ముషీరాబాద్ కళాశాలల ప్రిన్సిపాల్ గ్రేస్ మధుమతి, కంటోన్మెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారత - ఆసియా దేశాల వారధిగా బౌద్ధ పర్యాటకం : ఏబీటీఓ

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగం ఆర్థిక ప్రయోజనాలతోపాటు ఆసియా దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి వారధిగా సాంస్కృతిక సారథిగా వ్యవహరించాలని ఏబీటీవో అంతర్జాతీయ ఉపాధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం భూటాన్‌లోని థింపూలో బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్, మయన్మార్ (బీబీఐఎస్ఎమ్) దేశాల పర్యాటక సమాఖ్య- అసోసియేషన్ ఆఫ్ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్స్ సంయుక్తంగా నిర్వహించిన 'ఆసియా రహదారిపై బౌద్ధ పర్యాటకం' అనే అంశంపై జరిగిన సదస్సులో లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని కీలకోపన్యాసం చేశారు. అసోసియేషన్ ఆఫ్ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కౌలేజ్ కుమార్ సదస్సు ఉద్దేశాలను వివరిస్తూ ఆసియా హైవే 2025 చివరికి అందుబాటులో వస్తుందన్నారు. స్థానిక ఏబీటీవో అధికార ప్రతినిధులు పరశురాం, మణి, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటల్ యజమానులు, టూరిస్ట్ గైడ్లు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి నుంచి భూటాన్ వరకు అంతర్జాతీయ హ్యాపీనెస్ యాత్ర (ఇంటర్నేషనల్ హ్యాపీనెస్ మార్చ్) ను నిర్వహించడానికి భూటాన్ బౌద్ధ సంస్థల ప్రతినిధులతో సన్నాహక చర్యలను ప్రారంభించినట్లు లక్ష్మయ్య తెలిపారు

కుక్క బ్లూపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు

బేగంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్క బ్లూపై విచక్షణా రహితంగా దాడిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని తెలంగాణ కనైన్ అసోసియేషన్ కార్యదర్శి విశాల్ సూదం డిమాండ్ చేశారు. రహమత్‌నగర్‌నగర్ రెండు రోజుల క్రితం కుక్క బ్లూపై కొందరు దాడి చేయడంతో షుగ్రై ఫ్రాక్చర్‌తో బంజారాహిల్స్‌లోని జంతు సంరక్షణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. శుక్రవారం తెలంగాణ కనైన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చికోటి ప్రవీణ్‌కుమార్, విశాల్ సూదం కుక్కను పరిశీలించి, డాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



టోర్నీ వివరాలు వెల్లడిస్తున్న మదన్‌రాజ్, సంతోష్, ప్రవీణ్

23 నుంచి ఆలిండియా క్యారమ్స్

హైదరాబాద్: ఆలిండియా ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ క్యారమ్ చాంపియన్‌షిప్‌నకు రాష్ట్రం ఆతిథ్యమివ్వనుంది. తెలంగాణ క్యారమ్స్ సంఘం (సీఏటీ) ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 26 వరకు నిజామాబాద్ పట్టణంలోని నవభారత్ గ్లోబల్ స్కూల్‌లో టోర్నీ జరగనుంది. అలాగే ఈనెల 25, 26 తేదీల్లో జాతీయ వెటరన్ చాంపియన్‌షిప్ (పురుషులు, మహిళలు) కూడా ఇదే వేదికగా జరగనుందని శుక్రవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో సీఏటీ ప్రతినిధులు వెల్లడించారు. ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టోర్నీకి దాదాపు 200 మంది క్రీడాకారులు, జాతీయ ఈవెంట్‌కు దాదాపు 100 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఏటీ అధ్యక్షులు సంతోష్ కుమార్, జనరల్ సెక్రటరీ మదన్‌రాజ్, సీనియర్ ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు బాండ్ బకాయిలు చెల్లించాలి

ఆర్టీసీ మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం నుంచి స్వీట్లు కాదని, 2013 పీఆర్‌సీకి సంబంధించి బాండ్ బకాయిలు విడుదల చేయాలని కోరుకుంటున్నారని ఆర్టీసీ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులు నిరంతరంగా ప్రత్యేక బస్సులు నడపడంతో సంస్థకు ఒక్క రోజునే 24.23కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. అత్యధిక ఆదాయాన్ని సంపాదించడానికి కృషి చేసిన డ్రైవర్, కండక్టర్‌లందరికీ మిఠాయిలు పంపిణీ చేయాలని యాజమాన్యం నిర్ణయించడం సంతోషకరమన్నారు. కానీ కార్మికులకు బకాయి పడిన బాండ్ డబ్బుల చెల్లింపుల కోసం ముఖ్యమంత్రి మూడు నెలల క్రితమే రూ.280 కోట్లు చెక్కు రూపంలో అందజేసినప్పటికీ ఇప్పటి వరకు ఆర్టీసీలోని కండక్టర్‌లు, మెకానిక్‌లు, ఇతర కార్యాలయాల్లో పని చేస్తున్న 27వేల మందికి బాండ్ బకాయిలు అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బోర్గి సంజీవ్

స్వరాష్ట్ర ఏర్పాటు కోసం సర్వస్వాన్ని కోల్పోయిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

పంజాగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు కోసం సర్వస్వాన్ని కోల్పోయిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉద్యమ సమయంలో పోలీస్ ఉద్యోగం కోల్పోయిన బోర్గి సంజీవ్ ఆరోపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి కావస్తున్నా రాష్ట్ర ఏర్పాటు కోసం త్యాగాలు చేసిన వారికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన అమరవీరులను గుర్తించి ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, తెలంగాణ ఉద్యమకారులకు 500గజాల ఇంటిస్థలం ఇవ్వాలని, అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రజాప్రతినిధులుగా, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫోరం నాయకులు ఎస్కే చాంద్‌పాషా, హైమద్, కార్తీక్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎంజీఈ ఉత్తీర్ణులే వైద్యం చేయాలి

(5వ పేజీ తరువాయి)

ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి ఆస్పత్రులు, క్లినిక్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

- ఆర్ఎంపీ, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకూడదు. వారు కేవలం ప్రథమ చికిత్సే చేయాలి.
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆయుష్ వైద్యులను డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా నియమించవద్దు.
- విదేశాలలో వైద్య విద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా ఎఫ్ఎంజీ పరీక్షలో ఉతీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాకే ప్రాక్టీస్ మొదలుపెట్టాలి.
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను చదవడానికి వీలుగా రాయాలి.
- ఫీజుల వివరాలను పట్టికరూపంలో బోర్డులు ఏర్పాటు చేయాలి.
- వైద్యులు, వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, విద్యార్హతలను రిసెప్షన్ కౌంటర్ వద్ద ప్రదర్శించాలి.
- అనవసరంగా సిజేరియన్ చేస్తే కఠినచర్యలు తీసుకుంటాం.
- ఇద్దరు డాక్టర్ల సమక్షంలో రిజిస్టర్డ్ సంస్థలే అబార్షన్లు చేయాలి.
- గైనకాలజిస్టులు, ఎఆర్‌టీ, సరోగసీలెవల్-1, లెవల్-2 రిజిస్ట్రేషన్లు కలిగి ఉన్న వారు మాత్రమే ఐవీఎఫ్ సెంటర్ల నిర్వహణకు అర్హులు.
- మలేరియా, డెంగీ, టీబీ, హెచ్ఐవీ సోకిన వారి వివరాలను ప్రతి నెలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు తెలపాలి.

బోధన.. వేదన..!

(5వ పేజీ తరువాయి)

తగినంతమంది టీచర్లు లేకపోవడంతో బోధన కుంటుపడుతోంది. ప్రధానంగా 1 నుంచి 5వ తరగతి వరకు నడిచే జీరో, సింగిల్ టీచర్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటేషన్లకు ఇతర పాఠశాలల నుంచి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపించకపోవడంతో బోధన, పరీక్షల నిర్వహణ పనులన్నీ తమపై పడుతున్నాయని వారు వాపోతున్నారు. జీరో టీచర్ స్కూళ్లలో కొందరు బలవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే గతంలో విద్యా వలంటీర్లు ఉండడంతో విద్యార్థులకు తాము పాఠాలను సులువుగా బోధించామని, ప్రస్తుతం పని ఒత్తిడితో సతమతమవుతున్నామని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం కొత్తగా ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడంతో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో బోధించే టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

పదిలో పడిపోతున్న ఫలితాలు..

సబ్జెక్టు టీచర్ల కొరత కారణంగా ఏటా పదో తరగతి వార్షిక పరీక్షల్లో హైదరాబాద్ జిల్లాలో ఉత్తీర్ణత శాతం దారుణంగా పడిపోతున్నది. 2022లో జరిగిన పరీక్షల్లో రాష్ట్రంలో చిట్టచివరగా 33వ స్థానంలో నిలిచింది. కాగా, 2023లో 28వ స్థానానికి చేరుకున్నప్పటికీ ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ర్యాంకుల్లో 30వ స్థానంలోకి వెళ్లింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. అయితే ఉన్నత పాఠశాలల్లో బోధించేందుకు సరిపడా టీచర్లు లేకపోవడంతోనే ఏటా ఉత్తీర్ణత తగ్గిపోతోందని విద్యార్థులు వాపోతున్నారు.

ఈసారైనా వలంటీర్లకు మోక్షం లభిస్తుందా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించిన విద్యా వలంటీర్లను కాంగ్రెస్ సర్కారు తిరిగి విధుల్లోకి తీసుకుంటుందా.. లేదా అన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో 11,602 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే టెట్, మెగా డీఎస్సీ నిర్వహించి వాటి ఫలితాలు వెల్లడించే వరకు కనీసం నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జూన్ 12న ప్రారంభమయ్యే 2024-25 విద్యాసంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని వలంటీర్లను తీసు కుంటే విద్యార్థులకు సకాలంలో బోధనలు అందే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. లేని పక్షంలో మళ్లీ బోధనలు కుంటుపడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

వాతావరణంలో మార్పులతో ఆరోగ్యానికి చేటు

(5వ పేజీ తరువాయి)

వాతావరణంతో వైరస్ పుంజుకుంటుందని వైద్యులు తెలిపారు. అకస్మాత్తుగా మారుతున్న వాతావరణంతో రెస్పిరేటర్ వ్యవస్థ దెబ్బతింటుందని చెప్పారు.

తగ్గిపోతున్న రోగ నిరోధక శక్తి

వాతావరణం అసాధారణంగా ఉండడంతో రోగ నిరోధకశక్తి సన్నగిల్లుతుంది. ఈ పరిస్థితుల్లో త్వరగా నీరసించిపోతారు. ఒంట్లో నీటి శాతం తగ్గి డీ హైడ్రేషన్ బారిన పడతారు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు, ఇతర జబ్బులతో బాధ పడే వారు ఎక్కువగా ఇబ్బంది పడతారు. రాత్రి పూట చలిగా ఉండడం, పగలు ఎండగా ఉండడం వల్ల వారు త్వరగా అస్వస్థతకు గురవుతారని వైద్యులు తెలిపారు.

వాతావరణంలో మార్పుతో వ్యాధులు



వాతావరణంలోమార్పులతో ఇన్‌ఫ్లూయెంజా వైరస్ విజృంభించి జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ వ్యాధులు తీవ్రమవుతాయి. బాధితులు గొంతు ఇన్‌ఫెక్షన్, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడతారు. ప్రస్తుత పరిస్థితుల్లో బయటి ఆహారం, నీళ్ల తీసుకుంటే జీర్ణకోశ జబ్బులు వస్తాయి. అతిసారతో ఇబ్బందులు పడతారు. వర్షపు నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వ్యాధులు విజృంభిస్తాయి. గోరువెచ్చని నీటిని తాగడం మంచిది. బయటి ఆహారం, నీళ్ల తీసుకోకూడదు.

- డాక్టర్ శివరాజు, సీనియర్ జనరల్

ఒక్కో ప్రాంతంలో అర గంట పవర్ కట్

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యుత్‌తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించే చర్యలు చేపట్టాలని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించారు.

71 ఎంయూలకు పడిపోయిన డిమాండ్

వర్షాలతో ఎండల తీవ్రత కాస్త తగ్గింది. శుక్రవారం గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 32 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మే 4న అత్యధికంగా 90.68 మిలియన్ యూనిట్ల(ఎం.యూ) విద్యుత్‌డిమాండ్ నమోదుకాగా, శుక్రవారం 71 మిలియన్ యూనిట్లకు పడిపోయింది.

అల్లం వెల్లుల్లి పేస్టు కొంటున్నారా.. జాగ్రత్త

డబ్బు సంపాదన కోసం కొంతమంది అడ్డదారులు తొక్కుతున్నారు. కనిపించిన ప్రతి వస్తువును నకిలీగా మారుస్తున్నారు. ఇటీవల కాలంలో బ్రాండెడ్ వస్తువులను నకిలీవి తయారు చేసిన విషయం తెలిసిందే. అదే తరహాలో కొంతమంది నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును తయారు చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టు కొనుగోలు చేసిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవల రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు పరిశ్రమలపై జరిపిన దాడుల్లో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

● కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లితో తయారు



అల్లం లేకుండా పాడైన వెల్లుల్లి, కలర్స్‌తో తయారు చేస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్ (ఫైల్)

రాజేంద్రనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాలలో కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేసి గుట్టు చప్పుడుకాకుండా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారు చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్, ఎంఎం పహడీ, చింతల్ మెట్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకొన్నారు. ఆయా పరిశ్రమలో ఎటువంటి నిబంధనలు పాటించకుండా అపరిశుభ్రమైన వాతావరణంలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారు చేస్తున్నారు. కుళ్లిపోయిన అల్లం, పాడైన వెల్లుల్లి గడ్డలను తీసుకుని అల్లం, వెల్లుల్లి పేస్టు తయారు చేస్తున్నారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌లో రంగు రావడానికి వెనిగర్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ కలర్ కలుపుతున్నారు. ఇలా తయారు చేసిన నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును అందమైన కవర్లలో ప్యాక్ చేసి బహిరంగా మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని కొనుగోలు చేసి తిన్న ప్రజలు అనారోగ్యాలకు గురువుతున్నారు.



రంగు రంగుల ప్యాకెట్లలో...

హానికరమైన రంగులను కలుపుతూ

అపరిశుభ్రమైన వాతావరణంలో సింథటిక్ కెమికల్స్ వేసి తయారు చేసిన 3,500 కిలోల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను పోలీసులు గతంలో స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి లూజు సోడియ బెంజోయేట్ రసాయన పొడి, గమ్ పౌడర్, రంగు కోసం వాడుతున్న పసుపు పొడి, స్టిక్కర్లు, ప్యాకింగ్ పెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. వీరు రోషన్ అల్లం వెల్లుల్లీ పేస్ట్, మాస్ డైమండ్, స్వచ్ఛమైన అల్లం పేర్లతో అల్లం వెల్లుల్లీ పేస్ట్‌ను విక్రయిస్తున్నట్లు ఎస్ఓటీ పోలీసులు కనుగొన్నారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌లో సింథటిక్ ఫుడ్‌కలర్, గమ్ పౌడర్, సోడియం బెంజోయేట్(నెఫ్రోటాక్సిక్ పదార్థం), మృదుత్వం కోసం కెమికల్ పౌడర్, చెడిపోయిన వెల్లుల్లి తొక్కలను వాడి అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు.

రెండు నెలల క్రితం

నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తుండగా రెండు నెలల క్రితం ఎస్వోటీ పోలీసులు పలు స్థావరాలపై దాడి నిందుతులను పట్టుకున్నారు. రాజేంద్రనగర్‌లోని ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయంలో, ఎంఎం పహడీ లక్కీ ఫంక్షన్ హాల్ సమీపంలో, కాటేదాన్ శాంతినగర్‌లో, కాటేదాన్ సుభాన్‌కాలనీలోని పలు స్థావరాలపై ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను పట్టుకున్నారు.



టబ్‌లలో నిల్వ చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్ (ఫైల్)

2023, మే7న శాంతినగర్‌లో

2023 మే 7న కాటేదాన్ శాంతినగర్ కాలనీలో ఫిరోజ్‌అలీ, అజిత్ అనే ఇద్దరు వ్యాపారులు అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ చేస్తూ పరిశ్రమలో పట్టుబడ్డారు. వారి నుంచి అల్లం వెల్లుల్లి తయారు చేసే ఎనిమిది యంత్రాలు, 50 కిలోల శాంతన్ కమ్ ఫుడ్‌గ్రేడ్ ప్యాకెట్లు, 210 లీటర్ల ఎసిటిక్ యాసిడ్, 550 కేజీల ఖానా ఖజానా నాన్ వెజ్ మసాల ప్యాకెట్లు, ఒక కార్టన్ లిటిల్ చాంప్స్ మ్యాంగో డ్రింక్స్, టన్ను వెల్లుల్లి సంచులు, 20 పౌచ్‌ల కిచెన్‌చాట్, 500 కిలోల జిగ్నర్ వెలుల్లి పేస్టు స్వాధీనం చేసుకున్నారు. అల్లం వెల్లుల్లి పేస్టులో అసలు అల్లం వాడటం లేదని, దానికి బదులు రసాయనాలు ఉపయోగిస్తున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఎనిమిది మిషన్ల ద్వారా పదిమంది కార్మికులతో రోజూ పెద్ద మొత్తంలో అల్లం వెల్లులి పేస్ట్ తయారు చేసి నగరంలోని వివిధ దుకాణాలలో విక్రయిస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. అల్లం వెల్లుల్లి పేస్ట్‌తోపాటు చిక్కీలు, బెల్లం పట్టీలు, నువ్వుల లడ్డూలు తయారు చేస్తున్నట్లు కనుగొన్నారు.



కాటేదాన్ సుభాన్ కాలనీలో..

2024 మార్చి 9న కాటేదాన్ సుభాన్ కాలనీలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో సింథటిక్ కెమికల్స్ వేసి, అపరిశుభ్రమైన వాతావరణంలో నకిలీ అల్లం వెల్లుల్లీ పేస్ట్‌ను అనుమతులు లేకుండా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. పరిశ్రమను నడుపుతున్న చార్మినార్ రంగేలికిడికికి చెందిన మహ్మద్ అహ్మద్(34)ను అరెస్ట్ చేశారు. రూ.2.8 లక్షల విలువ చేసే యంత్రాలు, నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్, ముడిసరుకులు స్వాధీనం చేసుకున్నారు. పరిశ్రమ నిర్వాహకుడు మహ్మద్ అహ్మద్ తీసుకున్న లైసెన్సు రెండేళ్ల క్రితమే ముగిసినట్లు పోలీసులు అప్పట్లో కనుగొన్నారు.



సభాన్ కాలనీలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తూ పట్టుబడిన నిర్వాహకుడు(ఫైల్)

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Cgvj6LD లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



స్వాధీనం చేసుకున్న బైకలతో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, క్రైమ్ టీమ్

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

● 8 ద్విచక్రవాహనాలు స్వాధీనం

మదీన, మే 17 (ఆంధ్రజ్యోతి): బైక్‌లను దొంగతనం చేస్తున్న ఇద్దరిని బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బండ్లగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం యాకుత్‌పురాకు చెందిన అబ్దుల్ ఖదీర్, బండ్లగూడ నూరినగర్‌కు చెందిన అమానుల్లా స్నేహితులు. జల్సాలకు అలవాటుపడ్డ వారు సులువుగా డబ్బు సంపాదన కోసం బైక్ దొంగతనాలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో పలు ప్రాంతాలలో వారు ద్విచక్ర వాహనాలను దొంగిలించారు. విశ్వసనీయ సమాచారమందుకున్న బండ్లగూడ క్రైమ్ టీమ్ సిబ్బంది ఈనెల 16న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బైకులు చేరీ చేస్తున్నట్టు అంగీకరించారు. వారి నుంచి రూ.8.60 లక్షల విలువైన ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా బండ్లగూడ, అఫ్జల్‌గంజ్, షాలిబండ, పంజాగుట్ట, చాంద్రాయణగుట్ట, హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

స్నేహితులతో భవనంపై సెల్ఫీ తీసుకుంటూ.. కిందపడిన యువకుడికి గాయాలు

చాంద్రాయణగుట్ట, మే 17(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగుతుండగా భవనంపై నుంచి కిందపడిన యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉప్పుగూడ క్రాంతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కందికల్‌గేట్ ప్రాంతానికి చెందిన భాగ్య కుమారుడు నాని(16)శుక్రవారం ఉప్పుగూడ క్రాంతినగర్‌లో వాంబే క్వార్టర్స్‌కి వెళ్లాడు. తన స్నేహితులు అదే క్వార్టర్స్ రెండో అంతస్తులో నివసిస్తారు. అక్కడికి వెళ్లి వారితో సెల్‌ఫోన్‌లో ఫొటోలు, సెల్ఫీలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భవనానికి అనుకోని ఉన్న విద్యుత్ కేబుల్‌పై పడడంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

9 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. నింబోలిఅడ్డా మౌలానా ఆజాద్‌నగర్‌కు చెందిన షాహీఉద్దీన్ (26) కార్డు దారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. గురువారం రాత్రి అశోక్ లీల్యాండ్ వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా నింబోలిఅడ్డా వద్ద వలపన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, షాహీఉద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని సీవీల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

బ్రేక్ వేయబోయి ఎక్సలేటర్ తొక్కిన డాక్టర్

● ఫుట్‌పాత్‌పై వ్యాపారులను ఢీకొన్న కారు

● పలువురికి గాయాలు

మెహిదీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): కారు బ్రేక్ వేయబోయి, ఎక్సలేటర్ తొక్కడంతో ఫుట్‌పాత్‌పై ముగ్గురు పండ్ల వ్యాపారులకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రిలో రోహిత్ కన్నా డాక్టర్. రోజు మాదిరిగానే ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి శుక్రవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో వస్తుండగా లంగర్‌హౌస్ బాపుఘాట్ తపోవనం వద్ద రోడ్డు ఫుట్‌పాత్‌పై పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్న వారిపైకి కారు దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో పండ్ల వ్యాపారులు తరుణ్(20), తాఫిక్(28), సోహెల్(35)కు గాయాలయ్యాయి. వారిలో సోహెల్‌కు తలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు.

డాక్టర్ రోహిత్ కన్నా బ్రేకు వేసే బదులు, ఎక్సలేటర్ తొక్కడంతోనే ఒక్కసారిగా కారు ఫుట్‌పాత్‌పై ఉన్న వ్యాపారులపై దూసుకెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విషయం తెలుసుకున్న లంగర్‌హౌస్ పోలీసులుతోపాటు ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత మెగా వైద్య పరీక్షా శిబిరం

చాదర్‌ఘాట్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రేష్ఠ శ్రీకమల ఆస్పత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, డెంటల్, ఫైబ్రోస్కాన్, ఎముకల సాంద్రత పరీక్షలతోపాటు ఈసీజీ, జీఆర్‌బీఎస్, సీబీపీ పరీక్షలు చేయనున్నారు. శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించనున్నారు. వివరాల కోసం 89089 01188, 040-277661188 ఫోన్‌నెంబర్లలో సంప్రదించవచ్చు.



సిబ్బందికి మిఠాయిలు పంచిపెడుతున్న డిపో మేనేజర్ జాకీర్ హుసేన్

ఆర్టీసీ సిబ్బంది అదనపు ఆదాయం తేవాలి

● ఫలక్‌నుమా డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్

చాంద్రాయణగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా ఉంటూ ఆర్టీసీ సంస్థకు అదనపు ఆదాయం తేవాలని ఫలక్‌నుమా డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం ఆర్టీసీ సిబ్బంది, కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వివిధ ప్రాంతాలకు అదనపు బస్సులు నడిపి, సంస్థకు అదనపు ఆదాయం తీసుకొచ్చిన సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు విధి నిర్వహనలో తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని అన్నారు.



పైపులైన పనులను ప్రారంభిస్తున్న కౌడి మహేందర్ తదితరులు

డ్రైనేజీ పైపులైన్ పనులు నాణ్యతతో చేపట్టాలి

చాంద్రాయణగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పైపులైన్ పనులు నాణ్యతతో చేపట్టాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కౌడి మహేందర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. జంగమ్మెట్ డివిజన్ లాల్‌దర్వాజ ఓంనగర్‌లో రూ.8 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో కాలనీలలో ప్రజలు మురుగు సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామని చెప్పారు.



కెడెట్స్‌తో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వి. మధుసూదన్‌రెడ్డి

ప్రజల మధ్య పరస్పర సంబంధాలను ప్రోత్సహించడమే

‘ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్’ ఉద్దేశం

● ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్

అల్వాల్, మే 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతిని బలోపేతం చేయడమే లక్ష్యమని, అందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పోత్సహించడమే ‘ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్’ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మే 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేషనల్ కెడెట్స్ కార్ప్స్ (ఎన్‌సీసీ) శిక్షణకు 600 మంది ఎన్‌సీసీ కెడెట్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ డైరెక్టరేట్‌ల నుంచి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణలోని వివిధ ఆచారాలు, సంప్రదాయాలు, భాషను రాజస్థాన్ ఎన్‌సీసీ కెడెట్స్ తెలుసుకోవడానికి దోహదపడుతుందన్నారు. రాజస్థాన్‌లో తాను పనిచేశానని, అక్కడి అనుభవాలను ఆయన కెడెట్స్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్ కమోడోర్ రాజస్థానీ భాషలో కొన్ని వాక్యాలు మాట్లాడటంతో రాజస్థాన్ నుంచి వచ్చిన కెడెట్స్ హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై ఎస్‌బీఐ ఖాతాదారులకు అవగాహన

● ప్రచార రథాన్నిప్రారంభించిన ఎస్‌బీఐ జనరల్ మేనేజర్

అఫ్జల్‌గంజ్, మే 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను అరికట్టేందుకు బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ మంజుశర్మ, దేబాశీష్ మిశ్రా తెలిపారు. సైబర్ సెక్యూరిటీపై ఎస్‌బీఐ ఖాతదారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టామని వారు తెలిపారు. శుక్రవారం కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ‘సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్’ డ్రైవ్ ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజుశర్మ మాట్లాడుతూ ఎస్‌బీఐ ఖాతాదారులు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ఖాతాదారులను బురిడీ కొట్టించి, వారి ఖాతాలో డబ్బును కొల్లగొడుతున్నారని అన్నారు. అలాంటి మోసాలు జరగకుండా నివారించేందుకు సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎస్.కె.సారథి, డీజీఎం జితేంద్రకుమార్ శర్మ, సునీల్‌కుమార్ గోయల్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



కోఠి ప్రధాన కార్యాలయంలో జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ మంజుశర్మ, దేబాశీష్ మిశ్రా

విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

● 179 మందికి ఇంటర్వ్యూ
● 26 మంది విద్యార్థుల ఎంపిక



విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో అధ్యాపకులు

రాజేంద్రనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో విప్రో, ఫ్లిప్‌కార్ట్, ఆక్సిస్ బ్యాంక్, అమెజోన్, టీమ్ లీస్ డిజిటల్, ఎస్.ఎం ఫౌండేషన్, పీఎస్‌వీ సంస్థల ప్రతినిధులు పాల్గొని 179 మంది విద్యార్థులను ఇంటర్వ్యూలు చేశారు. వారిలో కంప్యూటర్ స్కిల్స్ ఉన్న 26 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను విజ్ఞాన్ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు అభినందించారు. అనంతర కళాశాల చైర్మన్ గౌరీ సతీస్ మాట్లాడుతూ ప్రతియేట ఉద్యోగ మేళా నిర్వహించి, వారు డిగ్రీ సర్టిఫికెట్‌తోపాటు ఉద్యోగ అవకాలు కల్పిస్తున్నామని తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన, అవసరమైన శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, మానస, శ్రీలత, జ్యోతి, స్వప్న, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

● షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
● పూర్తిగా దగ్ధమైన హార్డ్‌వేర్ దుకాణం
● దుకాణం పై అంతస్తులో నివసిస్తున్న కుటుంబీకులు
● వృద్ధురాలు, పిల్లలను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
● తప్పిన ప్రాణహాని...రూ.3కోట్ల వరకు ఆస్తి నష్టం అంచనా

వికారాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుడప్పుడే తెల్లవారుతుంది... బయటకు వచ్చిన జనం ఆకాశం వైపు చూస్తే దట్టమైన నల్లటి పొగ... ఎగిసి పడుతున్న మంటలు.. ఏంటా అని దగ్గరకు వెళ్లి చూస్తే భగభగ మండే అగ్ని కీలలు పూర్తిగా ఓ భవనాన్ని చుట్టుముట్టాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో హార్డ్‌వేర్ షాపులో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. మూడు అంతస్తుల బిల్డింగ్‌ను మంటలు చుట్టు ముట్టడంతో వికారాబాద్ పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన సేనావత్ కృష్ణ, వికారాబాద్ పట్టణం రామయ్యగూడ రోడ్డులో ఇళ్లు కొనుగోలు చేసి నివాసం ఉంటున్నాడు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో తన తల్లి నాగలక్ష్మీ పేరుపై హార్డ్‌వేర్ షాపు నడుపుతూ పై అంతస్తులో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. అయితే శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో షాపులో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. కృష్ణ బయటకు వచ్చి ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసే సరికి మంటలు పూర్తిగా బిల్డింగ్‌ను చుట్టు ముట్టాయి. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా లాభం లేక పోవడంతో పరిగి నుంచి ఫైర్ ఇంజన్ తోపాటు మునిసిపల్ లో యూజీడీ క్లినింగ్ కోసం ఉపయోగించే ట్యాంకర్‌తో పాటు మరిన్ని నీటి ట్యాంకర్లను అక్కడికి తెప్పించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ తో పాటు, మునిసిపల్ కమిషనర్ సిబ్బంది సైతం అక్కడికి చేరుకున్నారు. వికారాబాద్ సీఐ నాగరాజు సిబ్బంది చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది నాలుగు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తేవడంతో పాటు, పై అంతస్తులో ఉన్న వృద్ధురాలు నాగలక్ష్మితో పాటు చిన్న పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం హార్డ్‌వేర్ సామగ్రితో పాటు నగదు దగ్ధమైంది. బిల్డింగ్ డ్యామేజ్‌తో సుమారు రూ. 3 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లుగా బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా కాంగ్రెస్ నేత సుధాకర్‌రెడ్డి రూ. 25, మరికొందరు బాధితుడికి ఆర్థికసాయం అందజేశారు.



రామయ్యగూడలో నాగలక్ష్మి హార్డ్‌వేర్ షాప్‌లో ఎగిసి పడుతున్న మంటలు

మద్యం మత్తులో కారు భీభత్సం

పాలమ్మే వ్యక్తులపై దూసుకెళ్లగా ఒకరు మృతి, మరొకరికి గాయాలు

మాదాపూర్, మే 17(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు.. ఆపై నిర్లక్ష్యపు డ్రైవింగ్.. మరోవైపు నిద్ర మత్తులో అతివేగంతో కారు నడపడంతో దారుణం జరిగింది. రోడ్డుపక్కన పాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న వ్యక్తులపై కారు దూసుకెళ్లడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదం మాదాపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ మెగా హిల్స్‌కు చెందిన దారు శ్రీనివాస్(35)పాలవ్యాపారి. తనకు అవసరమైన పాలను తీసుకెళ్లడానికి మదాపూర్ లోని హనుమాన్‌నగర్ మెయిన్ రోడ్డుకు ఆటోలో వచ్చాడు. రోడ్డు ప్రక్కన టాటా ఏస్ పాల వాహనంతో (టీఎస్08యూజె4463) రాఘువులు నిలబడ్డాడు. శ్రీనివాస్, రాఘవులు పాలు లోడింగ్ చేస్తుండగా.. రాజేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో కోయా కార్నివాల్ (టీఎస్9ఎఫ్ఎస్4499) కారును శుక్రవారం తెల్లవారుజామున అతివేగంగా నడుపుతూ.. హైటెకసిటీ నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా కారు నడిపిన రాజేష్ రోడ్డు పక్కన పాలు లోడింగ్ చేస్తున్న శ్రీనివాస్, రఘువులపై దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్, రఘువులకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను దగ్గరలోని ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందగా రఘువులు తీవ్రగాయలతో చికిత్స పొందుతున్నాడు. పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు శ్రీనివాస్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతున్న వృద్ధుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటన గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం - గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వృద్ధుడు రైలుపట్టాలపై మృతి చెంది ఉన్నాడని సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే 97126 58581 ఫోన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఒక్క రోజులో ఆర్టీసీకి

రూ.26 కోట్ల ఆదాయం


ఉద్యోగులకు స్వీట్లు పంచుతున్న ఈడీ వెంకటేశ్వర్లు

మారేడ్‌పల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు సమష్టిగా పనిచేస్తే సంస్థ లాభాల బాటలో ఉంటుందని గ్రేటర్ హైదారాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 14వ తేదీన ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యం కలిగించకుండా టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరోజు టీఎస్‌ఆర్టీసీకి రూ.26కోట్లు ఆదాయం రావడం అభినందనీయమన్నారు. ఒకేరోజులో రికార్డుస్థాయిలో 54లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. కంటోన్మెంట్ డిపోతో పాటు గ్రేటర్ జోన్ పరిధిలోని 25 డిపోల్లో ఉద్యోగులకు స్వీట్లు పంచి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌ఎం.ఖాన్, డిప్యూటీ ఆర్‌ఎంలు భీమ్‌రెడ్డి, చౌహాన్, శ్రీనివాస్, పికెట్ డిపో మేనేజర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు 24 గంటలు బస్ సర్వీసులు

గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం 24గంటల పాటు పుష్పక్ ఏసీ బస్సులు నడుపుతున్నదని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం జేబీఎస్‌లోని పుష్పక్ ఎయిర్‌పోర్ట్ బస్‌షెల్టర్‌ను సందర్శించారు. ఎయిర్‌పోర్టుకు పుష్పక్ బస్సులో వెళ్లే ప్రయాణికులకు గులాబీ పువ్వులు అందచేసి అభినందనలు తెలిపారు.

వర్షం, ట్రాఫిక్‌తో 2వేల బస్ ట్రిప్పులు రద్దు


రహదారిపై నిలిచిన వరదనీళ్లలో వెళ్తున్న సిటీబస్

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): వర్షం..ట్రాఫిక్ కారణంగా నగరంలో సిటీ బస్సుల ట్రిప్పులు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ నెలలో 7, 16 తేదీల్లో కురిసిన వర్షం కారణంగా గ్రేటర్‌జోన్‌లో 2వేలకు పైగా బస్ ట్రిప్పులు రద్దయ్యాయి. రహదారులపై భారీగా వరదనీరు చేరడం, ట్రాఫిక్ సమస్యలతో 10 ట్రిప్పులు తిరగాల్సిన రూట్లలో 5-6 ట్రిప్పులే తిరగడంతో బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్‌లో ఆర్టీసీ రోజూ 30వేల బస్‌ట్రిప్పులు నడుపుతూ 20లక్షల మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలందిస్తోంది. భారీ వర్షంపడిన రోజుల్లో బస్‌ట్రిప్పులు తగ్గి ప్రయాణికుల సంఖ్య కూడా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ట్రాఫిక్ లేని రూట్లలో వర్షం పడినా.. ట్రిప్పులు యథాతథంగా తిరుగుతుంటాయని, ట్రాఫిక్ ఉన్న రూట్లలో బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఆలస్యంగా డిపోలకు చేరడంతో కొన్ని డిపోల్లో ట్రిప్పులు తగ్గుతుంటాయని ఓ డిపో మేనేజర్ తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్‌పై ఫిర్యాదులు..

గ్రేటర్‌లో ఉదయం, రాత్రి సమయాల్లో కొంతమంది ఆర్టీసీ డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్‌తో దూసుకుపోతున్నారంటూ ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. బస్టాప్‌లో బస్సులు ఆపకుండా రోడ్లపై ఆపడం, ప్రయాణికులు ఎక్కేవరకు బస్సు నిలపకుండా ముందుకు వెళ్లడంతో తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

రేపు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉచిత ఆరోగ్య శిబిరం

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా సుందర్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో సీనియర్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస్, కంటి వైద్యులు కులశేఖర్, నిలోఫర్ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యులు కేవీఎస్ నారాయణ, ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్లు శ్రీవర్ధన్, సుధీర్‌తో పాటు వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, స్క్రీనింగ్ పరీక్షలతో పాటు నేత్ర, రక్త పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే పిల్లలకు ఆరోగ్య సంబంధమైన పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని వారు కోరారు.

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి


సమీక్షలో మాట్లాడుతున్న పాటిల్ హేమంతకేశవ్

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరుగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంతకేశవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం సప్లమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒడ్డెన్న, అడిషనల్ డీసీపీ బాపురావు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ మహ్మద్ షాకీర్‌హుస్సేన్ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సమాజహితం కోసమే సామాజిక శాస్త్రాలు

● ఉపాధి అవకాశాలు వచ్చేలా అధ్యాపకులు పుస్తకాలు రూపొందించాలి ● రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి


75 ఏళ్ల పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌పై సావనీర్ విడుదల చేసిన ప్రొ.లింబాద్రి, ప్రొ.వీఎస్ ప్రసాద్, వీసీ ప్రొ. కె సీతారామరావు

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం సామాజిక శాస్త్రాలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి అన్నారు. డా.బీ.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సామాజిక శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో 'భారతదేశంలో 75 సంవత్సరాల పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్.. సమకాలీన స్థితిగతులు' అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సును శుక్రవారం జూబ్లీహిల్స్ అంబేడ్కర్ వర్సిటీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసం పూర్తయ్యాక ఎలాంటి ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశముందనే అంశాన్ని ప్రధానంగా అధ్యాపకులు దృష్టిలో పెట్టుకొని పుస్తకాలను రూపొందించాలని సూచించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అభ్యసించిన విద్యార్థి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసేలా, సమాజ హితం కోరే వ్యక్తిలా రూపుదిద్దుకోవాలన్నారు. అంబేడ్కర్ వర్సిటీ మాజీ ఉపకులపతి, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొ.వి.ఎస్.ప్రసాద్ కీలకోపన్యాసం చేశారు. సామాజిక శాస్త్రాల విభాగం విద్యార్థులను తమవైపు ఆకట్టుకోవాలంటే బోధన విధానంలో, పాఠాలు రూపొందించే విధానంలో మార్పులు రావాలన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ చాట్ జీపీటీ యుగంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఎలా ఉంటే బాగుంటుందో యువ అధ్యాపకులు, పరిశోధకులు ఆలోచించి పుస్తకాల రూపకల్పన చేయాలన్నారు. విశ్వవిద్యాలయ వీసీ ప్రొ. కె.సీతారామారావు మాట్లాడుతూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం దేశంలో ఆవిర్భవించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆ విభాగం ప్రజా ప్రయోజనం కోసం ఏ విధంగా పనిచేసింది, ఇంకా ఎలా రూపాంతరం చెందాలనే అంశంపై చర్చ జరగాలనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తునట్లు వెల్లడించారు. సదస్సు డైరెక్టర్ ప్రొ.పల్లవి కాబ్దే మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, సామాజిక శాస్త్రం విభాగ డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ దృక్కోణాలపై ప్లీనరీ సెషన్

'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ దృక్కోణాలు' పై ప్లీనరీని నిర్వహించారు. ఈ సమావేశానికి చౌదరి దేవీలాల్ విశ్వవిద్యాలయం (హరియాణా) ఉపకులపతి ప్రొ.అజ్మీరా సింగ్ మాలిక్ చైర్మన్‌గా ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మాజీ ఆచార్యులు ప్రొ.వై. పార్థసారథి, వీర్ నర్మద్ (గుజరాత్) విశ్వవిద్యాలయ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆచార్యులు ప్రొ.ఎ. వెంకట్రామన్, డర్బన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (సౌత్ ఆఫ్రికా) డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఎకనామిక్స్ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ విభాగం ప్రొనిర్మలా దొరస్వామి, రాజ్‌షాహి విశ్వవిద్యాలయం (బంగ్లాదేశ్) పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొ.మార్జినా బేగం, హిమాచల్ ప్రదేశ్ విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొ. సంజీవ్‌కుమార్ మహాజన్ తదితరులు ప్రసంగించారు.

రూ. లక్షలు కొల్లగొడుతున్న

కేటుగాడు అరెస్ట్

● అమెరికాలో ఇండియన్ స్టూడెంట్స్‌కు టోకరా
● సెమిస్టర్ ఫీజులు 10 శాతం తగ్గిస్తామంటూ బురిడీ

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): అమెరికాలో చదువుకునే విద్యార్థులకు యూనివర్సిటీల్లో సెమిస్టర్ ఫీజు పదిశాతం తగ్గిస్తానని నమ్మబలికి వారి నుంచి రూ.లక్షల్లో డబ్బులు కొల్లగొడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సైబర్ నేరగాడిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం..

ఏపీకి చెందిన అశోక్‌కుమార్ కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇతనికి అమెరికాలో ఉంటున్న తరుణ్, ఢిల్లీలో ఉంటున్న వక్వార్‌లు స్నేహితులు. గతంలో వీరంతా వివిధ కన్సల్టెన్సీ, ఏజెన్సీలలో పనిచేశారు. ఉన్నత చదువులకోసం అమెరికాకు వెళ్తున్న విద్యార్థుల డేటాను వారు ఎప్పటికప్పుడు సేకరిస్తుంటారు. అశోక్ వారిని కలిసి అమెరికాలో మీరు చదువుతున్న యూనివర్సిటీల్లో మా ద్వారా ఫీజు చెల్లిస్తే సెమిస్టర్ ఫీజును 10 శాతం తగ్గిస్తారని నమ్మించేవాడు. దాంతో అతని మాటలు విశ్వసించిన కొందరు స్టూడెంట్స్ తల్లిదండ్రులు పదిశాతం తగ్గింపుతో ఫీజును అతని ఖాతాలో వేసేవారు. వెంటనే క్రెడిట్‌కార్డు, డెబిట్ కార్డు ద్వారా అతను చెల్లించేవాడు. అందుకు ఫీజు పేమెంట్ చేసినట్లు యూనివర్సిటీ నుంచి మెసేజ్ వచ్చేది. దానిని స్టూడెంట్స్‌కు, వారి తల్లిదండ్రులకు షేర్ చేసేవాడు. వారు నమ్మిన తర్వాత కొన్ని గంటల్లోనే నిందితుడు అశోక్ ఫీజు చెల్లించిన యూనివర్సిటీకి మరో మెసేజ్ చేసేవాడు. పొరపాటున వేరే వారికి చెల్లించాల్సిన ఫీజు మీకు చెల్లించానని, దయచేసి ఆ డబ్బును రీఫండ్ చేయగలరంటూ రెక్వెస్ట్ మెసేజ్ పెట్టేవాడు. దాంతో యూనివర్సిటీ వారు ఆ డబ్బును రిఫండ్ చేసేవారు. అయితే, సదరు స్టూడెంట్ ఫీజు పెండింగ్‌లోనే ఉండేది. కొద్దిరోజుల తర్వాత సెమిస్టర్ ఫీజు చెల్లించలేదని, పెండింగ్‌లో ఉందని తెలియడంతో స్టూడెంట్ పేరెంట్స్ అవాక్కవుతున్నారు. డబ్బు చెల్లించినట్లు మెసేజ్ చూపించినా.. ఆ డబ్బులు వెంటనే రిటర్న్ తీసుకున్నారని చెప్పడంతో మోసపోయినట్లు తెలుసుకున్నారు. ఇలా సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన ఓ స్టూడెంట్ తండ్రి రూ. 4,38,599లు అశోక్‌కు చెల్లించి మోసపోయారు. ఫోన్ చేస్తే అతను స్పందించకపోవడంతో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ బృందం టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితుడు అశోక్‌ను అరెస్టు చేశారు. అతనికి అమెరికాలో ఉంటున్న అతని స్నేహితుడు తరణ్, ఢిల్లీలో ఉంటున్న స్నేహితుడు వక్వార్‌లు సహకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

'కొల్లూరు' పనులతో ఆర్‌అండ్‌బీకి సంబంధం లేదు

పటాన్‌చెరు, మే 17 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం కొల్లూరు ఆర్వోబీ పనులతో ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధం లేదని ఆ శాఖ చేవెళ్ల డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వేంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 'నత్తనడకన కొల్లూరు ఆర్వోబీ పనులు' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. కొల్లూరు ఆర్వోబీ పనులు రైల్వే శాఖ, హెచ్‌జీసీఎల్/హెచ్‌ఎండీఏ శాఖ వారే చేపడుతున్నారని తెలిపారు. అందువల్ల ఈ పనుల పురోగతితో తమకు సంబంధం లేదని వేంకటేశ్వర్‌రావు వివరించారు.

వర్షపునీరు తోడే క్రమంలో విద్యుత్ షాక్

ఐదో తరగతి విద్యార్థి మృతి


మృతి చెందిన ఇమ్రాన్

కూకట్‌పల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి వచ్చిన వర్షపునీటిని కరెంట్ మోటర్‌తో తోడే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... ప్రశాంతినగర్ సమీపంలోని ఇంద్రానగర్‌లో మహ్మద్ పాషా, నజీయాబేగం దంపతులు నివాసముంటున్నారు. వీరి కుమారుడు ఇమ్రాన్(10) స్థానిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి వీరి గుడిసెలోకి వర్షపునీరు చేరింది. దీంతో నీటిని కరెంటు మోటర్ సహాయంతో బయటకు తోడేందుకు ఇమ్రాన్ ప్రయత్నించాడు. ఈక్రమంలోనే మోటర్‌కు ఉన్న తీగలను ప్లగ్‌లో పెట్టేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఇమ్రాన్ కిందపడిపోయి స్పృహ కోల్పోయాడు. 108 వాహనంలో కూకట్‌పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం

● మల్కాజిగిరి కార్పొరేటర్ సహా నలుగురు అరెస్టు

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సరిగా లేదని పాతబస్తీలోని ఓ పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతోందని.. పాత వీడియోను సోషల్ మీడియా (ఎక్స్ ట్విటర్)లో పోస్టు చేసి ప్రజలను, అధికారులను తప్పుదోవ పట్టించిన నలుగురిని సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. వారిని శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం ప్రధాన నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించింది. సైబర్ క్రైం డీసీపీ కవిత ధార తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల్లో పాతబస్తీలోని బహదూర్‌పురా పరిధిలోని ఒక పోలింగ్ స్టేషన్‌లో రిగ్గింగ్ జరుగుతోందని ఒక వీడియోను ఎక్స్‌లో కొంతమంది వ్యక్తులు పోస్టు చేసి ప్రచారం చేశారు. అయితే సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ముందస్తు నిఘా పెట్టిన ఎన్నికల సంఘం దాన్ని పరిశీలించి.. కావాలని చేసిన తప్పుడు ప్రచారంగా గుర్తించింది. వెంటనే ఈసీ అధికారులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు డీసీపీ కవిత, ఏసీపీ చాంద్‌పాషా ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించిన పోలీసులు ఆ వీడియో 2022 ఎన్నికల సమయంలో పశ్చిమబెంగాల్‌కు చెందినదిగా తేల్చారు. పాత వీడియోను హైదరాబాద్‌లో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలకు ఆపాదిస్తూ కావాలనే వైరల్ చేసినట్లు తేలింది. తప్పుడు వీడియో పోస్టు చేసిన మల్కాజిగిరి కార్పొరేటర్ పూరపల్లి శ్రవణ్, నాంపల్లికి చెందిన మహ్మద్ బిన్ ఆలీ అల్‌గుత్మీ, చాదర్‌ఘాట్ ఉస్మాన్‌పురకు చెందిన పెదముల్ల కాశి, చిక్కడపల్లికి చెందిన కనుకటి మిథిలేష్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కాగా.. కార్పొరేటర్ శ్రవణ్‌కు 14 రోజులు రిమాండ్ విధించిన న్యాయస్థానం మిగిలిన ముగ్గురికి బెయిల్ మంజూరు చేసింది.

బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడి ఆత్మహత్యాయత్నం

బోయినపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం బయటకు పొక్కిందనుకుని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనపై ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నారాయణపేట్‌కు చెందిన అనిల్‌కుమార్ (24) నాలుగేళ్ల క్రితం ఓల్డ్ బోయినపల్లిలోని వల్లభ్‌నగర్‌లో తన తల్లి తండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అనిల్‌కుమార్ ఓ మంచినీటి శుద్ధి కేంద్రంలో టెక్నీషియన్. ఈ నెల 13న అనిల్ కుమార్ తల్లితండ్రులు ఓటు వేయడానికి ఊరెళ్లారు. ఈ క్రమంలో ఇంటిముందు ఆడుకుంటున్న వల్లభ్‌నగర్‌కు చెందిన బాలిక(8)కు కేక్ ఇస్తానని అనిల్‌కుమార్ ఆశచూపి ఇంట్లోకి పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో కోపంతో బాలిక తల్లిదండ్రులు అనిల్‌కుమార్‌ను చితకబాదారు. బాలిక తల్లి అతని కళ్లల్లో కారంపొడి కొట్టగా.. దానిని కడుక్కోవడానికి అనిల్‌కుమార్ ఇంట్లోకి వెళ్లి ఎంతకూ బయటకు రాలేదు. దీంతో అనుమానించిన బాలిక తల్లితండ్రులు ఇంట్లోకి వెళ్లి చూడగా అతను ఉరేసుకుని కనిపించాడు. వెంటనే అతన్ని కిందకు దింపి పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం అనిల్ కుమార్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఈ నెల 14న కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిల్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని ఎస్‌ఐ శివశంకర్ వెల్లడించారు.

మీ వల్లే మా నాన్న చనిపోయాడంటూ..

కర్రలతో బావమరుదుల దాడి

● బావ తలకు 19 కుట్లు.. ● అత్తకు విరిగిన కాలు.. ● ఐదుగురిపై కేసు ● తోపుఖానాలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి...


తలకు తీవ్రగాయమైన రామేశ్వర్


కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగాబాయి

అఫ్జల్‌గంజ్, మే 17 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య తలెత్తిన స్వల్పవివాదం రెండు కుటుంబాల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. క్షణికావేశంలో ఇద్దరు బావమర్దులు బావ, అతని తల్లిపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన బేగం బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనలో దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులపైన కేసు నమోదు చేసినట్లు బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

బేగంబజార్ తోపుఖానాకు చెందిన రామేశ్వర్ (39), ఉప్పుగూడకు చెందిన సంతోషి (34)లకు వివాహమై 13 సంవత్సరాలు అవుతున్నది. వీరికి ముగ్గురు సంతానం. వీరు తోపుఖానాలో ఉంటున్నారు. అయితే, కొన్నేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరిగేది. గొడవ జరిగినప్పుడల్లా భార్య ఉప్పుగూడలో ఉన్న తన తల్లిగారింటికి వెళ్లేది. కాగా, ఈనెల 2న సంతోషి తండ్రి రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు కిందపడి చనిపోయాడు. అయితే, రామేశ్వర్, సంతోషికి పెట్టే ఇబ్బందుల కారణంగానే తీవ్ర మనోవేదనలో తన తండ్రి ప్రమాదానికి గురై చనిపోయాడని బావమరుదులు మనుసులో పెట్టుకున్నారు. తండ్రి దశదినకర్మ నేపథ్యంలో వస్తువులను కొనుగోలుకు సంతోషి, ఆమె అన్నదమ్ములు హరికృష్ణ, రామకృష్ణ, ఆడపడుచు అరుణతో పాటు మరో ఇద్దరు బంధువులు ఈనెల 10న బేగంబజార్‌కు వచ్చారు. తిరుగు ప్రయాణంలో తోపుఖానాలో ఉన్న రామేశ్వర్ ఇంటికి వెళ్లారు. 'మీ ఇద్దరి గొడవల వల్లే మా తండ్రి చనిపోయాడని.. ఇకనైనా తన చెల్లిని చక్కగా చూసుకోవాలని' రామేశ్వర్‌కు బావమరుదులు సర్దిచెప్పారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య మాటలు పెరిగి తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఆగ్రహంతో రెచ్చిపోయిన సంతోషి, ఆమె తమ్ముళ్లు రామకృష్ణ, హరికృష్ణ, కుటుంబ సభ్యులు కలిసి రామేశ్వర్, అతని తల్లి గంగాబాయిలపై కర్రలతో దాడి చేసి ముఖంపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. దీంతో తనను చంపుతున్నారని రామేశ్వర్ పోలీసులకు, 100కు కాల్ చేశారు. బేగంబజార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దాడిలో తీవ్ర గాయాలకు గురైన రామేశ్వర్, గంగాబాయిలను ఆస్పత్రికి తరలించారు. రామేశ్వర్ తలపై 19 కుట్లు పడగా. గంగాబాయి ఎడమ కాలు విరగడంతో సర్జరీ చేసి రాడ్ వేశారని బాధితుడు తెలిపారు. అయితే దాడి జరిగిన ఎనిమిది రోజులవుతున్నా వారిని పోలీసులు ఇంకా అరెస్ట్ చేయలేదని బాధితుడు వాపోయాడు.

మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నాం..

బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. భర్తపై ఉన్న ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఈదాడి భార్య చేయించినట్లు సోషల్ మీడియా, యూట్యూబ్‌లో వైరల్ అయిందని తెలిపారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. భార్యాభర్తల మధ్య జరిగిన మనస్పర్థలతోనే ఈ గొడవ జరిగిందని, కేసును మరింత లోతుగా విచారణ చేపట్టి అవసరమైతే నిందితులపైన 304 సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నాటుసారా నిర్మూలన లక్ష్యంగా పని చేయాలి

● కమిషనర్ ఇ. శ్రీధర్ అదేశాలు
● దాడులతోనే పురోగతి : డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి


మాట్లాడుతున్న ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి


సమావేశానికి హాజరైన అధికారులు

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, ఎక్సైజ్ శాఖ లక్ష్యాలను చేరుకోవాలంటే అధికారులతో పాటు సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని ఎక్సైజ్ కమిషనర్ ఇ. శ్రీధర్ పేర్కొన్నారు. తెలంగాణ ఆబ్కారీ భవన్‌లో శుక్రవారం తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సమీక్షాసమావేశం జరిగింది. రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించిన నాటుసారా తయారీ మళ్లీ 26 ఎక్సైజ్ శాఖ స్టేషన్ల పరిధిలో జరుగుతున్నట్లు బయట పడిందన్నారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు కలిసికట్టుగా పనిచేసి మూడు నెలల్లో నాటుసారాను తుదముట్టించాలని అధికారులను ఆదేశించారు.

నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై నిఘా పెంచాలి..

ఎన్నికల సందర్భంగా చాలాప్రాంతాల్లో నాటుసారాతో పాటు.. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ వస్తున్నట్లుగా బహిర్గతమయ్యిందని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ అన్నారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను తెలంగాణలోకి రాకుండా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేకమైన నిఘా పెట్టి దాడులు నిర్వహించాలన్నారు. ఈ మధ్యకాలంలో పార్టీల్లో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను వినియోగిస్తున్నారనే ప్రచారం జరుగుతుందన్నారు. పార్టీలు జరిగే ప్రదేశాల్లో ఎక్సైజ్‌శాఖ నిఘా పెట్టాలని కమిషర్ సూచించారు. మద్యం దుకాణాల్లో బీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అదేశించారు. నాటుసారా తయారీకి వినియోగించే ముడి సరుకుల రవాణాపై ప్రత్యేక నిఘా పెంచి, దాడులు నిర్వహించాలని, నాటుసారా తయారీని తుదముట్టించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అన్నారు. నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం రవాణా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కల్తీ కల్లు తయారీకి వినియోగించే సీహెచ్, ఆల్ప్రాజోలం, డైజోఫాం లాంటి పదార్థాలను దాడులు నిర్వహించి పట్టుకోవాలని సూచించారు. గంజాయి, నార్కోటిక్, ఇతర మత్తు మందుల తయారీ, దిగుమతి, అమ్మకాలపై నిఘా పెట్టి పట్టుకోవాలని ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ జిల్లాల ఏసీలు, డీసీలు, డీపీఈఓలు హాజరయ్యారు.

డ్రగ్స్ వ్యవహారంలో ఐదుగురి అరెస్ట్

● జగద్గిరిగుట్ట పరిధిలో ఇద్దరు విద్యార్థులు
● కూకట్‌పల్లిలో మరో ఇద్దరు
● ఎల్‌బీనగర్ పరిధిలో ఓ యువకుడు

నగరంలో వేర్వేరు చోట్ల ఎస్‌వోటీ, సైబరాబాద్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్ పోలీసులు దాడులు చేసి డ్రగ్స్, మాదక ద్రవ్యాలు తీసుకుంటున్న,విక్రయిస్తున్న, రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి డ్రగ్స్‌తోపాటు బైక్‌లు, సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.



డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడ్డ విద్యార్థులు

జీడిమెట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): అడ్డదారుల్లో డబ్బు సంపాదనకు అలవాటుపడి డ్రగ్ విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 3గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 45గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం, డెహరాడూన్ ప్రాంతానికి చెందిన తిలక్‌సింగ్ (22) జగద్గిరిగుట్ట షిర్డీహిల్స్‌లో నివాసముంటూ కొంపల్లిలోని శివశివానీ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన జూలపల్లి అఖిల్‌శివ (22) చెన్నై విశ్వవిద్యాలయంలో బీబీఏ చదువుతూ తెల్లాపూర్ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నాడు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తులసీనగర్ ప్రాంతంలో డ్రగ్స్‌ను విక్రయించడానికి అనుమానాస్పదంగా తిరుగుతున్న తిలక్‌సింగ్, అఖిల్‌శివలను మాదాపూర్ ఎస్‌ఓటీ, జగద్గిరిగుట్ట పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. విచారించగా విజయవాడ పోరంకి ప్రాంతానికి చెందిన రోహిత్(23)నుంచి డ్రగ్స్ తెచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీరిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రోహిత్ పరారీలో ఉన్నాడు.

హెరాయిన్ రవాణా చేస్తూ యువకుడు..

కొత్తపేట, మే 17(ఆంధ్రజ్యోతి): హెరాయిన్ రవాణా చేస్తున్న యువకుడిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. 33 గ్రాముల హెరాయిన్, బైకు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ లింగారెడ్డి కథనం ప్రకారం రాజస్థాన్‌కు చెందిన దినేష్ కుమార్(20) మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఉంటూ స్టీల్ వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. ఆనంద్‌నగర్‌కు బైక్‌పై వెళుతున్న అతడిని పోలీసులు తనిఖీ చేయగా.. ఓ బ్యాగులో 33గ్రాముల హెరాయిన్ లభ్యమైంది. అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడి సోదరుడు సురేష్‌కుమార్, స్నేహితులు దినేష్‌కళ్యాణ్, మనోహర్‌లాల్, భన్వర్‌లాల్ రాజస్థాన్ నుంచి హెరాయిన్ సరఫరా చేస్తుంటారని తేలింది. రూ. 3లక్షల విలువ చేసే హెరాయిన్, 13 ఖాళీ హాఫ్ ఇంచ్ స్టీల్ పైపులు, డిజిటల్ వెయింగ్ మిషన్, రూ.1800, రెండు సిమ్‌కార్డు లేని పాడైన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు అరెస్టు చేసిన నీలేష్‌రెడ్డి, కట్టా రాజశేఖర్‌రెడ్డి

కూకట్‌పల్లిలో ఇద్దరు..

కూకట్‌పల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో డ్రగ్స్ తీసుకుంటున్న ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 3గ్రాముల డ్రగ్స్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లో నివాసముంటూ ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేస్తున్న నీలేష్‌రెడ్డి(26), జూబ్లీహిల్స్‌కు చెందిన అతని స్నేహితుడు కట్టా రాజశేఖర్‌రెడ్డి(29)లు కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటున్నారు. వీరికి బెంగళూరుకు చెందిన ప్రేమ్‌సాయి తరచూ డ్రగ్స్ సరఫరా చేస్తుంటాడు. ఈక్రమంలోనే శుక్రవారం ఉదయం శేషాద్రినగర్‌లోని నీలేష్‌రెడ్డి ఇంటి వద్ద డ్రగ్స్ తీసుకొంటున్నట్లు సమాచారం అందుకొన్న బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకొని కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి 3గ్రాముల డ్రగ్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీళ్లకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ప్రేమ్‌సాయిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

'శశిరేఖ' పరమాన్నం

శర్కర శుభ్ర భక్తేన శృతదుగ్ధయుక్తేనచ!
పరిపూతా శిఖరిణీ శశిరేఖేన కీర్తితా!

'శశి' అనేది తెల్లదనానికి, స్వచ్ఛతకు ప్రతీక. తెల్లగా ఉంటుంది కాబట్టి కుందేలును 'శశము, శశకము' అంటారు. 'శశాంకం' అంటే పచ్చకర్పూరం. 'శశాంకుడు' అంటే తెల్లని చల్లని చంద్రుడు. ఈ చంద్రుడు రేఖామాత్రంగా కనిపించినప్పుడు నెలవంక అని, శశిరేఖ అనీ పిలుస్తారు. 'శశిరేఖ' అనే పేరున్నవాళ్ల ఇతరుల సంక్షేమం కోసం పాటుపడతారని, ఇతరులను సంతోషపడేలా చేస్తారని జ్యోతిషశాస్త్రం చెబుతోంది. తెల్లని స్వచ్ఛమైన శశిరేఖ అనే పరమాన్నానికి కూడా ఈ గుణాలున్నాయి. అన్నం పరవాణ్ణం లేదా పరమాన్నం అని ప్రేమగానూ, భక్తితోనూ పిలుచుకొనే సంప్రదాయిక ఆహార పదార్థాన్ని 'శశిరేఖ' అని క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో పేర్కొన్నాడు.

పరమాన్నం వండాలంటే పాలను పొంగేదాకా కాచాలి. పాల పొంగు సమృద్ధికి సూచన. 'సిరులు పొంగు జీవగడ్డ మనది' అని ఘనంగా చెప్పుకొంటాం. వ్యవసాయిక దేశమైన భారతీయులకు పాడిపంటలే సంపద. పాలు, బియ్యాన్ని కలిపి పొంగించటం అనేది సిరులు పొంగాలనే కోరికకు ఒక సూచన.

పరమాన్నంలో కలిసే పాలు, బియ్యం, పంచదార... మూడూ తెల్లనివే. అందులో కలిపే పచ్చకర్పూరం, జీడిపప్పు కూడా తెల్లనివే. తెల్లదనం, చల్లదనం... 'శశిరేఖ' అనే ఈ పరమాన్నానికి పరమ లక్షాలు.

శశిరేఖా హిమా బల్యా రుచ్యా పుష్టిప్రదాయనీ!
వాతపిత్తహరా శ్రేష్ఠా మహాదాహ వినాశినీ!

'శశిరేఖ' అనే ఈ పరమాన్నం శరీరానికి అమితమైన చలవనిస్తుంది. జీవనక్రియల కారణంగా శరీరం అనే ఈ యంత్రం నిర్విరామంగా పని చేస్తున్నప్పుడు శరీరంలో మనకు తెలియకుండానే అమితమైన ఉష్ణోగ్రత పుడుతుంది. కూలెంట్



ద్రవ్యాలతో ఇంజన్లో వేడిని చల్లార్చినట్టే పరమాన్నంతో ఈ శరీరానికి చల్లదనాన్ని కలిగించాలి. వేడి ఎక్కువైనప్పుడు అవి ంతంగా చెమటను పుట్టించి, ఆ వేడిని చల్లార్చటానికి శరీరం ప్రయత్నిస్తుంది. కొందరికి వేడి శరీర తత్త్వం ఉంటుంది. వారికి చెమటలు అందుకే మితిమీరి పడతాయి. 'శశిరేఖ పరమాన్నం' తక్షణం చలవనిస్తుంది. అమిత ఉష్ణంవల్ల రక్త, శుక్ర కణాలు, ఇతర జీవకణాలు త్వరగా నశించిపోతుంటాయి. అలాంటివారికి తరచూ ఈ 'శశిరేఖ'ను అందిస్తుంటే రక్త పుష్టి, శుక్ర పుష్టి లభిస్తాయి.

'శశిరేఖ'వల్ల అమితమైన బలం కలుగుతుంది. ధాతువులన్నీ సక్రమంగా వృద్ధిచెంది దేహదారుఢ్యం కలుగుతుంది. చాలా మధురంగా ఉండి నోటికి రుచిని పెంచుతుంది. పుష్టినిస్తుంది. అంటే చిక్కి శల్యమైపోయేవారికి శరీరం వృద్ధి చెందేలా చేస్తుంది. క్షీణింపచేసే వ్యాధుల్లో కూడా ఇది ఔషధంలా పని చేస్తుంది.

వాత వ్యాధులతో బాధపడేవారికి ఇది మంచిది. కీళ్లవాతం, పక్షవాతం, సయాటికా, నడుము నొప్పిలాంటి వ్యాధుల్లో ఇది ఔషధంగా పని చేస్తుంది. ఎసిడిటీనీ తగ్గిస్తుంది. కడుపులో మంట, పేగుపూత వ్యాధులతో బాధపడేవారికి బాగా మేలు చేస్తుంది. 'మహాదాహ వినాశిని' అనే ఇంకో గుణం కూడా దీనికుంది. అరికాళ్లు, అరిచేతులతోపాటు ఒళ్లంతా కారం

> **పరమాన్నానికి 'శశిరేఖ' అనే పేరు మనకు కొత్తది. శుభకార్యాలకు ఆరంభ సూచన పరమాన్నం. పాడ్యమి నాడు రేఖామాత్రంగా కనిపించే 'శశిరేఖ' భవిష్యత్తుకు ఆశను. నమ్మకాన్నీ కలిగిస్తుంది. గృహప్రవేశాలకు, వివాహాది శుభకార్యాలలో వండుకునే అన్నం పరమాన్నాన్ని వెలుగుకు ఆరంభ సూచకమైన 'శశిరేఖ'తో పోల్చి ఆ పేరు పెట్టడం సముచితం. నెలవంక అన్ని మతాలకూ ఆరంభ సూచకమే!**

పోసినట్టుగా మండటాన్ని 'మహాదాహం' అంటారు. ఈ మంట కూడా ఒక విధంగా నొప్పిలాంటిదే. నరాల్లో కలిగే మార్పులవల్ల నొప్పి ఎలా పుడుతుందో మంట కూడా అలానే కలుగుతోంది. నరాలు దెబ్బతినడమే దీనికి కారణం. 'శశిరేఖ' పరమాన్నాన్ని తరచూ తీసుకొంటే ఈ దాహం లేదా మంట ఉపశమిస్తుంది. 'దాహం' అనే పదం దహనానికి సంబంధించింది. దప్పికను మనం దాహం అంటాం. దప్పిక కూడా దీనివల్ల తగ్గుతుంది.

ఆహార పదార్థాల్లో ఉత్తమమైనది కాబట్టి దీన్ని క్షేమశర్మ 'శ్రేష్ఠా' అన్నాడు. మనం పరమాన్నం అనడంలో ఉద్దేశం కూడా ఇదే. 'పరమోన్నతమైన అన్నం' అని.

పరమాన్నం స్థూలకాయం ఉన్నవారికి, షుగరు రోగులకు తప్ప అందరికీ మేలు చేసేదే. పంచదార లేదా బెల్లం రెండూ సమానంగానే షుగరు, స్థూలకాయం పెంచుతాయి. తీపి కలిపి తీరాల్సిన అవసరం ఏమీ లేదు. తీపి లేకుండా పాలలో బియ్యం పోసి ఉడికించిన అన్నానికీ పైన చెప్పిన గుణాలున్నాయి. బీపీ తగ్గించి, మనసుకు స్వాంతననిస్తుంది. ఉద్రేకాలను తగ్గించి శాంతపరుస్తుంది. దేవుడికి ఇంత నైవేద్యం పెట్టుకుని ఇంటిల్లిపాదీ తలా కాస్త 'శశిరేఖ' ప్రసాదాన్ని రోజూ తినటం మంచిది.

• గంగరాజు అరుణాదేవి

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DMoCffl లో చదవండి.

వేసవి సెలవుల్లో పిల్లలు రకరకాల వంటలు తినాలని కోరుకుంటూ ఉంటారు.
అంతే కాకుండా ఇంటికి అనేక మంది బంధు మిత్రులు వచ్చి పోతూ ఉంటారు.
వీరందరి కోసం కొన్ని వంటలు...

వేసవి వంటలు

శనగపిండి దోశ

కావాల్సిన పదార్థాలు: శనగపిండి (ఒక కప్పు), బొంబాయి రవ్వ (పావు కప్పు), ఉప్పు (తగినంత), ఎర్రకారం (తగినంత), పచ్చి మిరపకాయలు (నాలుగు), కొత్తిమీర (తగినంత), నీళ్లు (ఒక గ్లాసు)

తయారీ విధానం:
శనగపిండి, బొంబాయి రవ్వ, ఉప్పు, పచ్చి మిర్చి, ఎర్రకారం, కొత్తిమీరలలో ఒక గ్లాసు నీళ్లను కలపాలి. రవ్వదోశకు కలిపినట్లుగా పిండిని మృదువుగా ఎక్కడా ముద్దలు లేకుండా కలపాలి. అట్లు వేసే పెనం మీద ఈ మిశ్రమంతో దోశలు వేయాలి.

జాగ్రత్తలు:
- కొందరు ఉల్లిపాయలు... దోశ కాలుతున్న సమయంలో పైన జల్లుతారు. ఈ ముక్కలు మాడిపోకుండా చూసుకోవాలి.
- మిశ్రమం బాగా జారుగా ఉండకూడదు. అలాగని గట్టిగా కూడా ఉండకూడదు. దోశలు వేయటానికి తగినట్లుగా ఉండాలి.



కొబ్బరి వడలు

కావాల్సిన పదార్థాలు: బియ్యం (పావు కేజీ), తురిమిన కొబ్బరి (ఒక గ్లాసు), పచ్చి మిరపకాయలు (నాలుగు), ఉల్లిపాయలు (రెండు), నూనె (పావు లీటరు), కొత్తిమీర (తగినంత), ఉప్పు (తగినంత)

తయారీ విధానం: బియ్యాన్ని 12 గంటల పాటు నానబెట్టుకోవాలి. ఇలా బాగా నానిన బియ్యాన్ని మృదువుగా రుబ్బుకోవాలి. దీనిలో కొబ్బరి తురుము, పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లిపాయల ముక్కలు, కొత్తిమీర, ఉప్పు వేసి బాగా కలపాలి. ఒక మూకుడులో నూనెను బాగా కాచాలి. పిండిని వడల మాదిరిగా చేసి నూనెలో బంగారు రంగు వచ్చేదాకా వేయించాలి.

జాగ్రత్తలు:
- పిండిని బాగా మృదువుగా.. గట్టిగా రుబ్బాలి. లేకపోతే వడలు సరిగ్గా రావు.
- ఈ వడలను ఎక్కువ మంటపై వేయించుకూడదు. ఎక్కువ మంటపై వేయిస్తే కొబ్బరి మాడిపోతుంది.

సొజ్జప్పాలు

కావాల్సిన పదార్థాలు: బొంబాయి రవ్వ (ఒక గ్లాసు), పంచదార (ఒక గ్లాసు), ఏలకులు (రుచికి తగినట్లుగా), మైదా (అర కప్పు), నూనె (పావు లీటర్), నీళ్లు (ఒకటిన్నర కప్పులు), నెయ్యి (మూడు స్పూన్లు).

తయారీ విధానం: బొంబాయి రవ్వను మూకుడులో వేసి దోరగా వేయించాలి. దీనిని ఒక ప్లేటులో తీసుకొని చల్లార్చాలి.

ఆ తర్వాత దానిలో పంచదార, ఏలకుల పొడి, నెయ్యి కలపాలి. ఈ లోపు మూకుడులో నీటిని పోసి ఉడకనివ్వాలి. ఆ ఉడికే నీటిలో రవ్వ మిశ్రమాన్ని వేసి-ఉండలు కట్టకుండా తిప్పాలి. ఒక మాదిరిగా గట్టిపడిన తర్వాత దానిని తీసి ఒక ప్లేటులో పెట్టి చల్లార్చాలి. ఆ తర్వాత మైదాపిండిలో కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉండలుగా చేసి పూరీలు మాదిరిగా ఒత్తాలి. దానిలో చల్లారిన రవ్వ మిశ్రమాన్ని పెట్టి మళ్లీ ఒత్తాలి. ఈ లోపులో మూకుడులో నూనె వేసి కాగనివ్వాలి. కాగే నూనెలో ఒత్తిన వాటిని వేసి లేత బంగారు రంగు వచ్చేదాకా వేయించాలి.

జాగ్రత్తలు
- సొజ్జప్పాలలో పెట్టే రవ్వ మిశ్రమం పలచగా ఉండకూడదు. అలాగని చాలా గట్టిగా కూడా ఉండకూడదు.
- మైదా ఉండలను బలంగా వత్తకూడదు. సున్నితంగా ఒత్తాలి.
- కొందరు రవ్వ మిశ్రమంలో కొబ్బరి కూడా వేస్తారు. దీనివల్ల అదనపు రుచి వస్తుంది.



పెరుగు పెసర పునుగులు

కావాల్సిన పదార్థాలు: పెసర పప్పు (పావు కిలో), పచ్చి మిరపకాయలు (మూడు), ఎండు మిరపకాయలు (మూడు), ఉప్పు (తగినంత), పెరుగు (అరకిలో), పసుపు (తగినంత), నూనె (పావుకిలో), కొత్తిమీర ముద్ద (తగినంత), పోపు సామాన్లు (శనగపప్పు, మెంతులు, ఎండు మి ిరపకాయలు, ఇంగువ)

తయారీ విధానం: పెసరపప్పును నాలుగు గంటలు నానబెట్టాలి. నానబెట్టిన పెసరపప్పు, పచ్చిమిరపకాయలు, ఎండు మిరపకాయలు, ఉప్పును మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. వేరే గిన్నెలో పెరుగు తీసుకొని, దానిలో కొద్దిగా ఉప్పు, పసుపు, కొత్తిమీర ముద్దలను వేసి కలపాలి. దీనిలో శనగపప్పు, మెంతులు, ఎండుమిరపకాయలు, ఇంగువ వేసి తాలింపు పెట్టాలి. ఒక మూకుడును తీసుకొని దానిలో పెసరపప్పు మిశ్రమాన్ని ఉండలుగా చేసి బాగా వేయించాలి. వాటిని బయటకు తీసి ఒకసారి నీళ్లలో ముంచాలి. ఆ తర్వాత పెరుగులో వేయాలి.

జాగ్రత్తలు:
- ఈ వంటకు పెసరగుళ్ల కన్నా పెసరపప్పు మంచిది.
- పెసరపప్పును బాగా ముద్దగా రుబ్బాలి. లేకపోతే పెరుగులో వేసినప్పుడు ఉండలు విడిపోతాయి.





పి.లక్ష్మీ, బిలాస్‌పూర్
9584630621

ఆదర్శం



ప్రాణ దాత

కొన ఊపిరితో కొట్టుకొంటున్న చిన్నారికి అత్యవసర చికిత్స అందించి... ప్రాణ వాయువు అయ్యారు డాక్టర్ రవళి నన్నపునేని. ఒక వైద్యురాలిగానే కాకుండా... మానవత్వంతో ముందుకువచ్చి... జన హృదయాలు గెలిచారు. 'ఒక ప్రాణాన్ని నిలపడం కంటే సంతృప్తి, సంతోషం ఏముంటుంది' అంటున్న రవళిని 'నవ్య' పలుకరించింది.

"నేను పుట్టి పెరిగింది విజయవాడలో. మా కుటుంబంలో నేను మాత్రమే డాక్టర్‌నయ్యా. నన్ను డాక్టర్‌గా చూడాలని అమ్మ వెంకట సుజని ఎన్నో కలలు కన్నారు. నాన్న లక్ష్మీనరసింహారావు కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉద్యోగం చేసేవారు. నా విద్యాభ్యాసమంతా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సాగింది. పాఠశాల విద్య నుంచి ఎంబీబీఎస్ వరకు విజయవాడలోనే చదివాను. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, గుంటూరు మెడికల్ కాలేజీలో పీజీ చేశాను. ప్రస్తుతం విజయవాడలోని 'మెడ్‌సీ' ఆసుపత్రిలో జూనియర్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నా. నా భర్త వెంకట ప్రసన్నకుమార్ డెంటిస్ట్.

విద్యార్థి దశలోనే అవగాహన...

ఒకప్పుడు గుండె నొప్పి ఎక్కువగా 50 ఏళ్లు పైబడిన వారికి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. 30-35 ఏళ్ల వయసువారికి కూడా గుండె నొప్పి వస్తోంది. అందరికీ అన్ని వేళలా ఆసుపత్రులు అందుబాటులో ఉండవు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉన్నా, గుండె నొప్పి వచ్చినా సీపీఆర్ చేయడంవల్ల బతికే అవకాశం ఉంటుంది. దీనిపై ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకే బాలుడికి సీపీఆర్ చేస్తున్న వీడియోను ఇన్‌స్టాలో పోస్టు చేశాను.

కారులో వెళుతుంటే...

మా నానమ్మ దుర్గాప్రసన్నాంబ విజయవాడ అయ్యప్పనగర్‌లో ఉంటారు. పని మీద కోదాడ వెళ్లి వచ్చిన నానమ్మను అయ్యప్పనగర్‌లోని వాళ్లింటి దగ్గర వదిలిపెట్టాం. అక్కడి నుంచి మధురానగర్‌లో ఉన్న మా ఇంటికి కారులో బయలుదేరాం. నానమ్మ ఉంటున్న వీధి నుంచి మరో వీధిలోకి వచ్చేసరికి అంతా హడావుడిగా ఉంది. ఒక బాలుడిని భుజాన వేసుకుని తండ్రి కన్నీళ్లు పెట్టుకుంటూ పరుగెత్తుతున్నాడు. ఆయన చుట్టూ జనం. ఇదంతా చూసి అమ్మ, నేను కారు దిగాం. ఏమైందని అడిగితే కరెంట్ షాక్ కొట్టిందని బాలుడి తండ్రి చెప్పాడు. ఆ పిల్లాడి పేరు సాయి. ఆరేళ్ల వయస్సు. ఆ రోజునే అతని తండ్రి ఇడ్లీ, దోశల పిండి రుబ్బి అమ్మే కొత్త షాపు ఒకటి ప్రారంభించాడు. సాయంత్రం పిండి రుబ్బేసిన గ్రైండర్లను వాళ్లు శుభ్రం చేసుకుంటున్నారు. తల్లితండ్రులకు సాయి సాయం చేస్తున్నాడు. ఒక గ్రైండర్ వైరును పట్టుకోవడంతో అతడికి షాక్ తగిలింది. అంతే... షాపులో నుంచి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. అదృష్టమేమిటంటే అతడు పడింది ఇసుకు గుట్టపై. అదే రోడ్డు మీద అయితే తలకు బలమైన గాయం అయ్యేది.

రోడ్డు మీద పడుకోబెట్టి...

సాయి పల్స్ చూశాను. గుండె చాలా నెమ్మదిగా కొట్టుకుంటోంది. శ్వాస తీసుకోవడంలేదు. బాలుడికి అత్యవసరంగా సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) ఇవ్వాలని గుర్తించాను. అక్కడే రోడ్డు మీద పడుకోబెట్టి సీపీఆర్ చేశాను. నేను చెస్ట్ కంప్రెషన్ చేస్తే, అక్కడ ఉన్న మరో వ్యక్తి నోటి ద్వారా ఊపిరి ఊదారు. సుమమారు ఐదు నుంచి ఏడు నిమిషాలపాటు ఇలా చేశాను. తర్వాత చిన్నారిలో కదలిక కనిపించింది. కళ్లు అటూ ఇటూ తిప్పుతున్నాడు. అయినా సీపీఆర్ కొనసాగించాను. తర్వాత మా అమ్మ అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అది రావడానికి ఆలస్యమవ్వడంతో బైక్‌పై ఆసుపత్రికి తీసుకెళ్లమని చెప్పాను. ఇలాంటి ఘటనల్లో మెదడుకు అందే రక్తప్రసరణ ఆగిపోతుంది. సీపీఆర్ ద్వారా రక్తప్రసరణ జరిగేలా చేయవచ్చు. బాలుడిని తలకిందులుగా పెట్టి ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించాను. ఆ విధంగానే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు సీటీ స్కాన్



చేశారు. అదృష్టం ఏమిటంటే... ఎలాంటి ఇంటర్నల్ ఇంజ్యూరీస్ లేవు. ఒక రోజు మాత్రమే సాయి ఆసుపత్రిలో ఉన్నాడు. ఆ తర్వాత డిశ్చార్జి చేశారు.

ఎంతో సంతృప్తినిచ్చింది...

చిన్నారి ప్రాణాలతో తిరిగి రావడంతో అతని తండ్రి వెంటనే నాకు ఫోన్ చేశారు. 'మా అబ్బాయి ప్రాణాలు కాపాడావమ్మా' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. వైద్యురాలిగానే కాకుండా, ఒక మనిషిగా నేను స్పందించాను. అదే ఆ బాలుడి ప్రాణాలు కాపాడింది. వ్యక్తిగతంగా ఇది నాకు ఎంతో ఆనందం కలిగించింది. వృత్తిపరంగా ఎంతో సంతృప్తిని ఇచ్చింది. నేను చేసింది వృత్తి ధర్మమే కావచ్చు. కానీ, ఒక కుటుంబంలో ఆనందాన్ని నింపానన్న భావన వెల కట్టలేనిది. నేను ఈ వృత్తిలో లెక్కలేనన్నిసార్లు సీపీఆర్ చేశాను. గైనకాలజిస్టును కావడంతో ఇది కాస్త ఎక్కువగా ఉంటుంది. గర్భవతులకు కాన్పు సమయంలో కొన్ని కాంప్లికేషన్స్ ఉంటాయి. హార్ట్‌బీట్ తక్కువగా ఉంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతుంది. నేను పీజీ, ఎంబీబీఎస్ చేసినప్పుడు ఎక్కువగా సీపీఆర్ చేసేదాన్ని. అదే సూత్రాన్ని బాలుడి విషయంలోనూ అప్లై చేశాను.

• గుడాల శ్రీనివాస, విజయవాడ

మేకప్


మేకప్ మంత్రముగ్ధంగా...

మేకప్ వేసుకునే ప్రతి ఒక్కరూ అందుకోసం ఉపయోగించే సాధనాలు, ఉత్పత్తులు, సీజన్‌ల గురించి కూడా తెలుసుకోవాలి. అప్పుడే చర్మానికి నప్పేలా మేకప్ వేసుకోగలుగుతారు.

- **టోనర్:** చర్మం నునుపుగా, బిగుతుగా మేకప్‌కు అనువుగా మారడం కోసం టోనర్ వాడడం తప్పనిసరి. అలాగే మొటిమలు, మచ్చలు ఉన్న చోట టోనర్‌ను అప్లై చేసుకుని, వాటిని కనిపించకుండా దాచేయవచ్చు.
- **మాయిశ్చరైజర్:** మేకప్ సమంగా పరుచుకోవడం కోసం మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ వాడడం వల్ల చర్మం మీద మేకప్ పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. చర్మం పొడిబారిపోకుండా ఉంటుంది.
- **ప్రైమర్:** చర్మానికీ, మేకప్‌కూ మధ్య ప్రైమర్ అడ్డుగా ఉండి, చర్మం మీది రంధ్రాలు కనిపించకుండా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు పూడుకుపోకుండా ఉంటాయి.
- **ఫౌండేషన్:** స్కిన్ టోన్‌ను సమం చేసి, మేకప్‌కు బేస్‌గా మారుతుంది. కాబట్టి, ఫౌండేషన్‌ను ముఖం మీద సమంగా పరుచుకోవాలి.
- **కన్‌సీలర్:** చర్మపు రంగుకు ఒకటి లేదా రెండు టోన్ల తేలిక రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. దీంతో మచ్చలను దాచేసి, ముఖంలో కనురెప్పలు, ముక్కు, చుబుకం, చెక్కిళ్లను హైలైట్ చేసుకోవచ్చు.
- **కాంటూర్:** దీంతో ముఖానికి ఆకారాన్ని తీసుకురావచ్చు. ముక్కు, చుబుకం, చెక్కిళ్లను ఆకర్షణీయంగా మలుచుకోవచ్చు.
- **బ్లష్:** చెక్కిళ్లను హైలైట్ చేయడం కోసం దీన్ని వాడుకోవాలి.

ఎండల్లో ఇలా...

- **మాయిశ్చరైజర్:** పగటివేళ ఆయిల్ ఫ్రీ మాయిశ్చరైజర్ మాత్రమే ఉపయోగించాలి. ముఖం జిడ్డుగా మారకుండా ఉండడానికి ఇది తోడ్పడుతుంది.
- **సన్ ప్రొటెక్షన్:** మేకప్‌తో పని లేకుండా వేసవి కాలమంతా 30 కంటే ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ అప్లై చేసిన తర్వాత సన్‌స్క్రీన్, ఆ తర్వాత ఫౌండేషన్ సరైన ఛాయిస్.
- **ప్రైమర్:** మేకప్ వన్నె తగ్గకుండా ఉండాలంటే ప్రైమర్ కూడా తప్పనిసరిగా వాడాలి. ముడతలను కనపడనివ్వకుండా చేసే ప్రైమర్‌తో యంగర్ లుక్ వస్తుంది.
- **తక్కువ మేకప్:** ముఖం మీద మేకప్ ముద్దలు కట్టకుండా, గీతలు పడకుండా ఉండాలంటే, వేసవి కాలంలో వీలైనంత తక్కువ మేకప్ వేసుకోవాలి. తప్పనిసరి అయితే టింటెడ్ మాయిశ్చరైజర్, కన్‌సీలర్లను ఉపయోగించుకోవచ్చు.
- **బ్రాంజర్:** కళ్లు ఆకర్షణీయంగా కనిపించాలంటే బ్రాంజర్ వాడుకోవాలి. తాజాగా, సహజసిద్ధ సౌందర్యంతో మెరిసిపోవాలంటే ఎండ సోకే వీలున్న నుదురు, చీక్ బోన్స్, చుబుకం, ముక్కు మీద బ్రాంజర్ అప్లై చేయాలి. వేసవిలో పౌడర్ రూపంలోని బ్రాంజర్లనే ఎంచుకోవాలి.
- **షిమ్మర్ వద్దు:** అవసరానికి మించిన మెరుపులు వేసవిలో ఎబ్బెట్టుగా ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో షిమ్మర్‌ను వాడకపోవడమే మంచిది.
- **బ్లష్:** ఈ కాలంలో పౌడర్ బ్లష్‌లకు బదులుగా జెల్ బ్లష్ వాడుకోవాలి.
- **లిప్‌స్టిక్:** ముదురు రంగు లిప్‌స్టిక్‌లకు బదులుగా హాయిగొలిపే లేత గులాబీ, లేత నారింజ రంగులను ఎంచుకోవాలి.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 18 మే 2024
cinema@andhrajyothy.com

అక్కినేని 'మనం'.. మరోసారి!



లెజండరీ యాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నటించిన చివరి చిత్రం 'మనం'. ఈ చిత్ర నిర్మాణ సమయంలోనే అక్కినేని కన్నుమూశారు. తెలుగులో అంతవరకూ రాని వైవిధ్యమైన కథతో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని విక్రమ్ కుమార్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించింది. నాగార్జున, నాగచైతన్య, అఖిల్ కూడా ఇందులో నటించడంతో 'అక్కినేని ఫ్యామిలీ చిత్రం'గా పేరొందింది. తనయుడు నాగార్జున, మనవళ్లు నాగచైతన్య, అఖిల్‌తో కలసి నటించాలనే ఏయన్నార్ కోరికను ఈ సినిమాతో నెరవేర్చారు నాగార్జున. సమంత, శ్రియ హీరోయిన్లుగా నటించారు. ఎన్నికల హడావిడి తగ్గిన తర్వాత 2013 మే 23న 'మనం' చిత్రాన్ని విడుదల చేశారు. పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ క్లాసిక్ ఎంటర్‌టైనర్‌ను రీ రిలీజ్ చేయాలని అక్కినేని ఫ్యామిలీ నిర్ణయించింది. ఈ నెల 23న రెండు తెలుగు రాష్ట్రాల్లో 'మనం' చిత్రాన్ని ప్రదర్శిస్తారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ 'మనం.. తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన చిత్రం. థియేటర్లలో మరోసారి సెలబ్రేట్ చేసుకుందాం' అని అన్నపూర్ణ స్టూడియో సంస్థ ట్వీట్ చేసింది. 'నా మనసులో చాలా ప్రత్యేకమైన స్థానం కలిగిన చిత్రం 'మనం'. పదేళ్ల వేడుకలను జరుపుకోవడానికి తిరిగి థియేటర్లలోకి తీసుకువస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని నాగచైతన్య ట్వీట్ చేశారు. పదేళ్ల క్రితం ఎన్నికల సందడి తగ్గిన తర్వాత 'మనం' చిత్రాన్ని విడుదల చేశారు. ఇప్పుడు కూడా ఎలక్షన్ హడావిడి తగ్గిన తర్వాతే రీ రిలీజ్ అవుతుండడం గమనార్హం.



ప్రభాస్ చెప్పిన ప్రత్యేక వ్యక్తి ఎవరు?

తన సినిమా ప్రచార కార్యక్రమాలపైన సైతం ఆచితూచి స్పందిస్తారు ప్రభాస్. అలాంటిది శుక్రవారం ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒక్కసారిగా నెటిజన్లలో చర్చనీయాంశం అయింది. 'డార్లింగ్స్ ఎట్టకేలకు మన జీవితాల్లోకి ఒక ప్రత్యేక వ్యక్తి రాబోతున్నారు, వేచి చూడండి' అంటూ ఆయన ఇన్‌స్టాలో పెట్టిన పోస్ట్ క్షణాల్లో వైరల్ అవ్వడంతో పాటు పలు రకాల ఊహాగానాలకు తెరలేపింది. మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్‌గా ఉన్న ప్రభాస్ ఓ ఇంటివాడవబోతున్నారు అని, తన కాబోయే జోడీని పరిచయం చేయబోతున్నారనీ కొందరు నెటిజన్లు స్పందిస్తున్నారు. అయితే త్వరలో 'కల్కి 2898 ఏడీ' చిత్రం విడుదల ఉండడంతో ఆ సినిమా అప్డేట్ గురించి ప్రభాస్ ఇలా స్పందించారంటూ మరికొందరు భావిస్తున్నారు. 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొనేకు సంబంధించిన ప్రచార చిత్రాలను విడుదల చేయబోతున్నారనీ, దానికోసమే ప్రభాస్ ఈ పోస్ట్ పెట్టాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

డ్రాగన్‌గా ఎన్టీఆర్

ప్రస్తుతం 'దేవర' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. దీని తర్వాత ఆయన ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రాన్ని ప్రకటించారు. 'ఎన్టీఆర్ 31' అనేది వర్కింగ్ టైటిల్. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ నెల 19న ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా నుంచి అధికారిక అప్డేట్ రానుందని సమాచారం. ఈ సినిమాకు ప్రశాంత్ నీల్ ఓ పవరఫుల్ టైటిల్‌ను ఖాయం చేశారనే వార్త నెట్టింట్లో వైరల్ అవుతుంది. ఎన్టీఆర్ పాత్ర ఈ సినిమలో పవర్ ఫుల్‌గా ఉండబోతోంది, దానికి తగ్గట్లు 'డ్రాగన్' అనే పేరును ప్రశాంత్ నీల్ అనుకున్నారట. టైటిల్‌తో పాటు ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసే అవకాశముందని సమాచారం. ప్రస్తుతం ఎన్టీఆర్ బాలీవుడ్‌లో 'వార్ 2'చిత్రం చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ 'సలార్ 2' కోసం సిద్ధమవుతున్నారు.





ఎంటర్‌టైన్ చేసే లారీ



శ్రీకాంత్‌రెడ్డి ఆసం హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లారీ చాప్టర్ - 1'. చంద్రశిఖ కథానాయిక. రాకీ సింగ్ కీలకపాత్ర పోషించారు. ఆసం వెంకట లక్ష్మి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యూనిట్ గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 'డైరెక్షన్ కోర్స్ చేశాక యూట్యూబ్‌లో వీడియోలు చేశాను. తర్వాత పలు చిత్రాలకు వివిధ విభాగాల్లో సహాయకుడిగా పని చేసి అనుభవం గడించాను. ఇప్పుడు 'లారి చాప్టర్-1' అనే సినిమాతో హీరోగా వస్తున్నాను. ఇదొక సరికొత్త యాక్షన్ ఎంటర్టైనర్. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల చేస్తున్నాం. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: తాడిపత్రి నాగార్జున

కొత్త తరహా కంటెంట్‌తో...



శాంతి చంద్ర హీరోగా, మాజీ మిస్ ఇండియా స్మిృతి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డర్టీఫెలో'. దీపిక సింగ్, సత్యప్రకాశ్, నాగినీడు కీలకపాత్రలు పోషిస్తున్నారు. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి.ఎస్ బాబు నిర్మించారు. ఈ నెల 24న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వశిష్ఠ మాట్లాడుతూ 'కొత్త తరహా కంటెంట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. దర్శకుడి శైలి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతుంది' అని అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'డర్టీఫెలో ఆడియోకు చక్కటి స్పందన వచ్చింది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'తన ఆశయం కోసం హీరో ఎలాంటి కష్టాలు పడ్డాడు అనేది మనసుకు హత్తుకుంటుంది. ఈ తరం ప్రేక్షకులకు సందేశం ఇచ్చే చిత్రమిది' అన్నారు.

కన్నప్ప కోసం కాజల్

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' లో నటించే స్టార్స్ సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. మొన్న బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్, నిన్న ప్రభాస్, తాజాగా ఇప్పుడు కాజల్. ఇలా రోజుకో స్టార్ ఎంట్రీతో, అప్డేట్స్‌తో 'కన్నప్ప' చిత్రం నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో కాజల్ నటిస్తున్నట్లు ప్రకటించారు. ఇంతకుముందు 'మోసగాళ్లు' చిత్రంలో విష్ణు, కాజల్ నటించిన సంగతి విదితమే. ఇప్పుడు మరోసారి విష్ణు సినిమాలో కాజల్ నటిస్తున్నారు. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. న్యూజిలాండ్‌లో 'కన్నప్ప' చిత్రానికి సంబంధించిన రెండు మేజర్ షెడ్యూల్స్ జరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. ఈ నెల 20న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్ విడుదల

విజయ్ సేతుపతి 'ఏసీఈ'

విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రానికి 'ఏసీఈ' అనే డిఫరెంట్ టైటిల్ నిర్ణయించారు. ఆరుముగ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న సినిమా ఇది. విజయ్



సేతుపతి ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్ టీజర్ కూడా విడుదల చేశారు. జూదం, తుపాకులు, పేలుళ్ల, దోపిడీలు, బైక్ ఛేజింగ్ అంశాలతో ఉన్న టీజర్ ఆసక్తి పెంచుతోంది. హిలేరియస్ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉంటుందని టీజర్ చూశాక అర్థమవుతుంది. ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలుగు చలనచిత్ర దర్శకులు అనిల్ రావిపూడి, హరీశ్‌శంకర్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్స్ డే సందర్భంగా ఈనెల 19న నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిని సన్మానించారు.

ఇండియన్ నేటివిటీతో పోకెమాన్

పిల్లలను అమితంగా ఆకర్షించిన యానిమేషన్ సిరీస్‌ల్లో 'పోకెమాన్'కు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు 'పోకెమాన్ హారిజన్స్' పేరుతో సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సిరీస్‌లో ప్రీమియర్ ఎపిసోడ్‌ను హంగామా టీవీలో ఈ నెల 25న స్ట్రీమింగ్ చేయబోతున్నారు. భారతీయ ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకొని దీన్ని



రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. కథలో ఇక్కడి నేటివిటీకి తగ్గట్లు మార్పులు చేయడంతో పాటు పలువురు ఇండియన్ ఆర్టిస్టులు మేకింగ్‌లో భాగమయ్యారు. ప్రముఖ సంగీత దర్శకులు విశాల్ - శేఖర్ సంగీతం అందించగా గాయకులు అర్మాన్ మాలిక్, హీరోయిన్ షిర్లే సేటియా ఇందులోని పాత్రలకు తమ గొంతును అందించారు. 'చిన్నప్పుడు పోకెమాన్ టాయ్స్ కలెక్ట్ చేశాను. ఇప్పుడు ఈ సిరీస్‌లోని పాత్రలకు డబ్బింగ్ చెప్పడం మర్చిపోలేని అనుభవం' అన్నారు షిర్లే సేటియా.

ఇకపై వరుసగా చిత్రాలు తీస్తా

\- ప్రతాని రామకృష్ణ గౌడ్



'ఇటీవలి కాలంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా బిజీగా ఉండడం వల్ల చిత్ర నిర్మాణానికి, దర్శకత్వానికి దూరంగా ఉన్నాను. ప్రస్తుతం 'దీక్ష' చిత్రం తీస్తున్నాను. చాలా మంచి సబ్జెక్ట్. ఆ తర్వాత 'లేడీ కబడ్డీ జట్టు' సినిమాను 16 భాషల్లో తీయడానికి ప్లాన్ చేస్తున్నా. మూడు పాటలు రికార్డ్ చేశాం కూడా. ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇకపై వరుసగా చిత్రాలు తీస్తా' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్. శనివారం (మే 18) తన పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటి వరకూ 36 సినిమాలు తీశా. ఏడు చిత్రాలకు దర్శకత్వం వహించా. నేను తీసిన ప్రతి సినిమా నాకు మంచి అనుభూతిని మిగిల్చింది. ముఖ్యంగా హీరో కృష్ణతో తీసిన 'సర్దార్ సర్వాయి పాపన్న' చిత్రానికి దర్శకత్వం వహించడం మరిచిపోలేని జ్ఞాపకం' అన్నారు. సినీ కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఛాంబర్ తరఫున నంది అవార్డులు ఇవ్వబోతున్నట్లు ఆయన వెల్లడిస్తూ 'ఆగస్టులో ఈ వేడుకను దుబాయ్‌లో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి' అని చెప్పారు.

సీరియల్ నటుడు చందు ఆత్మహత్య



బుల్లితెర నటుడు చందు ఆత్మహత్య చేసుకున్నారు. డిప్రెషన్‌తోనే ఆయన ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. శుక్రవారం హైదరాబాద్ మణికొండలోని ఆయన ఇంట్లో ఈ దుర్ఘటన జరిగింది. టీవీ నటి పవిత్ర జయరాం రోడ్డు ప్రమాదంలో చనిపోయాక చందు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తనకు బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి ఉందని, ఇంకొన్నాళ్లే బతుకుతానని చెప్పారు. ఆత్మహత్యకు ముందు 'ఈ రోజు పవిత్ర పుట్టిన రోజు నన్ను రమ్మంటోంది అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. త్రినయని, కార్తీకదీపం లాంటి సీరియళ్లతో చందు నటుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య శిల్ప, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హీరో అయిన దర్శకుడు

'మెరిసే మెరిసే' చిత్రంతో దర్శకుడిగా పరిచయమై అందరి ప్రశంసలు అందుకున్న పవన్‌కుమార్ కొత్తూరి ఇప్పుడు హీరో అయ్యారు. 'యావరేజ్ స్టూడెంట్ నాని' చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తూ అందులో హీరోగా నటిస్తున్నారు. స్నేహ మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లు. లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ప్రమోషన్స్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. బోల్డ్ అండ్ ఇంటెన్స్ లుక్‌తో హీరోహీరోయిన్లు ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమాకు సంబంధించిన మరికొన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని పవన్‌కుమార్ చెప్పారు.



స్పోర్ట్స్

హైదరాబాద్ ● శనివారం 18 మే 2024

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: బెంగళూరు

బెంగళూరు X చెన్నై



వరుణుడు ఏం చేస్తాడో?

రద్దయితే ప్లేఆఫ్స్‌కు సూపర్ కింగ్స్

బెంగళూరు: ఐపీఎల్ తాజా సీజన్‌లో కోల్‌కతా, రాజస్థాన్, సన్‌రైజర్స్ జట్లు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకున్నాయి. ఇక మిగిలిన ఒక్క బెర్త్ కోసం చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పోటీ పడబోతున్నాయి. ఇందుకోసం శనివారం చిన్నస్వామి స్టేడియంలో ఆఖరి లీగ్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే వాతావరణ శాఖ ప్రకారం ఈ కీలక మ్యాచ్‌కు వరుణుడు అడ్డుతగిలే చాన్సుంది. దీంతో బెంగళూరు అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే.. ఆ జట్టు ఈ మ్యాచ్‌లో ఘన విజయం సాధిస్తేనే ప్లేఆఫ్స్‌కు వెళుతుంది. ఇక మ్యాచ్ రద్దయినా చెన్నైకి ఇబ్బందేమీ లేదు. 15 పాయింట్లతో టాప్-4లో నిలుస్తుంది. అంతేకాకుండా స్వల్ప తేడాతో ఓడినా కూడా ఆర్‌సీబీకన్నా నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉంటుంది కాబట్టి రుతురాజ్ బృందం ముందుకు వెళుతుంది.

సబ్ ఎయిర్ సిస్టంతో ఇట్టే..

చిన్నస్వామి స్టేడియం దేశంలోనే ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను కలిగి ఉంది. 2017 నుంచి సబ్ ఎయిర్ సిస్టంను ఇక్కడ ఉపయోగిస్తున్నారు. అప్పట్లోనే దీని కోసం కర్ణాటక క్రికెట్ సంఘం రూ.4.50 కోట్లను ఖర్చు చేసింది. పిచ్‌తో పాటు మైదానంలోని గడ్డి కింద వివిధ లేయర్లలో ఇసుకను వాడడం దీని ప్రత్యేకత. దీంతో మైదానంలో నీరు నిల్వ ఉండకుండా సబ్ ఎయిర్ సిస్టంను రన్ చేయగానే డ్రైనేజీల ద్వారా బయటకు వచ్చేస్తుంది. ఇందుకోసం 200 హెచ్‌పీ మోటార్‌ను ఉపయోగిస్తుంటారు. ఒక నిమిషంలో 10వేల లీటర్ల నీటిని బయటకు పంపవచ్చు. ఆ తర్వాత డ్రయ్యర్లు, రోప్‌లతో ఎలాంటి తడి లేకుండా మ్యాచ్‌కు గ్రౌండ్‌ను సిద్ధం చేస్తారు. ఇలా ఓ గంటపాటు భారీ వర్షం కురిసి ఆగినా.. 30-40 నిమిషాల్లోనే పిచ్ రెడీ అవుతుంది.

ఓటమితో సరి


హార్దిక్

ఆఖరి లీగ్ మ్యాచ్‌లోనూ ముంబైకి నిరాశే

- లఖ్‌నవూ ఘనవిజయం
- చెలరేగిన పూరన్
- రోహిత్ పోరాటం వృధా


నికోలస్ పూరన్ (29 బంతుల్లో 75)

ముంబై: సొంతగడ్డపై ఓ విజయంతో తాజా సీజన్‌కు ముగింపు పలకాలని భావించిన ముంబై ఇండియన్స్‌కు నిరాశే మిగిలింది. కీలక సమయాల్లో బౌలర్లు, బ్యాటర్లు మూకుమ్మడిగా విఫలమయ్యారు. దీంతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 18 పరుగులతో ఘనవిజయం సాధించింది. నికోలస్ పూరన్ (29 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 75) మెరుపు ఇన్నింగ్స్‌తో పాటు ఆ జట్టు బౌలర్లు గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఈ ఓటమితో ముంబై 8 పాయింట్లతో పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. అటు 14 పాయింట్లు సాధించిన లఖ్‌నవూ కూడా ఇంటికెళ్లినట్టే. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది. రాహుల్ (41 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) అర్ధసెంచరీ సాధించాడు. తుషార, చావ్లాలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసి ఓడింది. రోహిత్ (38 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 68), నమన్ ధిర్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 62 నాటౌట్) వేగంగా ఆడారు. బిష్ణోయ్, నవీన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా పూరన్ నిలిచాడు.

శుభారంభం దక్కినా..: భారీ ఛేదనలో ముంబైకి లభించిన మెరుపు ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఓపెనర్ రోహిత్ భారీ షాట్లతో లఖ్‌నవూ బౌలర్లను ఆడుకున్నాడు. కానీ పవర్‌ప్లే ముగిశాక వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన ముంబై తడబడింది. చివర్లో నమన్ ధిర్ ఎదురుదాడి సరిపోలేదు. రెండో ఓవర్‌లోనే రోహిత్ రెండు సిక్సర్లతో జోరు చూపాడు. అయితే నాలుగో ఓవర్‌లో కురిసిన వర్షం గంటపాటు అంతరాయం కలిగించింది. ఆ తర్వాత కూడా రోహిత్ వరుస ఫోర్లతో చెలరేగడంతో పవర్‌ప్లేలో జట్టు 53 పరుగులు సాధించింది. ఇక ఏడో ఓవర్‌లో 4,4,6తో 14 రన్స్ సాధించడమే కాకుండా 28 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. అటు బ్రెవిస్ (23) తొమ్మిదో ఓవర్‌లో 4,6తో వేగం అందుకుంటున్న క్రమంలోనే నవీనుల్ హక్‌కు చిక్కాడు. దీంతో తొలి వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అక్కడి నుంచి వరుస ఓవర్లలో సూర్యకుమార్ (0), రోహిత్‌లను క్రునాల్, బిష్ణోయ్ అవుట్ చేశారు. కెప్టెన్ హార్దిక్ (16) 4,6తో ఆకట్టుకున్నా త్వరగానే నిష్క్రమించాడు. ఈ దశలో ఇషాన్, నమన్ జాగ్రత్తగా ఆడడంతో స్కోరు నెమ్మదించింది. అయితే 17వ ఓవర్‌లో నమన్ 4,6తో వేగం పెంచాడు. అలాగే 19వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో ఆశలు రేపాడు. కానీ ఆఖరి ఓవర్‌లో 34 పరుగులు కావాల్సి ఉండడంతో ముంబై చేసేదేమీ లేకపోయింది. తొలి బంతికి సిక్సర్ బాదిన నమన్ 25 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. అయితే రెండో బంతికి సిక్సర్ రాకుండా క్రునాల్ అద్భుత ఫీల్డింగ్‌తో అడ్డుకోగా, మూడో బంతికి ఇషాన్ అవుటవడంతో లఖ్‌నవూ సంబరాల్లో మునిగింది.

పూరన్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్ ఆరంభంలో నత్తనడకన సాగింది. కానీ నికోలస్ పూరన్ ధనాధన్ ఆటతీరుతో మధ్య ఓవర్లలో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. దీంతో 150 కూడా కష్టమే అనుకున్న చోట జట్టు 200 దాటగలిగింది. తొలి ఓవర్‌లోనే దేవ్‌దత్ డకౌట్ కాగా.. ఓపెనర్ రాహుల్ ఆచితూచి ఆడాడు. అటు స్టొయినిస్ (28) మాత్రం ఉన్న కాసేపు వేగం కనబర్చుతూ నాలుగో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు. ఇక రాహుల్ ఆరో ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో జోరు చూపినా, స్టొయినిస్ అవుటయ్యాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 49/2తో నిలిచింది. కాసేపటికే దీపక్ హుడా (11)ను స్పిన్నర్ పియూష్ చావ్లా అవుట్ చేశాడు. అటు రాహుల్ బంతికో పరుగు చొప్పున ఆడడంతో పది ఓవర్లలో స్కోరు 69/3గానే ఉంది. కానీ 13వ ఓవర్ నుంచి పూరన్ బాదుడు మొదలైంది. ఆ ఓవర్‌లో అతను 4,4,6,6తో ఏకంగా 22 పరుగులు రాబట్టాడు. హార్దిక్ ఓవర్‌లోనూ రెండు సిక్సర్లు బాదిన పూరన్.. 15వ ఓవర్‌లో వరుసగా 6,6,6,4తో 19 బంతుల్లోనే అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అటు రాహుల్ సిక్సర్‌తో జట్టు 29 పరుగులు రాబట్టింది. తర్వాతి ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టిన రాహుల్ 37 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. ఈ సమయంలో జట్టు 220+ రన్స్ సాధిస్తుందనిపించింది. కానీ 178 స్కోరు వద్దే పేసర్ తుషార.. పూరన్, అర్షద్ (0)ల వికెట్లను తీయగా, రాహుల్‌ను పియూష్ చావ్లా అవుట్ చేశాడు. కానీ ఆఖరి ఓవర్‌లో బదోని (22 నాటౌట్) 6,6,4తో స్కోరు 200 దాటింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: రాహుల్ (సి) తుషార (బి) చావ్లా 55, దేవ్‌దత్ పడిక్కళ్ (ఎల్బీ) తుషార 0, స్టొయినిస్ (ఎల్బీ) చావ్లా 28, దీపక్ హుడా (సి) వధేరా (బి) చావ్లా 11, పూరన్ (సి) సూర్య (బి) తుషార 75, అర్షద్ (సి) వధేరా (బి) తుషార 0, బదోని (నాటౌట్) 22, క్రునాల్ (నాటౌట్) 12, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 214/6; వికెట్ల పతనం:** 1-1, 2-49, 3-69, 4-178, 5-178, 6-178; **బౌలింగ్:** తుషార 4-0-28-3, అర్జున్ టెండూల్కర్ 2.2-0-22-0, అన్షుల్ 3-0-48-0, పీయూష్ చావ్లా 4-0-29-3, వధేరా 2-0-13-0, హార్దిక్ 2-0-27-0, నమన్ ధిర్ 0.4-0-17-0, షెపర్డ్ 2-0-30-0.

ముంబై: రోహిత్ (సి) మొహిసిన్ (బి) బిష్ణోయ్ 68, బ్రేవిస్ (సి) క్రునాల్ (బి) నవీనుల్ 23, సూర్యకుమార్ (సి) బిష్ణోయ్ (బి) క్రునాల్ 0, ఇషాన్ (బి) నవీనుల్ 14, హార్దిక్ (సి) నవీనుల్ (బి) మొహిసిన్ 16, నేహల్ వధేరా (సి) క్రునాల్ (బి) బిష్ణోయ్ 1, నమన్ ధిర్ (నాటౌట్) 62, షెపర్డ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 196/6; వికెట్ల పతనం:** 1-88, 2-89, 3-97, 4-116, 5-120, 6-188; **బౌలింగ్:** అర్షద్ 2-0-11-0, హెన్రీ 2-0-24-0, క్రునాల్ 4-0-29-1, మొహిసిన్ 4-0-45-1, నవీనుల్ 4-0-50-2, రవి బిష్ణోయ్ 4-0-37-2.

2 ఓ సీజన్‌లో ఎక్కువ మ్యాచ్‌లు (10) ఓడడం ముంబైకిది రెండోసారి. 2022లో ఇన్నే మ్యాచ్‌లు ఓడింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	13	8	5	0	16	0.273
హైదరాబాద్	13	7	5	1	15	0.406
చెన్నై	13	7	6	0	14	0.528
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
లఖ్‌నవూ	14	7	7	0	14	-0.667
బెంగళూరు	13	6	7	0	12	0.387
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	14	4	10	0	8	-0.318

బంగ్లాతో భారత్‌కు ప్రాక్టీస్

టీ20 ప్రపంచకప్

న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహకంగా 16 వామప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. దీంట్లో భాగంగా భారత జట్టు కేవలం ఒకే ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. జూన్ 1న యూఎస్‌ఏలో రోహిత్ సేన బంగ్లాదేశ్‌తో ఈ మ్యాచ్‌లో తలపడనుంది. భారత ఆటగాళ్లు ఈనెల 25, 26న విడతలవారీగా యూఎస్ చేరుకుంటారు. ఐపీఎల్ ఫైనల్లో పాల్గొనే ఆటగాళ్లు 26 తర్వాత వెళతారు. అందుకే జట్టు ఒక్క వామప్‌తో సరిపెట్టుకుంటోంది. ఇతర జట్ల ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఈనెల 27 నుంచే మొదలవుతాయి. మెగా టోర్నీలో భారత జట్టు న్యూయార్క్‌లో రెండు, ఫ్లోరిడాలో ఓ లీగ్ మ్యాచ్ ఆడుతుంది. ఆ తర్వాత సూపర్-8 కోసం కరీబియన్ దీవులకు పయనమవుతుంది.

ఆరోజంతా తనివితీరా ఏడుస్తా!


సునీల్ ఛెత్రి

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి అనూహ్య రిటైర్మెంట్ అతడి ఫ్యాన్స్‌ను షాక్‌కు గురి చేసింది. మరికొద్ది సంవత్సరాలు ఆడగలిగే సత్తా ఉన్న అతడు వీడ్కోలు చెప్పడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే మానసిక కారణాలతోనే తాను ఆటకు గుడ్‌బై చెప్పానని వివరించాడు 39 ఏళ్ల ఛెత్రి. జూన్ 6న కువైట్‌తో కోల్‌కతాలో జరిగే ఫిఫా వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ మ్యాచే తన కెరీర్‌లో చివరిదని సునీల్ గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. దేశవాళీ పోటీలలో ఉన్న కొన్ని కమిట్‌మెంట్లను పూర్తి చేసిన అనంతరం విశ్రాంతి తీసుకొంటానని సునీల్ శుక్రవారం వెల్లడించాడు. 'రిటైర్మెంట్ నిర్ణయం శారీరకంగా అలిసిపోవడం వల్ల తీసుకున్నది కాదు. శారీరకంగా ఫిట్‌గా ఉన్నా. కానీ పోటీలలో పాల్గొనేందుకు మానసికంగా సిద్ధంగా లేకపోవడంతోనే ఈ నిర్ణయం. జూన్ 6న రిటైర్ అవుతా. మరుసటి రోజు అంటే జూన్ 7న తనివితీరా ఏడుస్తా. ఆ తర్వాతి రోజున పూర్తిగా రిలాక్స్ అవుతా. అప్పటినుంచి కుటుంబంతో గడుపుతా' అని ఛెత్రి వివరించాడు.

ఆప్త మిత్రుడితో చర్చించాకే..

తన రిటైర్మెంట్ నిర్ణయంపై టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీతో చర్చించినట్టు ఛెత్రి వెల్లడించాడు. కోహ్లీ, ఛెత్రి ప్రాణ స్నేహితులు. వీరిద్దరి మధ్య మంచి అనుబంధం ఉందన్న సంగతి తెలిసిందే. 'విరాట్ నాకు చాలా సన్నిహితుడు. అందుకే రిటైర్మెంట్ విషయంపై అతడితో మాట్లాడా' అని ఛెత్రి తెలిపాడు. 'ఛెత్రి గొప్ప ఆటగాడు. రిటైర్మెంట్ నిర్ణయానికి సంబంధించి నాకు అతడు మెసేజ్ చేశాడు. ఆ నిర్ణయం తర్వాత సునీల్ ప్రశాంతంగా ఉన్నట్టు నాకు అనిపించింది' అని కోహ్లీ అభిప్రాయపడ్డాడు.



సెమీస్‌లో సాత్విక్ జోడీ

- అశ్విని జంట కూడా
- థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ జోడీలు సాత్విక్/చిరాగ్, అశ్వినీ పొన్నప్ప/తనీషా సెమీఫైనల్స్‌కు దూసుకుపోయాయి. అయితే సింగిల్స్‌లో భారత షట్లర్ మీరాబ పోరాటం క్వార్టర్స్‌తో ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-7, 21-14తో జునైది అరీఫ్/రాయ్ కింగ్ (మలేసియా) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో అశ్వినీ/తనీషా జంట 21-15, 21-23, 21-10తో ఆరో సీడ్ లీ యు/షిన్ సుంగ్ (కొరియా) ద్వయంపై నెగ్గింది. పురుషుల సింగిల్స్ రౌండ్-8 మ్యాచ్‌లో మీరాబ 12-21, 5-21తో స్థానిక స్టార్ కున్లవత్ వితిద్‌శర్న్‌తో చేతిలో పరాజయం పాలయ్యాడు.

నాలుగో రౌండ్‌లో అర్జున్ గెలుపు

షార్జా: షార్జా మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ (3) ఇరిగేసి విజయం సాధించాడు. తెల్లపావులతో బరిలో దిగిన అర్జున్ 46 ఎత్తుల్లో అమెరికాకు చెందిన మాన్యుయెల్ పెట్రోసియన్‌ను చిత్తు చేశాడు. తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక (1.5) నాలుగో రౌండ్‌లో గ్లెబ్ దుడిన్ (హంగేరి)తో డ్రా చేసుకుంది. ఇక రాజా రిత్విక్ సహచర జీఎం అభిజీత్ గుప్తా చేతిలో ఓడిపోయాడు.

బిజినెస్

భారత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే విదేశీ ఫండ్లలో ఎంఎఫ్‌ల పెట్టుబడులు

అనుమతించాలని సెబీ ప్రతిపాదన



న్యూఢిల్లీ: దేశీయ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) కంపెనీలు విదేశీ ఫండ్లు లేదా యూనిట్ ట్రస్ట్‌ల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. అయితే, తమ నికర ఆస్తుల్లో 20 శాతానికి మించకుండా భారత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెట్టిన విదేశీ ఫండ్లలో మాత్రమే మన ఎంఎఫ్‌లు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించనుంది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రాన్ని నియంత్రణ మండలి శుక్రవారం విడుదల చేసింది. సెబీ తాజా ప్రతిపాదనతో దేశీయ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్) పేరు సార్థకమవడంతో పాటు ఇన్వెస్టర్లకు తక్కువ వ్యయంతో ఆశించిన రిటర్నులను పొందేందుకు వీలవుతుందని సెబీ పేర్కొంది. భారత్ ఆర్థిక వృద్ధి అవకాశాలు బలంగా ఉన్న నేపథ్యంలో విదేశీ ఫండ్లకు మన సెక్యూరిటీలు, షేర్లు ఆకర్షణీయ పెట్టుబడి అవకాశాలుగా మారాయని.. పలు అంతర్జాతీయ సూచీలు, ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్), మ్యూచువల్ ఫండ్లు, యూనిట్ ట్రస్ట్ (యూటీ) తమ ఆస్తుల్లో కొంత భాగాన్ని భారత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతున్నాయని చర్చా పత్రంలో సెబీ ప్రస్తావించింది.

ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇంటర్నేషనల్ (ఎంఎస్‌సీఐ) ఎమర్జింగ్ మార్కెట్స్ ఇండెక్స్‌లో భారత సెక్యూరిటీల వెయిటేజీ 18 శాతం దాటింది. అలాగే, 2024 మార్చి 31నాటికి జేపీ మోర్గాన్‌కు చెందిన ఎమర్జింగ్ మార్కెట్ ఆపర్చ్యునిటీస్ ఫండ్ 15 శాతం పెట్టుబడులను భారత సెక్యూరిటీల్లో కలిగిఉంది. పోర్ట్‌ఫోలియో వివిధీకరణ, విదేశీ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) పథకాల్లో భాగంగా దేశీయ ఎంఎఫ్‌లు తరచుగా విదేశీ మ్యూచువల్ ఫండ్లు, ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్లు సహా విదేశీ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. అయితే, నిబంధనల్లో స్పష్టత లేని కారణంగా భారత్ సహా పలు దేశాల సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే విదేశీ ఎంఎఫ్‌లు, యూటీలు, ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్లలో మాత్రం మన ఎంఎఫ్‌లు పెట్టుబడులు పెట్టడం లేదు. సెబీ తాజా ప్రతిపాదన ఇందుకు మార్గం సుగమం చేయనుంది.


ఆర్థిక మంత్రి నిర్మల

తయారీ రంగం మరింత పటిష్ఠం కావాలి

న్యూఢిల్లీ: ప్రపంచ వాణిజ్యంలో వాటా పెంచుకుని భారత దేశం "ఆత్మనిర్భరం" కావాలంటే తయారీ రంగంలో వేగం పెరగాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వార్షిక వ్యాపార సదస్సులో ఆమె మాట్లాడుతూ.. విధానపరమైన మద్దతు గల వాతావరణంలో తయారీ విధానాలను ఆధునీకరించుకోవాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. భారతదేశం తయారీ ఆధారిత వృద్ధిని చేజార్చుకున్నందు వల్ల సేవల రంగం పైనే దృష్టి సారించాలన్న రఘురామ్ రాజన్ సహా కొందరు ఆర్థికవేత్తల అభిప్రాయంతో తాను విభేదిస్తున్నట్టు చెబుతూ తయారీ రంగాన్ని విస్తరించడం ద్వారా మాత్రమే భారత్ స్వయం సమృద్ధం కాగలదని ఆమె స్పష్టం చేశారు. కొవిడ్-19 అనంతరం ప్రపంచం యావత్తు చైనా+1 వ్యూహం అనుసరిస్తున్న నేపథ్యంలో తయారీ రంగాన్ని పటిష్ఠం చేసుకోగల అవకాశం భారత్‌కు ఇప్పటికీ ఉన్నదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇటీవల క్యాప్‌జెమినీ నిర్వహించిన సర్వేలో పాల్గొన్న 760 మంది ప్రపంచ శ్రేణి ఎగ్జిక్యూటివ్‌లలో 65 శాతం మంది భారత్‌లో పెట్టుబడులు విశేషంగా పెంచాలనుకుంటున్నట్టు తెలియచేసిన విషయం ఆమె గుర్తు చేశారు.

సెన్సెక్స్ 253 పాయింట్లు జంప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, ఎస్‌బీఐ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 253.31 పాయింట్ల లాభంతో 73,917.03 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62.25 పాయింట్ల వృద్ధితో 22,466.10 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 లాభపడగా.. ఎం అండ్ ఎం షేరు 5.97 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. దాంతో ఎం అండ్ ఎం మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.3 లక్షల కోట్ల మైలురాయిని దాటింది.

సిల్వర్ కొత్త రికార్డు: వెండి ధర వరుసగా రెండో రోజూ కొత్త రికార్డును నమోదు చేసింది. ఢిల్లీ మార్కెట్లో కేజీ సిల్వర్ మరో రూ.300 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.89,000కు చేరుకుంది.

నేడు మార్కెట్లో ప్రత్యేక ట్రేడింగ్

ఈ నెల 18న (శనివారం) బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్ జరగనుంది. ట్రేడింగ్‌లో భారీ అంతరాయాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనే విషయంలో తమ సంసిద్ధతను పరీక్షించేందుకు ఈ ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహిస్తున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలు ఇదివరకే వెల్లడించాయి. ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్ రెండు విడతల్లో జరగనుంది. తొలుత సాధారణ ట్రేడింగ్ ఉదయం 9.15 గంటల నుంచి పదింటి వరకు జరగనుంది. ఆ తర్వాత 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డిజాస్టర్ రికవరీ సైట్ నుంచి ట్రేడింగ్‌ను నిర్వహించనున్నాయి. ఈ ఏడాదిలో స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ తరహా ట్రేడింగ్ నిర్వహించడం ఇది రెండోసారి.

డిష్ టీవీ స్మార్ట్ ప్లస్

టీవీతో పాటు ఓటీటీ సేవలు



హైదరాబాద్: డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) ప్రొవైడర్ డిష్ టీవీ.. వినియోగదారుల కోసం డిష్ టీవీ స్మార్ట్ ప్లస్ పేరుతో సరికొత్త సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. డిష్ టీవీ స్మార్ట్ ప్లస్‌లో డీటీహెచ్ వినియోగదారులకు టీవీ, ఓవర్ ది టాప్ (ఓటీటీ) కంటెంట్‌ను అందించనున్నట్లు డిష్ టీవీ ఇండియా లిమిటెడ్ సీఈఓ మనోజ్ దోబాల్ తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఏపీ, తెలంగాణ మార్కెట్లోకి ఈ సర్వీస్‌ను లాంచనంగా విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీ సబ్‌స్క్రిప్షన్ ప్యాక్‌తో మొత్తం 21 ఓటీటీ యాప్స్ వినియోగదారులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఓటీటీ యాప్స్ కోసం డీటీహెచ్ ఖాతాదారులు అదనంగా ఎలాంటి మొత్తాన్ని చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రస్తుత ఖాతాదారులు స్మార్ట్ ప్లస్‌కు మారాలనుకుంటే సెట్‌బాక్స్‌ను మార్చుకుంటే సరిపోతుందన్నారు. కాగా కొత్త ఖాతాదారులకు జాక్‌పాట్ ఆఫర్ పేరుతో ఈ సర్వీస్‌ను ఆఫర్ చేస్తున్నట్లు మనోజ్ తెలిపారు. డీటీహెచ్‌లో వచ్చే టీవీ కంటెంట్‌తో పాటు జీ5, సన్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్, ఈటీవీ విన్ వంటి ఓటీటీ యాప్స్‌ను ఖాతాదారులు ఎక్కడైనా, ఏ స్క్రీన్‌పైనా చూడవచ్చని ఆయన పేర్కొన్నారు. డీటీహెచ్ మార్కెట్లో డిష్ టీవీ వాటా 29 శాతం ఉందన్నారు. ఏపీ, తెలంగాణ మార్కెట్లో కంపెనీ వాటా 21 శాతం ఉందని తెలిపారు. కాగా వచ్చే ఏడాదిన్నర కాలంలో ఆండ్రాయిడ్ 4కే సెట్‌టాప్ బాక్స్, టీవీలో ఇన్‌బిల్ట్ ఎస్‌టీబీ, క్లౌడ్ సెట్‌టాప్ బాక్స్‌ను విడుదల చేయనున్నట్లు మనోజ్ తెలిపారు.

నవ లిమిటెడ్ లాభం రూ.255 కోట్లు

ఒక్కో షేరుకు 200 శాతం డివిడెండ్

హైదరాబాద్: నవ లిమిటెడ్.. గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన త్రైమాసికానికి గాను కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.951.60 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.255.10 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.1,000.40 కోట్లుగా ఉండగా లాభం రూ.341.50 కోట్లుగా ఉంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.3,955 కోట్ల ఆదాయంపై రూ.1,256.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1,221.70 కోట్లుగా ఉండగా ఆదాయం రూ.3,928 కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో మాంబా కాలరీస్ లిమిటెడ్ (ఎంసీఎల్) అమ్మకాలు మెరుగుపడటంతో లాభదాయకత పెరిగిందని కంపెనీ పేర్కొంది. మరోవైపు 2023-24లో ఎంసీఎల్‌కు సంబంధించిన రూ.2,621.10 కోట్ల దీర్ఘకాలిక రుణాలను చెల్లించినట్లు తెలిపింది. కాగా గత ఆర్థిక సంవత్సరంలో నవభారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎన్‌బీఈఐఎల్) ఆదాయాలు కూడా 13.2 శాతం వృద్ధి చెందినట్లు కంపెనీ పేర్కొంది. ఎన్‌బీఈఐఎల్ రూ.63.9 కోట్ల రుణాలను చెల్లించటంతో ఈ ఏడాది జూన్ నాటికి రుణ రహిత కంపెనీగా మారనుందని తెలిపింది. దీంతో నవ లిమిటెడ్.. కన్సాలిడేటెడ్, స్టాండ్‌ఎలోన్ స్థాయిల్లో రుణ రహిత కంపెనీగా అవతరించిందని పేర్కొంది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు 200 శాతం (రూ.4) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

ఎంఎస్ఎన్ ల్యాబ్స్‌తో జైడస్ లైఫ్‌సైన్సెస్ ఒప్పందం

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఎంఎస్ఎన్ లేబొరేటరీస్‌కు జైడస్ లైఫ్‌సైన్సెస్ నుంచి భారీ కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు కింద ఎంఎస్ఎన్ ల్యాబ్స్.. జైడస్ లైఫ్‌సైన్సెస్ కోసం క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌లో ఉపయోగించే కాబోజానిటినిబ్ జెనరిక్ ట్యాబ్లెట్లను తయారు చేసి సరఫరా చేస్తుంది. జైడస్ లైఫ్‌సైన్సెస్ ఈ టాబ్లెట్లను అమెరికాలో మార్కెట్ చేస్తుంది. ఇందుకోసం జైడస్ లైఫ్‌సైన్సెస్ అనుబంధ సంస్థ జైడస్ లైఫ్‌సైన్సెస్ గ్లోబల్ ఎఫ్‌జెడ్ఈ, ఎంఎస్ఎన్ ల్యాబ్స్‌తో ప్రత్యేక లైసెన్సింగ్, సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది.

తకేడా డెంగ్యూ వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్ఓ ఆమోదం

న్యూఢిల్లీ: డెంగ్యూకు త్వరలో కొత్త వ్యాక్సిన్ రాబోతోంది. జపాన్ కంపెనీ తకేడా ఫార్మా ఇందుకోసం 'టీఏకే-003' అనే పేరుతో ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నుంచి ఈ వ్యాక్సిన్ ప్రీక్వాలిఫికేషన్ సంపాదించింది. దీని ప్రకారం 6-16 మధ్య వయస్కులైన పిల్లలకు మూడు నెలల గ్యాప్‌తో రెండు డోసుల్లో ఈ వ్యాక్సిన్ ఉపయోగించవచ్చు. ఈ వ్యాక్సిన్ హైదరాబాద్‌లోనూ తయారు కానుంది. ఇందుకోసం తకేడా ఫార్మా కంపెనీ ఇటీవల బయోలాజికల్-ఈ (బీఈ) కంపెనీతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది.

'ఇఫ్కో'తో డ్రోగో డ్రోన్స్ జట్టు

- 30 లక్షల ఎకరాల్లో పురుగు మందుల పిచికారీ
- త్వరలో ఎయిర్ ట్యాక్సీ సేవలు

హైదరాబాద్‌కు చెందిన డ్రోగో డ్రోన్స్ తన కార్యకలాపాలను పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రతో సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో తన 'కృషి 3 ప్రో' డ్రోన్ల ద్వారా 30 లక్షల ఎకరాల్లో క్రిమి సంహారక, పురుగు మందులటను పిచికారీ చేయనుంది. ఇందుకోసం సహకార రంగంలోని 'ఇఫ్కో'తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి అనుమతి కూడా సంపాదించింది.

రూ.200 కోట్ల టర్నోవర్: డ్రోగో డ్రోన్స్ తన కార్యకలాపాలను మరిన్ని రంగాలకు విస్తరిస్తోంది. త్వరలో అత్యవసర వైద్య సేవల కోసం ఎయిర్ ట్యాక్సీ సేవలు ప్రారంభిస్తామని కంపెనీ సీఈఓ యశ్వంత్ బొంతు తెలిపారు. కృషి 3 ప్రో డ్రోన్ల నిర్వహణ కోసం ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో డ్రోన్ సర్వీస్ హబ్‌లు ఏర్పాటు చేయబోతున్నట్టు వెల్లడించారు. వచ్చే ఏడాది రూ.200 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు యశ్వంత్ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,750 ▼	67,600 ▼	92,500 ▲
ముంబై	73,383 ▼	67,219 ▼	86,373 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ

హైదరాబాద్	550
వరంగల్	552
చిత్తూరు	628
విజయవాడ	540
గోదావరి	540
విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147
వరంగల్	147
కరీంనగర్	147
మహబూబ్‌నగర్	149
కర్నూలు	149
విశాఖపట్నం	146
గోదావరి	154
విజయవాడ	154
గుంటూరు	154
ఒంగోలు	154
చిత్తూరు	160



భూమిపుత్రుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేసీఆర్, హరీశ్‌రావు

భూమిపుత్రుడు పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో సాగునీరు, వ్యవసాయ పురోభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కృషిని వివరిస్తూ.. ఆపార్టీ నేత గోసుల శ్రీనివాస్‌యాదవ్ భూమిపుత్రుడు పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకాన్ని ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల భారం మోపితే పోరాటమే: బీఆర్ఎస్

రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ సర్కారు జనంపై పన్నుల బాదుడు మొదలు పెట్టాలని చూస్తోందని బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, చిరుమళ్ల రాకేశ్ కుమార్ ఆరోపించారు. ప్రజలపై భారంమోపే ఏ నిర్ణయాన్నీ తమ పార్టీ ఆమోదించదని, ప్రజల పక్షాన పోరాడతామని అన్నారు. రాష్ట్రంలో బెల్టుషాపులు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి చెప్పారని, ఇప్పుడు వాటిద్వారానే అధిక రాబడికోసం చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, డీఏ ప్రకటనపై క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వండి: ఉద్యోగులు

ఉద్యోగులకు 40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు పీఆర్‌సీ ఛైర్మన్ ఎన్.శివశంకర్‌ను శుక్రవారం కలిశారు. అడ్వాన్స్ పెంపు, లీవ్ ట్రావెల్ భత్యాల మంజూరు, హెల్త్‌కార్డులు, అదనపు పింఛను, పాత పింఛను విధానం అమలు, 5 నుంచి 25 సంవత్సరాల ఏఏఎస్, ఆర్జిత సెలవుల జమపై ఉన్న పరిమితిని ఎత్తివేయడం వంటి అంశాల మీద కమిషన్‌తో చర్చించినట్లు తెలిపారు. పీఆర్‌సీ కమిషన్‌ను కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మఠం రవీంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి హరీశ్‌కుమార్ రెడ్డి, పద్మ తదితరులు ఉన్నారు.

టీచర్లకు కనీస జీతం రూ. 69,150 ఇవ్వాలి

- పీఆర్‌సీ ఛైర్మన్‌కు ఉపాధ్యాయ సంఘం వినతి

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): టీచర్లకు కనీస జీతం రూ. 69,150లకు పైగా నిర్ణయించాలని వేతన సవరణ కమిషన్ ఛైర్మన్ శివశంకర్‌ను తెలంగాణ టీచర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు శుక్రవారం పీఆర్‌సీ ఛైర్మన్ కలిసి వినతి పత్రం సమర్పించింది. అలాగే... గత ఏడాది జులై 1వ తేదీ నాటికి ఉన్న మూల వేతనంతో కలుపుకుని 35 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. పీఆర్‌సీ ఛైర్మన్‌ను కలిసిన వారిలో తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, కార్యదర్శి చందూరి రాజిరెడ్డి ఉన్నారు.

దురుద్దేశంతోనే కవితపై కేసు: ప్రవీణ్ కుమార్

- కవితతో ప్రవీణ్, బాల్కసుమన్ ములాఖత్

న్యూఢిల్లీ, మే 17(ఆంధ్రజ్యోతి): కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మోదీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలతో కేసులు పెట్టించిందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. అన్ని వ్యవస్థలను తన నియంత్రణలో



తిహాడ్ జైలు గేటు వద్ద ప్రవీణ్‌కుమార్, బాల్కసుమన్

ఉంచుకుని ప్రధాని మోదీ ప్రతిపక్షాల గొంతు అణిచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్ర, డ్రగ్స్ కార్యకలపాలలో నిధులకు సంబంధించి వర్తించే పీఎంఎల్‌ఏ సెక్షన్లను కవితపై మోపారని, మద్యం కేసులో డబ్బు ఎక్కడ దొరికిందని ప్రశ్నించారు. ఇతరులను ఇరికించేందుకు పేర్లు చెప్పాలని దర్యాప్తు సంస్థలు ఒత్తిడి చేస్తున్నట్లు కవిత తమకు చెప్పారని ఆర్ఎస్ ప్రవీణ్ తెలిపారు. అంతకుముందు ఉదయం 10 గంటలకు తిహాడ్ జైలులో ఉన్న కవితతో ఆర్ఎస్‌ప్రవీణ్, బాల్కసుమన్ ములాఖత్ అయ్యారు.

దండె విఠల్‌కు సుప్రీంకోర్టులో ఊరట

- ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే

బీఆర్ఎస్ తరఫున ఆదిలాబాద్ నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయిన దండె విఠల్‌కు శుక్రవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీగా ఆయన ఎన్నిక చెల్లదంటూ ఈ నెల మూడో తేదీన తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చింది. తదుపరి విచారణను జూలై 10కి వాయిదా వేసింది. 2022లో జరిగిన స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విఠల్‌పై ప్రత్యర్థిగా నిర్మల్ జిల్లా సారంగపూర్ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. తాను నామినేషన్ పత్రాన్ని ఉపసంహరించుకోనప్పటికీ తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ఎన్నికల బరి నుంచి తప్పించారని రాజేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సంతకం ఫోర్జరీ జరిగిందని ధ్రువీకరిస్తూ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ నివేదిక ఇచ్చింది. దీన్ని ఆధారం చేసుకున్న హైకోర్టు.. విఠల్ ఎన్నిక చెల్లదంటూ తీర్పును వెలువరించింది. ఖర్చుల కింద పిటిషనర్ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశించింది. అప్పీలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును నాలుగు వారాల పాటూ సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో విఠల్ గత సోమవారం సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు తీర్పు అమలు కాకుండా స్టే విధించాలని విఠల్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేయగా అందుకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

కిషన్‌రెడ్డి అభిప్రాయం సరికాదు: విజయశాంతి

హైదరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఇక ఉండబోదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెలిబుచ్చిన అభిప్రాయం సమంజసం కాదని కాంగ్రెస్ నేత విజయశాంతి అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ భావోద్వేగాలు, ప్రజా మనోభావాలను వారి ఆత్మాభిమానం వైపు నడిపిస్తూనే ఉండడం దక్షిణాది రాష్ట్రాల సహజ విధానమని ఆమె అన్నారు. "దక్షిణాది స్వీయ గౌరవ అస్తిత్వ సత్యాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకున్నట్లు, బీజేపీ కనీసం ఆలోచన చేయలేదని కిషన్‌రెడ్డి ప్రకటనను బట్టి స్పష్టమవుతోంద"ని విజయశాంతి ఎక్స్(ట్విటర్)లో పేర్కొన్నారు.

ఆంధ్రాలో ఓటేసిన వారి పేర్లను తొలగించండి

- ఈసీకి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ లేఖ

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓటర్ల జాబితా నుంచి ఆంధ్రాలో ఓటేసిన వారి పేర్లను తొలగించాలంటూ కేంద్ర ఎన్నికల కమిషన్‌ను టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ కోరారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం బాగా తగ్గడంపై సవివరంగా విశ్లేషణ జరపాలన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో 12.34 లక్షల మేరకు ఓట్లు తక్కువగా పోలయినట్లుగా గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటరుకు ఒకే చోట ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్లా ఓటరుగా ఉంటే వారిపై క్రిమినల్ కేసును నమోదు చేయవచ్చన్నారు.

బీఆర్ఎస్ నిర్వాకంతో ఆర్ఆర్ఆర్ ఆగింది

సీఎం, నేను కలిసి కేంద్రంతో చర్చలు జరిపి యుటిలిటీ చార్జీలు చెల్లిస్తామని లేఖ రాశాం

- హైదరాబాద్-విజయవాడ రహదారిపై 17 బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రత్యామ్నాయ చర్యలు
- సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) విషయంలో యుటిలిటీ చార్జీలను చెల్లించబోమని గత బీఆర్ఎస్ సర్కారు కేంద్రానికి లేఖ రాయడంతో మొత్తం ప్రాజెక్టే ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక యుటిలిటీ చార్జీల కింద రూ.363.43 కోట్లను చెల్లిస్తామని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి, తాను కలిసి లేఖ రాశామని వెల్లడించారు. ఈ క్రమంలోనే తాము రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించడంతో యుటిలిటీ చార్జీలను భరించేందుకు కేంద్రమే ముందుకు వచ్చిందని తెలిపారు. 2021లోనే ఆర్ఆర్ఆర్‌ను కేంద్రం మంజూరు చేయగా, ఇప్పటికీ నిర్మాణం ప్రారంభం కాలేదన్నారు. ఫలితంగా రాష్ట్రం కూడా అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులతో కలిసి పలు అంశాలపై మంత్రి సమీక్షించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో 70 శాతం భూ సేకరణ పూర్తయిందని, మిగతా 30శాతం పురోగతిలో ఉందని అధికారులు వివరించారు. నర్సాపూర్ పరిధిలో అటవీ శాఖకు సంబంధించిన అంశంతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ కోర్టు కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు స్పందించిన మంత్రి.. ఆర్ఆర్ఆర్ విషయంలో అలసత్వం లేకుండా పనిచేయాలని, భూసేకరణ సహా ఇతర పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే, హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)పై గుర్తించిన 17 బ్లాక్‌స్పాట్స్



(ప్రమాదాలు జరుగుతు న్న ప్రాంతాలు) వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. బ్లాక్‌స్పాట్ ప్రాంతాల వద్ద పనులు చేపట్టే విషయంలో ఏమైనా లోటుపాట్లు ఉంటే.. స్పెషల్ సెక్రటరీతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. కాగా, రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వానలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేయడంతోపాటు ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పంటల బీమాకు బయోమెట్రిక్

ధ్రువీకరణ కోసం రైతుల నుంచి బయోమెట్రిక్ సేకరణ.. పంట రకం పక్కాగా ఉండేందుకే..

- రైతులతో డిక్లరేషన్ తీసుకున్నాకే ఇన్సూరెన్స్ చేసే యోచన
- ఉచిత పంటల బీమా పథకంపై వ్యవసాయశాఖ కసరత్తు



హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): రానున్న వానాకాలం నుంచి రాష్ట్రంలో అమలుచేయనున్న ఉచిత పంటల బీమా పథకంపై వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో పంటల బీమా పథకాలు ఎలా అమలవుతున్నాయి? ఇక్కడ పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా ఎలా అమలుచేయాలి? అనే అంశాలపై రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్‌లోని క్రాప్ ఇన్సురెన్స్ విభాగం అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలోనే సాగుచేసిన పంటల ధ్రువీకరణకు రైతుల బయోమెట్రిక్ తీసుకోవాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖ క్రాప్ బుకింగ్ పోర్టల్‌ను పకడ్బందీగా అమలుచేస్తోంది. మండలాలను క్లస్టర్లుగా విభజించి.. ఏఈవోలతో క్రాప్ బుకింగ్ చేయిస్తున్నారు. అది ఏ సర్వే నంబరు? అక్కడ ఏ పంట వేశారు? పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు, రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లు ప్రారంభమైన మొదటి రోజు నుంచి పంటల సాగు ముగిసే చివరి రోజు వరకు క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. ప్రతి ఏఈవో.. తన దగ్గర ఉన్న ట్యాబ్‌లో పంటల సాగు వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ మేరకు ఏ పంట ఎన్ని ఎకరాల్లో సాగైంది? సుమారు ఉత్పత్తి ఎంత వస్తోంది? పంటల కొనుగోళ్లు చేపడితే... ఏర్పాట్లు ఏమేరకు చేయాలి? అనే అంశాలపై అవగాహనకు క్రాప్ బుకింగ్ యాప్ ఉపయోగపడుతుంది. అయితే ఇప్పటివరకు ఈ యాప్‌ను ఏఈవోలే నిర్వహిస్తున్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేయటానికి క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో నమోదైన విస్తీర్ణాన్నే పరిగణనలోకి తీసుకోవాలని ఇప్పటికే వ్యవసాయశాఖ నిర్ణయించింది. అయితే ఏ పంటలు వేశారో నిర్ధారించుకోవటానికి మాత్రం రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటే మేలనే అభిప్రాయానికి వ్యవసాయశాఖ అధికారులు వచ్చారు. ఇది గందరగోళానికి తావివ్వకుండా వాస్తవ పంట నష్టాన్ని లెక్కించేందుకు ఉపకరిస్తుందని అంటున్నారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టం సంభవించినప్పుడు క్షేత్రస్థాయిలో పత్తి పంట నష్టపోయి... పోర్టల్‌లో మొక్కజొన్న పంట నమోదుచేసి ఉంటే సమస్యలు వస్తాయని, ఏఈవోలే తమకు తెలియకుండా తమ ఇష్టానుసారంగా పంటల నమోదుచేశారని రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశం ఉంటుందనే చర్చ జరిగింది. ఈ సమస్య అధిగమించడానికి రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకొని, డిక్లరేషన్ తీసుకుంటే... ఏ సమస్యా ఉండదని, ఏఈవో- ఫార్మర్ కాన్సెంట్‌తో క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో వివరాలు నమోదుచేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని కొందరు వ్యవసాయశాఖ అధికారులు వ్యక్తం చేసినట్లు సమాచారం. పంటచేనుకు వెళ్లి అక్షాంశాలు, రేఖాంశాలను పరిగణనలోకి తీసుకొని క్రాప్ బుకింగ్ చేయనున్నారు. ఈ అంశంపైనా సమగ్రంగా చర్చించిన తర్వాతే విధివిధానాలు రూపొందించనున్నారు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలవుతుంది. ఆలోపే పంటల బీమాకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించటం, ఇన్సురెన్స్ కంపెనీలు సంప్రదించటం, ప్రీమియంను నిర్ధారించటం, ప్రభుత్వం బడ్జెట్‌ను విడుదలచేయటం చేయాల్సి ఉంటుంది.

సుమారు కోటి 30 లక్షల ఎకరాలకు ఉచిత బీమా

రేవంత్‌రెడ్డి సర్కారు రాష్ట్రంలో ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. కేంద్రం అమలుచేస్తున్న ఫసల్ యోజనతో వచ్చే ప్రయోజనాలను వినియోగించుకోవటంతోపాటు... రైతులపై ఎలాంటి భారం పడకుండా క్రాప్ ఇన్సురెన్స్ పథకాన్ని అమలుచేయనుంది. అంటే... రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే పంటలకు ప్రీమియం చెల్లిస్తుంది. రైతులు నయాపైసా చెల్లించాల్సిన అవసరంలేదు. ప్రకృతి విపత్తులతో పంటలు నష్టపోతే బీమా కంపెనీల నుంచి నష్ట పరిహారం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ధరణి రికార్డుల ప్రకారం.. రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో మొత్తం సాగవటం లేదు. 2021-22 ఖరీఫ్‌లో 1.30 కోట్ల ఎకరాలు, 2022-23 లో 1.36 కోట్ల ఎకరాలు, 2023-24 లో 1.26కోట్ల ఎకరాల్లో... పంటలు సాగయ్యాయి. ఈ లెక్కన వచ్చే ఖరీఫ్‌లోనూ 1.30-1.35 కోట్ల ఎకరాలకు పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

టీఎస్ఎప్‌సెట్ ఫలితాలు నేడే

ఉదయం 11 గంటలకు విడుదల

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): టీఎస్ ఎప్‌సెట్ ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు జేఎన్‌టీయూ(జే-హబ్) ఆడిటోరియంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎప్‌సెట్ కన్వీనర్ డీన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సమావేశమైన సెట్ కమిటీ సభ్యులు ఫలితాల వెల్లడికి ఆమోదం తెలపడంతో ఎప్‌సెట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎప్‌సెట్ పరీక్షలు రాసిన అభ్యర్థులు తమ ఫలితాలకు సంబంధించిన ర్యాంకు కార్డులను శనివారం ఉదయం 11.15 గంటల తర్వాత టీఎస్ఎప్‌సెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కో కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగిన ఎప్‌సెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) పరీక్షలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 3.35 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.

టీఎస్‌పీజీఈసెట్ పరీక్షల తేదీల్లో మార్పు

ఎంటెక్, ఎంఫార్మసీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్‌పీజీఈసెట్) తేదీలను మార్చారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నేపథ్యంలో జూన్ 6 నుంచి 9వరకు జరగాల్సిన పీజీఈసెట్ పరీక్షలను జూన్ 10 నుంచి 13వరకు నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్9న రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నారు.

ఒడిసాలో భట్టి విస్తృత ప్రచారం

- మూడ్రోజులుగా సభలు, సమావేశాలు
- యూపీలో ర్యాలీని ప్రారంభించిన సీతక్క

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఒడిసాలో ఐదో దశ ఎన్నికలు జరిగే లోక్‌సభ నియోజక వర్గాల్లో డిప్యూటీ సీఎం భట్టి విస్తృత ప్రచారం చేపట్టారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు ఆయన ఒడిసాలోనే మకాం వేసి పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ పోలింగ్ ముగిసిన అనంతరం మంగళవారమే ఆయన ఢిల్లీకి వెళ్లారు. బుధవారం అక్కడి నుంచి ఏఐసీసీ అగ్రనేతలతో పాటుగా ప్రత్యేక విమానంలో ఒడిసాకు వెళ్లిన భట్టి.. బోలాంగిరి పరిధిలో నిర్వహించిన ఎన్నికల సభలో పాల్గొన్నారు. గురువారం భువనేశ్వర్‌కు చేరుకుని సోషల్ మీడియా నిర్వాహకులతో సమీక్షించారు. శుక్రవారం పుల్బనీలో జరిగిన బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి పాల్గొన్నారు. మరోవైపు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రచారం నిర్వహించారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కూచికుల్ల రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, గద్వాల జెడ్పీ ఛైర్‌పర్సన్ సరిత రాయ్‌బరేలీకి తరలివెళ్లారు. అక్కడ ఇండియన్ యూత్ కాంగ్రెస్ బైకు ర్యాలీకి ముఖ్యఅతిథిగా హాజరైన సీతక్క.. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాహుల్ ప్రధాని అయితే ప్రతీ మహిళకు ఏడాదికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాగా, రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి విపత్తు నిధులు తేవాలని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి సూచించారు. అప్పుడే తెలంగాణ ప్రజలు హర్షిస్తారన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. ఓట్ల ఆరాటం తప్ప వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఏదైనా చేయాలన్న ఆలోచనే బీజేపీకి లేదని విమర్శించారు.

కేఏ పాల్‌పై కేసు నమోదు

- టికెటిస్తానని 56 లక్షలు తీసుకున్నారంటూ వ్యక్తి ఫిర్యాదు

పంజాగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై చీటింగ్ కేసు నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఎల్బీనగర్ టికెటిస్తానని చెప్పి కేఏ పాల్ రూ.56 లక్షలు తీసుకుని మోసం చేశారంటూ కిరణ్‌కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా జిల్లెలగూడకు చెందిన కిరణ్ కుమార్ రెడ్డి గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించాడు. ఈ నేపథ్యంలో కేఏ పాల్‌ను సంప్రదించి ఎల్బీనగర్ టికెట్ ఇవ్వాలని కోరాడు. అయితే తనకు రూ.56 లక్షలు ఇవ్వాలని పాల్ అడగ్గా.. కిరణ్ ఆన్‌లైన్, ఇతర మార్గాల ద్వారా డబ్బు చెల్లించాడు. అయినా అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదు. డబ్బులు కూడా తిరిగివ్వలేదు. పలు మార్లు సంప్రదించినా ఫలితం లేకపోవడంతో కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆనంద్ సినీ సర్వీసెస్‌కు భూకేటాయింపు సబబే

- హైకోర్టు తీర్పు
- హరీశ్‌రావు పిటిషన్ కొట్టివేత
- ఆయన మంత్రిగా ఉన్నప్పుడూ దర్శకునికి భూములు ఇచ్చారన్న ప్రతివాదులు

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో నిరాశ ఎదురయింది. ఆనంద్ సినీ సర్వీసెస్‌కు జూబ్లీహిల్స్‌లో అయిదెకరాల భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ ఆయన 2008లో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఆనంద్ సినీ సర్వీసెస్‌కు గోల్కొండ తాలూకా షేక్‌పేట్ గ్రామం సర్వే నెంబర్ 403లో ఎకరం రూ.8,500 చొప్పున అయిదెకరాల భూమిని కేటాయిస్తూ 2001లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 355 జారీచేసింది.. ఆ తర్వాత 2002లో ఈ భూకేటాయింపును ప్రభుత్వం నిలిపివేసింది. దానిని తన ఆధీనంలోనే పెట్టుకుంది. ఆ నిర్ణయాన్ని మళ్లీ 2008 డిసెంబర్ 26న ఉపసంహరించుకుంది. అదే భూమిని ఏపీ స్టేట్ ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఆనంద్ సినీసర్వీసెస్‌కు సేల్‌డీడ్ చేయించింది. ఈ మేరకు నూతనంగా 744 జీవో జారీ అయింది. కొత్త జీవోలో భూకేటాయింపు ఉద్దేశాలను సవరించింది. ఈ రెండు జీవోలను సవాల్ చేస్తూ హరీశ్‌రావు 2008లో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ హరీశ్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఎకరా ధరను కేవలం రూ. 8,500లుగా నిర్ణయించారని, మంత్రివర్గం ఆమోదం లేకుండా.. ఎలాంటి ప్రాజెక్టు రిపోర్టు అడగకుండా అత్యంత సాధారణ షరతులతో భూమి కేటాయించారని తెలిపారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ సినీపరిశ్రమ అభివృద్ధి కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు విధానపర నిర్ణయం తీసుకున్నాయని



తెలిపారు. ఆ విధానంలో భాగంగానే 1982లో ఏపీఎస్ఎఫ్‌డీసీకి 50 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు.

ఆనంద్ సినీ సర్వీసెస్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ చెన్నై నుంచి సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకురావడానికి 1982 నుంచి ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని పేర్కొన్నారు. పిటిషనర్ అయిన హరీశ్‌రావు రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు 2019లో దర్శకనిర్మాత ఎన్.శంకర్‌కు జీవో నెంబర్ 75 ద్వారా అయిదెకరాల స్థలం కేటాయించిందని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. 2001లో జారీఅయిన భూకేటాయింపు జీవో 355ను చాలా ఆలస్యంగా ఏడేళ్ల తర్వాత సవాల్ చేశారని, దీనికి సరైన వివరణ లేదని పేర్కొంది. ఇలాంటి విషయాలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో తుది తీర్పులు వచ్చాయని తెలిపింది. అందువల్ల ఈ పిటిషన్‌ను సమర్థించలేమని పేర్కొంటూ కొట్టేసింది.

అభ్యర్థుల కంటే అధికారుల ఖర్చే ఎక్కువ!

- అసెంబ్లీ ఎన్నికల వ్యయం 701కోట్లు
- నియోజకవర్గానికిసగటున 5.9 కోట్లు
- కొన్ని చోట్ల ఏకంగా రూ.10కోట్ల ఖర్చు
- కలెక్టర్ల అదనపు నిధులకైతే లెక్కేలేదు
- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వెల్లడి

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నవంబరు 30వ తేదీన జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అక్షరాలా రూ.701 కోట్ల ప్రజాధనం ఖర్చు చేశారు. అంటే, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకుగాను సగటున ఒక్కో నియోజకవర్గంలో రూ.5.9 కోట్లు అధికారులు ఖర్చు చేశారు. కొన్ని నియోజకవర్గాల్లోనైతే ఇది ఏకంగా రూ.10 కోట్లకు కూడా చేరింది. విశేషమేమిటంటే, ఒక్కో నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల (కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ) అభ్యర్థులు ముగ్గురు చేసిన వ్యయం (గరిష్ఠంగా రూ.1.2 కోట్లు) కన్నా అధికారులు చేసిన వ్యయం ఎన్నో రెట్లు ఎక్కువ ఉండటం గమనార్హం. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థులు, అధికారులు చేసిన వ్యయాన్ని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' (ఎఫ్‌జీజీ) సంస్థ విశ్లేషించింది. ఆ వివరాలను సంస్థ కార్యదర్శి పద్మనాభరెడ్డి వెల్లడించారు. శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 357 మంది అభ్యర్థులు పోటీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎంఐఎం పోటీచేసిన 9 స్థానాలనూ లెక్కలోకి తీసుకుంటే మొత్తం అభ్యర్థుల సంఖ్య 366. ఈసీకి వీరు సమర్పించిన వివరాల ప్రకారం సగటున వీరి ఎన్నికల ఖర్చు రూ.30 లక్షలు దాటలేదని ఎఫ్‌జీజీ తెలిపింది. అనేక మంది కోట్లలో చేసిన ఖర్చుకు.. ఈసీకి సమర్పించిన లెక్కలకు ఏమాత్రం పొంతన లేదని పేర్కొంది. పలుచోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు రూ.20 లక్షల లోపే ఖర్చు సమర్పించారని తెలియజేసింది. అయితే, ఎన్నికల వేళ అధికారులు ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారని వెల్లడించింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి సగటున రూ.5.9 కోట్ల చొప్పున రూ.701 కోట్లు విడుదల చేసింది. దీనికి తోడు జిల్లాల కలెక్టర్లు కేటాయించిన నిధులను అదనంగా ఖర్చు చేశారని తేలింది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వపరంగా అయిన వ్యయం వివరాలను అందించాలని తాము ఆర్టీఐ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లను కోరినా.. వారినుంచి సమాధానం రాలేదని పద్మనాభరెడ్డి తెలిపారు. ఖర్చు సమాచారం అందించాలని కలెక్టర్లు ఆర్డీవోలకు, ఆర్డీవోలు తహశీల్దార్లకు ఆదేశాలు పంపించారని, కానీ దరఖాస్తు చేసి మూడు నెలలు గడుస్తున్నా తహసీల్దార్ల నుంచి ఎలాంటి సమాచారం రాలేదన్నారు. చివరికి రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శిని దీనిపై అడిగినప్పుడు.. బడ్జెట్ నుంచి రూ.701 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారని వెల్లడించారు. ఈ వ్యయం ఎలా జరిగిందని తాము పరిశీలించామని పద్మనాభరెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు కోసం నియమితులైన పరిశీలకులు, వారితోపాటు ఎన్నికల విధుల్లో ఉన్న ఇతర ఉన్నతాధికారులు ఇష్టారీతిన ఖర్చు చేశారని, ఎన్నికల వ్యయంపై ఆడిట్ లేకపోవడంతో విచ్చలవిడి ఖర్చును ప్రశ్నించేవారే లేకుండా పోయారన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అధికారుల ఖర్చు రూ. 8-10 కోట్ల వరకు చేరిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ వ్యయంలో పారదర్శకతకు, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అసెంబ్లీ ఎన్నికల వ్యయంపై ఆడిట్ నిర్వహించాలని, వివరాలను వెబ్‌సైట్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.

వచ్చే రెండు వారాలు భారీ వర్షాలు..!

- దేశవ్యాప్తంగా వానలు: ఐఎండీ

న్యూఢిల్లీ, మే 17: రానున్న రెండు వారాల్లో దేశవ్యాప్తంగా ఓ మోస్తరు, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు ఈ నెల 19 నాటికే దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ ఇటీవలే తెలిపింది. తుఫాను వాతావరణ ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, లక్షద్వీప్, దక్షిణ కర్ణాటకలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. దీని ప్రభావంతో రానున్న ఏడు రోజుల్లో కోస్తాంధ్ర, యానాం, తెలంగాణ, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ప్రాజెక్టులకు స్వల్ప వరద

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు స్వల్ప వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్‌కు 2,315 క్యూసెక్కుల వరద రాగా.. అన్నారం బ్యారేజీకి 1,000 క్యూసెక్కులు, మేడిగడ్డకు 950 క్యూసెక్కులు, తుపాకులగూడెం (సమ్మక్కసాగర్)కు 300 క్యూసెక్కులు, దుమ్ముగూడెం (సీతమ్మ సాగర్)కు 200 క్యూసెక్కుల వరద వచ్చింది. కృష్ణా బేసిన్‌లోని నారాయణపూర్ ప్రాజెక్టుకు 2,047 క్యూసెక్కులు, జూరాలకు 2,561 క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 934 క్యూసెక్కులు, పులిచింతలకు 289 క్యూసెక్కుల వరద వచ్చింది.

ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

» అధికారులు ప్రతిపాదనలు తెప్పించుకోవాలి:తుమ్మల



హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, ఉద్యాన పంట ఉత్పత్తులను ప్రోత్సహించటానికి, రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేందుకుగాను ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ప్రతిపాదనలు తెప్పించుకొని, తక్షణమే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపయోగంగా ఉన్న ఫుడ్ పార్కుల్లో ఖాళీ స్థలాలు గుర్తించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటు పెట్టుబడిదారులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత సమయంలో పంపిణీ చేయాలని సూచించారు. ఒకవేళ ప్రైవేటు మార్కెట్లు వస్త్రాలు కొనుగోలుచేయాల్సి వస్తే.. టెస్కో నుంచి 'నాన్ అవైలబులిటీ' సర్టిఫికెట్ తీసుకోవాలని ట్రెజరీలు, శాఖలు, కార్పొరేషన్లకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, జౌళి శాఖల్లో ఒకేరకమైన పనితీరు కలిగిన కార్పొరేషన్లను సంఘటితపర్చి ఒకే కార్పొరేషన్ ఏర్పాటుచేసి బలోపేతం చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తే.. ముఖ్యమంత్రి ఆమోదానికి పంపిస్తామని మంత్రి తెలిపారు.

వేలకోట్ల పెట్టుబడులు తీసుకొస్తాం

» ప్రపంచస్థాయి ప్రమాణాలతో మూసీ అభివృద్ధి

» మెట్రో ప్రాజెక్టును విస్తరిస్తాం: ఉత్తమ్, శ్రీధర్‌బాబు





హైదరాబాద్ సిటీ, మాదాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల కాలంలోనే రాష్ట్రానికి సుమారు 20వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా ఒప్పందాలు జరిగాయని, వచ్చే నాలుగేళ్లలో వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ మహానగర రియల్ ఎస్టేట్ అభివృద్ధికి దోహదపడేవిధంగా మెట్రో రైలును శివారు ప్రాంతాలకు విస్తరిస్తామని, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మూసీ నదిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ (ఐజీబీసీ) ప్రాపర్టీ షోను శుక్రవారం మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో హరితభవనాల అవసరం చాలా ఉందన్నారు. గ్రీన్ బిల్డింగ్ పద్ధతి రాష్ట్రానికి, దేశానికి ఎంతో అవసరమని, ఈ పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, హైదరాబాద్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. నాలుగేళ్లలో రాష్ట్రంలో ఐటీ రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేస్తామని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కొత్త పాలసీలు తెచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నామని, దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు వెళుతున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఐటీ రంగంలో వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, దీనివల్ల ఉద్యోగాలతో పాటు పరోక్షంగా ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సులభతర వాణిజ్య విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు.

విద్యార్థులకు పుస్తకాలు అందేలా చూడండి:సీఎస్

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను తెరిచే రోజు(జూన్ 12)న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, ఒక జత యూనిఫామ్ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనుల పురోగతి, వరి ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై శుక్రవారం సచివాలయం నుంచి ఆమె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

గనుల శాఖ కార్యదర్శిగా సురేంద్ర మోహన్

రాష్ట్ర భూగర్భగనుల శాఖ కార్యదర్శిగా 2006 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తమిళిసై గవర్నర్‌గా ఉన్నప్పుడు సురేంద్ర మోహన్ రాజ్‌భవన్ సెక్రటరీగా పనిచేశారు. తమిళిసై గవర్నర్ బాధ్యతల నుంచి వైదొలగగానే ప్రభుత్వం ఆయనను బదిలీ చేసి వెయిటింగ్‌లో పెట్టింది. ప్రస్తుతం ఆయనకు పోస్టింగ్ ఇవ్వడంతో పాటు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే ఇప్పటి వరకు భూగర్భ గనుల శాఖ కార్యదర్శిగా, ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా ఉన్న బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కాను ఆ పోస్టు నుంచి రిలీవ్ చేసి, సాధారణ పరిపాలనా శాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు అందుబాటులోకి

ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి.

తిరుమలలో సర్వదర్శనానికి 30 గంటలు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ మీదుగా రింగ్‌రోడ్డులో శిలాతోరణం వరకు దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల మేర వ్యాపించింది. వీరికి 30 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది. గదులకు డిమాండ్ కొనసాగుతోంది. కల్యాణకట్టలు కూడా భక్తులతో రద్దీగా కనిపించాయి. అలిపిరి చెక్ పాయింట్‌లోనూ భద్రతా తనిఖీల నేపథ్యంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.



పలమనేరు అడవుల్లో అరుదైన గోల్డెన్ బ్యాక్డ్ ఫ్రాగ్

ఎప్పుడో రెండు శతాబ్దాల క్రితం కనుమరుగైన ఓ అరుదైన జాతి కప్పను పరిశోధకులు తాజాగా గుర్తించారు. శ్రీలంక గోల్డెన్ బ్యాక్డ్ ఫ్రాగ్ (శాస్త్రీయ నామం హైలా రానా గ్రాసిలిస్) అని పిలిచే ఈ కప్పను చిత్తూరు జిల్లా పలమనేరు కౌండిన్య అటవీ ప్రాంతం సమీపంలో గౌనితిమ్మేపల్లి వద్ద ఓ కుంటలో గుర్తించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్శిటీ బోర్డుకు చెందిన పరిశోధకులు దీన్ని గుర్తించారు. శ్రీలంకలో ఎక్కువగా కనిపించే ఈ కప్ప వీపుపై బంగారు వర్ణం కలిగి, ఎక్కువ భాగం నలుపు రంగుతో ఉంటుంది. భారత ఉపఖండంలో ఇప్పటి వరకు 19 రకాల గోల్డెన్ బ్యాక్డ్ ఫ్రాగ్స్ గుర్తించారని పరిశోధకులు తెలిపారు. - మంగళం

'మాఫీ'కి మార్గమిదీ!

(మొదటిపేజీ తరువాయి)

రైతులు తీసుకున్న పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయనుంది. మాఫీ కోసం తీసుకున్న రూ.32వేల కోట్లను వాయిదాల పద్ధతిలో బ్యాంకులకు ప్రభుత్వం చెల్లించనుంది. అయితే ఎఫ్‌డబ్ల్యూసీకి చట్టబద్ధత తప్పనిసరి. అందుకే.. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదం తీసుకొని కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పిస్తారు. రుణమాఫీ కోసం తీసుకున్న అప్పును నెలవారీ వాయిదాల్లో 10-15 ఏళ్లలో కార్పొరేషన్ ద్వారానే బ్యాంకులకు సర్కారు చెల్లించనుంది. ఇందుకు హామీగా ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నుల రూపేణ ఆదాయాన్ని చూపనుంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రూ.2 లక్షల రుణమాఫీ పథకం అత్యంత కీలకమైనది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై దృష్టిసారించారు. ఈనెల 15వ తేదీన సమీక్ష కూడా నిర్వహించారు. కాగా రుణమాఫీకి సంబంధించి రాజస్థాన్, మహారాష్ట్ర సహా ఇతరా రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలపై అధ్యయనం చేయాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. రాజస్థాన్‌లో అప్పటి అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం కూడా రూ. 2 లక్షల రుణమాఫీ పథకాన్ని అమలుచేసింది. రూ. 18 వేల కోట్ల రుణాలను మాఫీ చేసింది. అయితే అక్కడ 2 హెక్టారు_(5 ఎకరాల) వరకు పరిమితి విధించుకొని అమలుచేశారు. 2014లో ఏపీలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం.. రైతు సాధికార సంస్థను ఏర్పాటుచేసి రుణమాఫీ ప్రక్రియ చేపట్టింది. ఆ తర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం కూడా 'ఎస్‌డీసీ'(స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఏర్పాటుచేసి రుణమాఫీ పథకాన్ని అమలుచేసింది. రేవంత్ కూడా రుణమాఫీ కోసం ఈ పంథాలోనే ఆలోచన చేసి ఎఫ్‌డబ్ల్యూసీ ఆలోచన చేశారు. కాగా ఆగస్టు-15 వరకు రుణమాఫీ ప్రక్రియ పూర్తయితే... ఖరీఫ్ కోసం రైతులకు కొత్త రుణాలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

సెక్షన్- 8 కింద కార్పొరేషన్ ఏర్పాటు

రైతు సంక్షేమ కార్పొరేషన్‌ను కంపెనీల చట్టం సెక్షన్-8 కింద ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. లాభాపేక్ష లేని(నాన్ ప్రాఫిట్) కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయడానికి సెక్షన్-8 ఉపయోగపడుతుంది. రైతు సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధిని కారణాలుగా చూపించి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తారు. ఈ కార్పొరేషన్ పేరిట రెండు బ్యాంకు ఖాతాలు తెరుస్తారు. ఇవికూడా ట్రెజరీలోనే ఉంటాయి. రెగ్యులర్ అకౌంట్‌తోపాటు 'ఎస్క్రో'(ఈఎస్‌సీఈఆర్‌వో) అకౌంట్‌ను ఏర్పాటుచేస్తారు. ఈ ఎస్క్రో అకౌంట్‌లోనే ప్రతినెలా చెల్లించాల్సిన వాయిదాలకు సరిపడా నిధులు జమచేస్తారు. ఈ అకౌంట్ నుంచి నేరుగా బ్యాంకులకు 'ఈఎంఐ' వెళ్లిపోయేలా ప్రత్యేకంగా యంత్రాగాన్ని తయారుచేస్తారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వచ్చే ఆదాయాన్ని, పంట ఉత్పత్తుల అమ్మకాలపై మార్కెట్ సెస్ రూపంలో వచ్చే ఆదాయాన్ని కార్పొరేషన్‌కు బదిలీ చేయొచ్చు. అయితే ఇది సరిపోదు. సర్కారుకు ఏడాదికి ఆబ్కారీ శాఖ నుంచి సుమారు రూ. 20 వేల కోట్లు, జీఎస్టీ ద్వారా సుమారు రూ. 51 వేల కోట్లు, సేల్స్ ట్యాక్స్ ద్వారా రూ. 40 వేల కోట్లు, స్టాంపులు- రిజిస్ట్రేషన్ల ద్వారా సుమారు రూ. 19 వేల కోట్ల ఆదాయం వస్తుంది. ఇందులోంచి నెలవారీగా కొంత కార్పొరేషన్‌కు బదిలీ చేసి, చెల్లించేలా ప్రణాళిక రూపొందిస్తోంది.

రుణమాఫీయే అజెండా!

నేడు కేబినెట్ భేటీలో దీనిపైనే ప్రధాన చర్చ.. నిధుల సమీకరణపై చర్చించనున్న మంత్రివర్గం

» అజెండాలో విభజన సమస్యలు

» భూముల రిజిస్ట్రేషన్ చార్జీల సవరణ


» మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై చర్చ

» సమావేశం నిర్వహణకు ఈసీకి లేఖ

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట రుణాలను ఆగస్టు 15 లోపు మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకోసం ఆదాయ మార్గాలను అన్వేషిస్తోంది. రుణమాఫీ అంశమే ప్రధాన అజెండాగా శనివారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశమవుతోంది. ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం కేబినెట్ భేటీ ప్రారంభం కానుంది. అయితే రాష్ట్రంలో ఇప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. పార్లమెంటు ఎన్నికలు ముగిసినా.. కౌంటింగ్ ప్రక్రియ మిగిలే ఉన్నందున కేబినెట్‌లో ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడానికి వీలుండదు. అందుకే మంత్రివర్గ సమావేశ నిర్వహణకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. అనుమతి రావడం లాంఛనమేనని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, కేబినెట్ సమావేశంలో ప్రధానంగా రుణమాఫీ పథకంతోపాటు విభజన సమస్యలు, రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీల సవరణ, ఆదాయ వనరుల సమీకరణ, ధాన్యం కొనుగోళ్ల పురోగతి, వానాకాలం పంట ప్రణాళిక, మేడిగడ్డ బ్యారేజీపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన మధ్యంతర నివేదిక, విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పంపిణీ, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తదితర అంశాలు చర్చకు రానున్నాయి.

రెండు నెలల తరువాత కేబినెట్ భేటీ..

నిజానికి రెండు నెలల సుదీర్ఘ విరామానంతరం కేబినెట్ సమావేశం కాబోతోంది. మార్చి 12న జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రతి నియోజకవర్గానికి 3,500పక్కా ఇళ్లను కేటాయిస్తూ మొత్తం 4.5లక్షల ఇళ్లు మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు రావడంతో పాలనపై ప్రభుత్వం పెద్దగా దృష్టి పెట్టలేకపోయింది. ఎన్నికలు పూర్తి కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి సహా అధికార యంత్రాంగం తిరిగి పాలన వ్యవహారాల్లో నిమగ్నమైంది. ఈ నేపథ్యంలోనే కేబినెట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భేటీలో.. రుణమాఫీ కోసం నిధుల ఆవశ్యకత, సమీకరణ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై దృష్టి సారించనుంది. ఈ పథకం కింద ఎంత మంది రైతులు అర్హులవుతారు, ఎంత మేర నిధులను సర్దాలి, ప్రస్తుతం నెలవారీగా ఖజానాలో మిగులుతున్న నిధులెన్ని వంటి వివరాలను కేబినెట్‌లో సమీక్షించనున్నారు. అనంతరం రుణమాఫీపై ప్రకటన చేసే అవకాశం ఉంది. ఇక ప్రభుత్వం ముందున్న మరో ప్రధాన సమస్య.. విభజన అంశాలు. రాష్ట్ర విభజన జరిగి ఈ జూన్ 2తో పదేళ్లకాలం పూర్తవుతుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూలు 9లో ఉన్న 91 కార్పొరేషన్లు, షెడ్యూలు 10లోని 142 సంస్థలు, అకాడమీలు, యూనివర్సిటీల ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల పంపిణీ ఇంకా పూర్తిగా కొలిక్కిరాలేదు. ముఖ్యంగా కార్పొరేషన్ల అప్పులు, ఆస్తుల పంపిణీ పెద్ద చిక్కుముడిగా ఉంది. ఆర్టీసీ, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, పౌర సరఫరాల సంస్థలు, విద్యుత్తు సంస్థల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. వీటిని పరిష్కరించుకోవడానికి అనుసరించాల్సి విధానంపై కేబినెట్‌లో చర్చించనున్నారు.



ఆదాయ మార్గాల అన్వేషణపై చర్చ..

రుణమాఫీ పథకానికి నిధుల సమీకరణ ప్రయత్నాల్లో ఉన్న ప్రభుత్వం.. ఇందుకోసం రాష్ట్రంలోని భూములు, స్థలాల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీలను సవరించాలని యోచిస్తోంది. దీనిపై అధ్యయనం చేయాల్సింగా అధికారులను సీఎం ఆదేశించారు. అయితే.. ఈ విలువలను పెంచితే ఎంతమేర పెంచాలి? ఎంత ఆదాయం సమకూరుతుంది? అన్న అంశాలు చర్చకు వచ్చే అవకాశాలున్నాయి. ఇతర ఆదాయ వనరుల సేకరణపైనా చర్చించనుంది. గనుల సీనరేజీ చార్జీలు, రాయల్టీలను పెంచడంపైనా దృష్టి పెట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ కొనుగోళ్ల పురోగతిని సమీక్షిస్తూనే.. మిగిలిన ధాన్యాన్ని త్వరలో కొనుగోలు చేయడం, కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు, వచ్చే వానాకాలం సీజన్‌కు పంట విధానంపై కేబినెట్ చర్చిస్తుంది. కాగా, కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మరమ్మతులపై ఇటీవలే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మధ్యంతర నివేదిక సమర్పించింది. ఈ నివేదికలోని సిఫారసులు, తదుపరి కార్యాచరణపై కేబినెట్ భేటీలో చర్చిస్తారు. జూన్ 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పంపిణీ తదితర అంశాలను చర్చించనున్నారు. మరోవైపు వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో.. ఎన్నికల వ్యూహం, ప్రచారంపైనా చర్చించే అవకాశాలున్నాయి.

టీఎస్ స్థానంలో టీజీ

» పీఎస్‌యూలు, ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలు.. 'పేర్లు' మార్చుకోవాల్సిందే

» అధికారులకు సీఎస్ ఆదేశాలు

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇప్పటిదాకా తెలంగాణ రాష్ట్ర అబ్రివియేషన్‌ను సూచించే 'టీఎస్' స్థానంలో 'టీజీ'ని వినియోగించేందుకు కేంద్రం అనుమతి లభించింది. గత మార్చి నెలలో వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అనుమతులు రాగా.. తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్‌కు బదులుగా టీజీని వినియోగించేందుకు ఓకే చెప్పింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థలు, పీఎస్‌యూలు, ఏజెన్సీల పేర్ల ముందు 'టీఎస్'కు బదులు 'టీజీ' చేరనుంది. ఉదాహరణకు టీఎస్‌పీఎస్సీ పేరు టీజీపీఎస్సీగా, టీఎస్ఎస్పీడీసీఎల్ పేరు టీజీఎస్పీడీసీఎల్‌గా, టీఎస్ఎన్పీడీసీఎల్ పేరు టీజీఎన్పీడీసీఎల్‌గా, టీఎస్ఆర్టీసీ పేరు టీజీఆర్టీసీగా మారిపోనున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల నుంచి స్టేషనరీ మెటీరియల్ దాకా అన్ని చోట్ల 'టీజీ'నే ముద్రించనున్నారు. ఈ మేరకు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఎండీలకు ఆదేశాలు జారీ చేస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఒక సర్క్యులర్ జారీ చేశారు. పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తి గల సంస్థలు, ప్రభుత్వ సంస్థలన్నీ ఇకపై వాటి పేర్లను 'టీజీ'తో ప్రారంభమయ్యేలా మార్చుకోవాలని సూచించారు. లెటర్‌హెడ్‌లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీని పొందుపర్చుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్వహించే అంతర్గత, బాహ్య ఉత్తర ప్రత్యుత్తరాలతోపాటు స్టేషనరీ మెటీరియల్‌పైనా టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని సూచించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై ఈ నెల 31లోపు నివేదిక పంపాలని అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు.

పరిశీలన పూర్తి.. పరిష్కారమెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)


ధరణి పోర్టల్, కలెక్టర్ల లాగిన్‌లో కుప్పలు తెప్పలుగా పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణి దరఖాస్తుల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. దీనిపై నిపుణులతో ఓ ప్రత్యేక కమిటీని వేశారు. కమిటీ సూచనల మేరకు ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని పరిశీలించి అప్రూవ్, లేదా రిజెక్ట్ చేసేందుకు సంబంధిత నివేదికలు సైతం సిద్ధం చేసి ఉంచారు. వీలైనంత త్వరలో వీటిని పరిష్కరిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం హామీ ఇచ్చారు. ఇంతలోనే మార్చి 16న లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడడంతో.. ధరణి దరఖాస్తుల పరిశీలన, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్లు ఆపేశారు. నోటిఫికేషన్ జారీ నుంచి ఇప్పటి వరకు వాటి జోలికే వెళ్లలేదు. రెవెన్యూ యంత్రాంగమంతా బిజీగా ఉందంటూ ఒక్క ఫైలును కూడా ముట్టుకోలేదు. దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ధరణి కమిటీ సైతం గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శనివారం కమిటీ సమావేశం కానుంది. స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాల్సిన అధికారులు..గత ప్రభుత్వంలో మాదిరిగానే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిష్కరించాల్సిన దరఖాస్తులు ఇలా..

ధరణిలో వివిధ రకాల భూ సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. మొత్తంగా 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పాస్‌బుక్ డేటా కరెక్షన్ దరఖాస్తులు 1,00,766, గ్రీవెన్స్ ఆన్ ల్యాండ్ మ్యాటర్ దరఖాస్తులు 40,364, అన్‌బ్లాక్ పీపీబీ (పట్టాదార్ పాస్‌బుక్)ఆఫ్ ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ దరఖాస్తులు 26,087, కోర్టు కేసు అండ్ ఇంటిమేషన్ దరఖాస్తులు 27,096, పెండింగ్ మ్యూటేషన్ దరఖాస్తులు 14.991, సక్సేషన్ విత్‌అవుట్ పీపీబీ దరఖాస్తులు 13,943, పీపీబీ త్రూ కోర్టు కేసు దరఖాస్తులు 6,058, నిషేధిత జాబితా దరఖాస్తులు 1,877, నాలా విత్‌అవుట్ పాస్‌బుక్ దరఖాస్తులు 3,590, పీపీబీ లేదా నాలా, హౌజ్‌సైట్, హౌస్ దరఖాస్తులు 1,466, సెమీ అర్బన్ పీపీబీ దరఖాస్తులు 1,198, ఆల్‌రెడీ ఎగ్జిక్యూటెడ్ జీపీఏ దరఖాస్తులు 908, ఆర్గనైజేషన్ పీపీబీ దరఖాస్తులు 482, ఎన్ఆర్ఐ పీపీబీ దరఖాస్తులు 316 ఉన్నాయి.

భూముల విలువలు రెట్టింపు?

(మొదటిపేజీ తరువాయి)



పెంచారు. ఇప్పుడు ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను మాత్రమే సవరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను పెంచడానికి ప్రభుత్వానికి ఒక పద్ధతి ఉంది. ప్రతి జిల్లాలో అదనపు కలెక్టర్, ఆర్డీఓ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేస్తారు. పట్టణాల్లో జేసీ(అదనపు కలెక్టర్), గ్రామీణ ప్రాంతంలో ఆర్డీఓ అధ్వర్యంలో ఈ కమిటీలు పని చేస్తాయి. రాష్ట్ర స్థాయి సలహా కమిటీలో చైర్మన్‌గా కమిషనర్, సభ్యులుగా భూ ఆదాయ కమిషనర్, కన్వీనర్‌గా రిజిస్ట్రేషన్ల విభాగం జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఉంటారు. పట్టణ ప్రాంతాల కమిటీలో చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, సభ్యులుగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, సంబంధిత మున్సిపల్ కమిషనర్, కమిటీ కన్వీనర్‌గా సబ్ రిజిస్ట్రారు ఉంటారు. గ్రామీణ ప్రాంతాల కమిటీలో చైర్మన్‌గా ఆర్డీవో, సభ్యులుగా ఎమ్మార్వో, ఎండీవో, జిల్లా రిజిస్ట్రార్, ఆడిట్ సబ్ రిజిస్ట్రార్, కమిటీ కన్వీనర్‌గా సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ఉంటారు. కంటోన్మెంట్ ప్రాంతాలకు కూడా కమిటీలు ఉంటాయి. కమిటీలు తమ పరిధిలో వ్యవసాయ భూములు, స్థలాలు, అపార్ట్‌మెంట్ల బహిరంగ మార్కెట్ విలువలను, ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ విలువలను పరిశీలిస్తాయి. రెండింటి మధ్య అంతరం తక్కువగా ఉన్న చోట తక్కువ పెంపును సూచిస్తారు. ఎక్కువగా ఉన్న చోట భారీగా పెంపును సిఫార్సు చేస్తారు. వీటిని వీటిని ప్రభుత్వం ఉన్నత స్థాయిలో పరిశీలించి, సవరింపుపై తుది నిర్ణయాన్ని తీసుకుంటుంది. రాష్ట్ర స్థాయి కమిటీల సిఫార్సుల వివరాలు వచ్చిన తర్వాత ఎంత పెంచాలనే దానిమీద ప్రతిపాదనలు రూపొందిస్తారు. వాటిని ప్రభుత్వం ముందు పెడతారు. రాష్ట్ర ప్రజల మీద పడే భారం, తన ఆదాయ అవసరాలను బేరీజు వేసుకొని ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది.

భారీగానే వ్యత్యాసం

రాష్ట్రంలో భూముల ధరల్లో బహిరంగా మార్కెట్‌కు, రిజిస్ట్రేషన్ చార్జీలకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నమాట నిజమే. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలో ఎకర భూమి సుమారు రూ.3 కోట్లకు పైగానే పలుకుతోంది. రిజిస్ట్రేషన్ విలువ చూస్తే రూ.60.90 లక్షలు ఉంది. చేవెళ్ల మండల కేంద్రంలో ఎకరం భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లకు పైగా ఉంది. రిజిస్ట్రేషన్ విలువ రూ.42 లక్షలు. వికారాబాద్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలో ఎకరం ధర రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ.3.75 లక్షలు ఉంటే బహిరంగ మార్కెట్‌లో కోటిన్నరకు పైగా పలుకుతోంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలంలో రిజిస్ట్రేషన్ విలువ ఎకరం రూ.3.77 కోట్లు ఉంటే బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లకు పైగానే ఉంది. ఇలాంటి ప్రాంతాల్లో వంద శాతం పెంచే అవకాశాలు ఉన్నాయి. జూబ్లీహిల్స్‌లో గజం విలువ 3 లక్షలు ఉంటే మార్కెట్ విలువ రూ.90 వేలుగా ఉంది. ఇలాంటి చోట్ల 50 శాతం మేర పెంచే అవకాశాలు ఉన్నాయి. బహిరంగ మార్కెట్ విలువలో రిజిస్ట్రేషన్ విలువ సగానికి మించకుండా ఉండేలా రిజిస్ట్రేషన్ విలువలను సవరించాలని నియమం పెట్టుకున్నా కూడా పలుచోట్ల వంద శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

గ్రూప్-4 పోస్టులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక

» టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో జాబితా

» సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని అధికారుల సూచన

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఈ పోస్టులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వెబ్‌సైట్‌లో జాబితాను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల చొప్పున ఎంపిక చేశారు. వీరికి సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. 1:3 నిష్పత్తి జాబితాలో ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలో 8,039 గ్రూప్-4 ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేయగా.. గత ఏడాది జూలై 1న పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఫలితాలు ప్రకటించారు. ఈ ఫలితాల్లో మొత్తం 7,26,837 మంది అభ్యర్థులకు సంబంధించిన మెరిట్ జాబితాను ప్రకటించారు. ఈ జాబితా ఆధారంగా ప్రస్తుతం ఆయా పోస్టులు, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపిక చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశాక ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థిని ఎంపిక చేయనున్నారు. కాగా వికలాంగుల కోటాలోని పోస్టులకు 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా ప్రకారం త్వరలోనే గ్రూప్-4 పోస్టులను భర్తీ చేయాలని కమిషన్ అధికారులు భావిస్తున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తైన వెంటనే పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటించనున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష అడ్మిట్ కార్డులు విడుదల

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు అందుబాటులోకి వచ్చాయి. మే 26న జరగనున్న ఈ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఐఐటీ మద్రాస్ విడుదల చేసింది. ఈ కార్డులను మే 26న మధ్యాహ్నం 2.30 గంటల వరకు అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ పరీక్షలో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగనుంది. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఐఐటీల్లో అడ్మిషన్లను కల్పిస్తారు.

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచొద్దు

» పేదలకు సొంతింటి కలను దూరం చేయొద్దు

» భూముల మార్కెట్ విలువను రెట్టింపు చేసి.. స్టాంపు డ్యూటీని 3 శాతానికి తగ్గించాలి

» ఎల్ఆర్ఎస్ చార్జీలూ పెరగకుండా చూడాలి

» ప్రభుత్వానికి రియల్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచవద్దని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకునేందుకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే పేద, మధ్యతరగతి ప్రజలను సొంతింటి కలకు దూరం చేసినట్లే అవుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నమాట వాస్తవమేనన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ విలువను రెట్టింపు చేసి.. ప్రస్తుతం 7.5 శాతంగా ఉన్న స్టాంపు డ్యూటీని 3 శాతానికి తగ్గించాలని కోరారు. దీంతో కొనుగోలుదారులు, అమ్మకందారులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. కేవలం భూముల మార్కెట్ విలువనే పెంచి.. స్టాంపు డ్యూటీని 7.5 శాతంగానే ఉంచితే రిజిస్ట్రేషన్ చార్జీలు కొనుగోలుదారులకు భారమవుతాయన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలతోపాటు ఎల్ఆర్ఎస్ చార్జీలను కలిపి చూస్తే లక్షల రూపాయలు ఫీజుల రూపంలో చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. మార్కెట్ విలువ పెంచినా ఎల్ఆర్ఎస్ చార్జీలు పెంచకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక రాష్ట్రంలో 142 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుంటే.. అందులో 100కు పైగా కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. వీటిలో తాగునీటి వసతి, కూర్చునేందుకు కనీసం కుర్చీలు కూడా ఉండవని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం హర్షణీయమన్నారు. ఉప్పల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం కోసం ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో స్థలం కేటాయించి ఏళ్లు గడుస్తున్నా.. నిర్మాణానికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికీ అద్దె భవనంలోనే నెలకు రూ.1.80 లక్షల అద్దె చెల్లిస్తూ కొనసాగిస్తున్నారని తెలిపారు.

ప్రతి సోమ, శుక్రవారాల్లో

మెట్రో రైళ్ల అదనపు సేవలు

- ఉదయం 5.30 గంటలకు ప్రారంభం
- అర్ధరాత్రి 12.45 వరకు కొనసాగింపు :ఎల్ అండ్ టీ



హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్ ప్రయాణికులకు శుభవార్త. ప్రతి సోమ, శుక్ర వారం రోజుల్లో రైళ్ల ప్రయాణ సమయాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటలకు రైళ్లను ప్రారంభించి.. రాత్రి 12 గంటల వరకు నడపనున్నట్లు ఎల్అండ్‌టీ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీ వరదరాజన్ తెలిపారు. అలాగే ప్రతి శుక్రవారం అర్ధరాత్రి 12.45 గంటల వరకు రైళ్ల సేవలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు సౌకర్యాన్ని ఎక్కువ మంది వినియోగించుకునేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం (ఈనెల 17వ తేదీ) నుంచే కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మిగతా రోజుల్లో రైళ్లు యథావిధిగా నడుస్తాయని చెప్పారు. నార్సింగిలోని అడ్రస్ కన్వెన్షన్‌లో శుక్రవారం గ్రీన్ యాన్యువల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఎం)సమ్మిట్- 2024 నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ వరదరాజన్ "ది మొబిలిటీ ఫర్ టుడే అండ్ టుమారో" అంశంపై కీలకోపన్యాసం చేశారు. నగరంలో ప్రస్తుతం రోజుకు 4.50 లక్షల మంది మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారని, ఇప్పటివరకు అత్యధికంగా ఒక్కరోజులో 5.05 లక్షల మంది రాకపోకలు సాగించారని తెలిపారు. అయితే నగరంలో మెట్రో సేవలను మరింత మందికి అందించే ప్రక్రియలో భాగంగా ప్రతి సోమ, శుక్రవారాల్లో రైళ్ల ప్రయాణ సమయాన్ని పెంచుతున్నామన్నారు. ఆశించిన ప్రయాణికుల సంఖ్య కనిపిస్తే.. వారాంతం మొత్తానికి కొనసాగిస్తామన్నారు. కాగా, ఎల్అండ్‌టీ మెట్రో 2023-24ఉత్తమ గ్రీనింగ్ ది ఫ్యూచర్ అవార్డును పొందింది.

ఒప్పందం కుదిరాకే 'అమ్మ'కు అంతిమయాత్ర

- రూ.2 లక్షలపై హామీ తర్వాతే తలకొరివి పెట్టిన కొడుకు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన అధికార యంత్రాంగం

నేరేడుచర్ల, మే 17: ఆస్తి పంపకాల పంచాయితీ తేలినా, తలకొరివి ఖర్చుల కోసం తల్లి అంత్యక్రియలు పూర్తి చేయకుండా ఆపిన వివాదం ముగిసింది. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తాను డిమాండ్ చేసిన రూ.2 లక్షలపై ఒప్పందం కుదిరిన తర్వాతే రెండ్రోజులుగా ఫ్రీజర్‌లో ఉన్న తల్లి మృతదేహానికి కొడుకు తలకొరివి పెట్టాడు. దీంతో సూర్యాపేట జిల్లా నేరుడుచర్ల మండలం కందులవారిగూడెంకు చెందిన వేము లక్ష్మమ్మ(80) అంతిమ కార్యక్రమాలు ముగిశాయి. లక్ష్మమ్మ అంత్యక్రియల నిలిపివేతపై 'అయ్యో అమ్మ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. జిల్లా కలెక్టర్ వెంకట్రావు ఆదేశాల మేరకు తహసీల్దార్ సైదులు, పోలీసులు దిగారు. లక్ష్మమ్మ కుమారుడు సైదిరెడ్డి, ముగ్గురు కుమార్తెలతో ఆస్తి పంపకాలపై మాట్లాడి అంత్యక్రియలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు ఇచ్చేందుకు తోబుట్టువులు అంగీకరించడంతో సైదిరెడ్డి శుక్రవారం అంతిమ కార్యక్రమాలు పూర్తి చేశాడు.

కారు ఎవరిదో.. నెంబరు మాత్రం ఎమ్మెల్యేది!

- చలానా మెసేజ్‌తో కంగుతిన్న మైనంపల్లి రోహిత్
- వెంటనే పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

పేట్‌బషీరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): "ఈ నెల 9న మీ కారును(నెంబరు: టీఎస్ 10 ఎఫ్‌బీ 9999) పరిమితికి మించిన వేగంతో నడిపిన కారణంగా రూ.1,035 జరిమానామా విధిస్తున్నాం" అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఫోన్‌కు ఇటీవల ఓ సందేశం వచ్చింది. మెసేజ్‌ను గమనించగా.. కారు సూర్యాపేటలో ఓవర్‌స్పీడ్‌గా వెళ్లినట్లు ఉంది. ఆ రోజు రోహిత్ అక్కడికి వెళ్లనే లేదు. చలానా పడ్డ కారు ఫొటోను చూడగా.. అది తనది కాదు. తన పేరుమీద రిజిస్టర్ అయి ఉన్న కారు నెంబరును వేరెవరో మరో కారుకు తగిలించుకొని తిరిగేస్తున్నారు. తన కారు జీఎంసీ సియారా మోడల్ నలుపు రంగుది. కానీ, చలానా ఫొటోలో ఉన్న కారు తెలుపు రంగులోని వోక్స్‌వాగన్. దీంతో, ఎమ్మెల్యే వ్యక్తిగత సిబ్బంది పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోడదూకి 'పిన్నెల్లి' సోదరులు పరార్!

తొలుత తాడేపల్లి ప్యాలెస్‌కు.. ఆ తర్వాత ఇంటికి.. అర్ధరాత్రి దాటాక అక్కడ నుంచి పరార్

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పల్నాడుజిల్లా మాచర్లలో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు తీవ్ర విఘాతం కలిగిస్తూ హింసకు పాల్పడిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గురువారం రాత్రి అన్నదమ్ములు ఇద్దరూ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సుమారు గంటపైనే ఉండి.. పలు విషయాలు చర్చించినట్టు తెలిసింది. అనంతరం తిరిగి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10 గంటల సమయంలో గన్‌మెన్లను కింద ఉంచి ఇంటిలోని మేడ పైన ఉన్న గదికి చేరుకున్నారు. ఇంతలో పల్నాడు కలెక్టర్, ఎస్పీలపై ఎన్నికల కమిషన్ వేటు వేసిన విషయాన్ని తెలుసుకున్నారు. అంతే.. రాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంటి వెనుక ఉన్న గోడ దూకి ప్రయివేటు వాహనాల్లో పారిపోయినట్లు తెలిసింది. అయితే.. వీరు ఈసీ కన్నుగప్పి పరారవడం వెనుక 'తాడేపల్లి పెద్దల స్కెచ్' ఉండి ఉంటుందని స్థానికంగా చర్చ జరుగుతోంది. కాగా, ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మాచర్లలో ఘోర అరాచకాలకు పాల్పడిన పిన్నెల్లి సోదరుల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ సీరియస్‌గా ఉందని తెలియటం, తాడేపల్లికి వెళ్లి వైసీపీ పెద్దలను కలిసి రావడం, ఆ వెంటనే గోడదూకి పారిపోవడం గమనిస్తే.. పక్కా వ్యూహంతోనే వారు పరారైనట్లు మాచర్లలో చర్చించుకుంటున్నారు. ఇదిలావుంటే, ఎన్నికలకు ముందు, తర్వాత మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరులు సృష్టించిన అల్లర్లు అన్నీ ఇన్నీ కాదు. పోలీసులు తమ చెప్పుచేతల్లో ఉన్నారన్న ధైర్యంతో తెలుగుదేశం పార్టీ క్యాడర్‌పై ఇష్టం వచ్చినట్లు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే పిన్నెల్లి అండ చూసుకుని వైసీపీ నేతలు, కొందరు రౌడీ షీటర్లు పోలింగ్ ఏజంట్లను లక్ష్యంగా చేసుకుని విజృంభించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకులు మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరుల అరాచకాలపై ఈసీకి పూర్తిస్థాయి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే, ఆయన సోదరుడిపై ఈసీ కఠిన చర్యలకు ఆదేశించే అవకాశం కనిపిస్తోంది. దీనిని ముందుగానే గ్రహించిన పిన్నెల్లి బ్రదర్స్ పారిపోవడం గమనార్హం.

వైసీపీ పోలీసింగ్‌పై కొరడా

పోలింగ్, అనంతర హింసపై 'సిట్'.. ఈసీ ఆదేశంతో ఐజీ వినీత్ బ్రిజిలాల్ నేతృత్వంలో టీమ్

- పల్నాడు, తాడిపత్రి హింసపై దర్యాప్తు
- అవినీతి అధికారుల వెన్నులో వణుకు
- నివేదిక తర్వాత అధికారులపై చర్యలు

అమరావతి, మే 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పోలీసు చరిత్రలోనే కొత్త అధ్యాయం నమోదైంది. ఎన్నికల విధుల్లో వైఫల్యంపై విచారణకు రాష్ట్ర పోలీస్ శాఖ ఊహించని రీతిలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటైంది. కేంద్ర ఎన్నికల సంఘం సిఫారసు మేరకు 13మంది పోలీసు అధికారుల బృందం దర్యాప్తునకు సిద్ధమైంది. నిఘా విభాగం ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ ఈ టీమ్‌కు నేతృత్వం వహిస్తారు. పల్నాడు, తాడిపత్రి, తిరుపతి ప్రాంతాల్లో పోలింగ్, అనంతర హింసను కట్టడి చేయడంలో పోలీసు అధికారుల వైఫల్యంపై బ్రిజ్‌లాల్ బృందం దృష్టి సారించనుంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో పల్నాడు, తిరుపతి, అనంతపురం ఎస్పీలు, కొందరు పోలీసు అధికారులు, పల్నాడు కలెక్టరుపై సీఈసీ వేటు వేసిన విషయం తెలిసిందే. వీరిలో కొందరిని బదిలీపై పంపితే, మరి కొందరిని ఏకంగా సస్పెండ్ చేసింది. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ గుప్తాలను ఢిల్లీకి పిలిపించుకుని సీరియస్ అయింది. పోలింగ్ విధుల్లో, డ్యూటీలో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై వేటు పడాల్సిందేనని స్పష్టం చేసింది. హింసాత్మక ఘటనలపై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని, కేంద్ర సాయుధ బలగాలతో ఆయా ప్రాంతాల్లో శాంతి భద్రతలు అదుపు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సిట్‌ను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ముగ్గురు ఎస్పీల వివరణ..

శాంతి భద్రతల నిర్వహణలో వైఫల్యం చెందారంటూ ఈసీ ఆగ్రహానికి గురైన ఎస్పీలు బిందుమాధవ్(పల్నాడు); అమిత్ బర్దార్(అనంతపురం), కృష్ణకాంత్ పటేల్(తిరుపతి) తమ వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఎన్నికల పోలింగ్ సమర్థవంతంగా నిర్వహించారని ఈసీతో అనిపించుకున్న మరుసటి రోజే.. విఫలమయ్యారంటూ మాటలు పడటంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే తాము చేయాల్సినంత చేశామని ఎస్పీలు చెప్పబోగా శాంతిభద్రతల ఏడీజీ బాగ్చికి ఆ వివరణలు ఇవ్వమని సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా అన్ని జిల్లాల ఎస్పీలతో డీజీపీ గుప్తా మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర బలగాలు 20కంపెనీలు వచ్చాయని, అవసరమైతే ఏపీఎస్పీ బలగాలు కూడా పంపుతామని చెప్పారు.

హింసపై ఈసీకి సీఈవో నివేదిక

రాష్ట్రంలో పోలింగ్ అనంతర హింసాత్మక ఘటనలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా కార్యాలయం ప్రాథమిక విచారణ పూర్తి చేసి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపింది. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నట్లు మీనా తెలిపారు. ఇప్పటి వరకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మాత్రమే మూడంచెల భద్రత ఉండేదని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రెండంచెల భద్రత ఉండేదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు.

ఎస్పీల్లేరు.. ఉన్న వాళ్లనే ఎంపిక చేసుకోండి

'ఆంధ్రప్రదేశ్‌లో మీరు అడిగిన ఐపీఎస్ అధికారులు లేరు.. ఎస్పీ ర్యాంకులో ఐదుగురే అందుబాటులో ఉన్నారు.. ఆ మూడు జిల్లాలకు ముగ్గురి చొప్పున పేర్లు పంపలేక పోతున్నాం.. వీరిలోనే ముగ్గురిని ఎంపిక చేసుకోండి' అంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. రాష్ట్రంలో ఎన్నికల తర్వాత హింసను అరికట్టడంలో విఫలమైన మూడు జిల్లాల ఎస్పీలపై ఈసీ వేటేసిన సంగతి తెలిసిందే. అనంతపురం జిల్లాలో అమిత్ బర్దార్, తిరుపతి జిల్లా నుంచి కృష్ణకాంత్ పటేల్, పల్నాడు ఎస్పీ గరికపాటి బిందు మాధవ్‌ను గురువారం సాయంత్రమే ప్రభుత్వం పక్కన బెట్టాల్సి వచ్చింది. ఆయా జిల్లాల్లో ఆ ముగ్గురి స్థానంలో నియమించేందుకు ఒక్కో జిల్లాకు ముగ్గురి చొప్పున మొత్తం తొమ్మిది మంది ఎస్పీ ర్యాంకు ఐపీఎస్ అధికారుల పేర్లు ఈసీ అడిగింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎలాంటి విచారణలు లేని, వివాదాస్పదం కాని, సమర్థవంతమైన అధికారులు ప్రస్తుతం ఏపీలో లేరు. దీంతో ఐదుగురు ఎస్పీ ర్యాంకు అధికారుల పేర్లు పంపుతూ సీఎస్ జవహర్ రెడ్డి ఎస్పీల కొరతను ఈసీకి తెలియజేశారు.

లగ్జరీ ఫ్లైట్‌లో పేదింటి బిడ్డ

కుటుంబంతో లండన్‌కు ఏపీ సీఎం జగన్

పేదింటి బిడ్డ జగన్ తన కుటుంబంతో కలసి విమానంలో లండన్‌కు విహార యాత్రకు వెళ్లారు. ఈ ప్రత్యేక విమానంలో పడకలతో పాటు 14 సీట్లు ఉంటాయి. విమానం అద్దె ఎంతో తెలుసా... గంటకు 12 లక్షలు మాత్రమే! వామ్మో.. అని ఆశ్చర్యపోకండి! ఇది ప్రపంచంలోనే విలాసవంతమైనది. ఈ విమానం పేరు.. విస్టా జెట్ కంపెనీకి చెందిన బొంబార్డియర్ 7500. మన దేశంలో ఇలాంటి విమానాలను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. నిరుపేద ముఖ్యమంత్రి కోసం ప్రత్యేకంగా విదేశాల నుంచి ఈ అధునాతన విమానాన్ని తెప్పించారు. గురువారమే గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. శుక్రవారం రాత్రి 11గంటలకు జగన్ తన కుటుంబంతో కలసి ఈ విమానంలో గన్నవరం నుంచి నేరుగా లండన్‌కు బయల్దేరారు. వారి వెంట ఓ సెక్యూరిటీ అధికారి, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది ఉన్నారు. అన్నట్టు ముఖ్యమంత్రి భద్రత కోసం నలుగురు అధికారులు ముందుగానే లండన్ వెళ్లారు. వారికి విమాన టికెట్లు, వసతి, ఇతర ఖర్చులు కలిపి కోటిన్నర మాత్రమే. నలుగురు సాధారణ అధికారులకు జస్ట్ కోటిన్నర ఖర్చు పెడితే.. జగన్ కుటుంబం ఉపయోగించిన ప్రత్యేక విమానం అద్దె, ఇతరత్రా ఖర్చులు ఏ రేంజ్‌లో ఉంటాయో ఊహించడమే కష్టం. తరచూ పేదవాడినని చెప్పుకొనే జగన్ సింప్లిసిటీ ఇదన్నమాట.

భావప్రకటనా స్వేచ్ఛను

హరించడమే

- వివేకా హత్య గురించి మాట్లాడొద్దంటూ కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు..

న్యూఢిల్లీ, మే 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య గురించి మాట్లాడొద్దంటూ వైఎస్ షర్మిల, ఇతరుల భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగించేలా కడప కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రతివాదుల వాదన వినకుండానే ఏకపక్షంగా ఉత్తర్వులివ్వడంపై అసహనం వ్యక్తం చేసింది. వివేకా హత్యపై వైసీపీ, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడకుండా షర్మిల, ఇతరులను అడ్డుకోవడానికి కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. షర్మిలతో పాటు ఇతరులపై దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులపైనా స్టే విధించింది. వివేకా హత్య గురించి మాట్లాడవద్దంటూ కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై జోక్యానికి ఏపీ హైకోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ షర్మిల సుప్రీం ధర్మాసనాన్ని ఆశ్రయించారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. వివేకా హత్య కేసుపై ఎవరూ మాట్లాడవద్దని కోర్టులో ఒక రాజకీయ పార్టీ పిటిషన్ దాఖలు చేయడం, దానికి అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వడం మిగిలిన పార్టీలు, నాయకుల స్వేచ్ఛను హరించడమేనని షర్మిల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 'ఎన్నికలు పూర్తి అయ్యాయి కదా... ఇప్పుడు విచారణ అవసరమా?' అని ధర్మాసనం ప్రశ్నించగా.. ఎన్నికలు ముగిసినప్పటికీ వివేకా హత్య కేసుపై మాట్లాడవద్దని ఆదేశాలు కొనసాగుతున్నాయని, ప్రచారంలో మాట్లాడారని కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారని... అందుకు నోటీసులు కూడా ఇచ్చారని షర్మిల న్యాయవాది పేర్కొన్నారు. ధర్మాసనం స్పందిస్తూ... ఒక రాజకీయ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై కడప కోర్టు 'ఎక్స్‌పార్టీ' ఉత్తర్వులు ఇవ్వడం అభ్యంతరకరమని, ఇవి గతంలో సుప్రీంకోర్టు జారీ చేసిన తీర్పులకు విరుద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. షర్మిల వాదన వినకుండా ఉత్తర్వులు జారీ చేయడం ఆమె భావప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 18 మే 2024

ఆక్టా-కోర్ ఆర్కిటెక్చర్‌తో పోకో కొత్త ఫోన్

పోకో నుంచి కొత్త ఫోన్ ఇండియాలో విడుదలైంది. క్వాల్కామ్‌కు చెందిన లేటెస్ట్ 4ఎన్‌ఎం ఆక్టా-కోర్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జన. 3చిప్ సెట్‌తో ఆ ఫోన్ ఇండియాలోకి వస్తోంది. ఏఐ సామర్థ్యాలకు తోడు గేమింగ్ ఎక్స్‌పీరియెన్స్ బాగుంటుంది. 4ఎన్ఎం ఆక్టా-కోర్



ఆర్కిటెక్చర్ ఉండటంతో ఎఫిషియెన్సీ పెరుగుతుంది. అడ్రెనో జీపీయూ దానికి అదనం. ఫలితంగా హెచ్‌డీఆర్ గేమింగ్ ఎక్స్‌పీరియెన్స్ బాగుంటుంది. 24జీబీ ఎల్‌పీడీడీఆర్ 5ఎక్స్ మెమరీకి అవసరమైన చిప్‌సెట్ సపోర్ట్ ఉంటుంది. 30 వరకు ఆన్ డివైజ్ జనరేటివ్ ఏఐ మోడల్స్‌ను అకామిడేట్ చేస్తోంది. 6.7 ఇంచీల ఓలెడ్ డిస్‌ప్లే, డ్యూయల్ రేర్ కెమెరా సెటప్, 5000ఎంఏహెచ్ బ్యాటరీకి తోడు 90వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉన్నాయి.

ఆర్‌సీఎస్ చాట్స్‌కు ఎడిటింగ్ ఫీచర్

గూగుల్ మెసేజెస్ తన ఆర్‌సీఎస్‌చాట్స్‌కు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను జోడించింది. ఆర్‌సీఎస్(రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్) చాట్స్ కూడా ఇతర మెసేజింగ్ యాప్‌లకు దీటుగా పని



చేసేందుకు వీలుగా ఈ ఉన్నతీకరణ చేసింది. దీంతో యూజర్‌కు తను పంపే మెసేజ్‌లపై అదనపు అదుపు కల్పించినట్లయింది. ఆర్‌సీఎస్ చాట్స్ ఎడిటింగ్ కోసం మెసేజెస్‌పై లాంగ్ ప్రెస్ చేయాలి. అప్పుడు కాపీ, డిలీట్, స్టార్ పక్కన 'ఎడిట్ పెన్సిల్ బటన్ కనిపిస్తుంది. ఒకసారి ఎడిట్‌ని సెలెక్ట్ చేసుకుంటే చాలు, మెసేజ్‌ను ఎడిట్‌చేసుకునే అవకాశం లభిస్తుంది. అది వద్దనుకుంటే క్యాన్సిల్ చేసుకోవచ్చు. 'ఆండ్రాయిడ్ పోలీస్' నివేదిక ప్రకారం మెసేజ్‌లను పంపిన పదిహేను నిమిషాల లోపు ఎడిట్ చేసుకోవచ్చు. భద్రత, పారదర్శకతలో భాగంగా ఒరిజినల్ మెసేజ్‌ను చూసుకునే సౌలభ్యం యూజర్‌కు ఉంటుంది. ప్రస్తుతం బేటా యూజర్లకు ఇది అందుబాటులో ఉంది. దశల వారీగా ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ యూజర్లు అందరికీ అందుతుంది.

37.40 కోట్ల అకౌంట్స్ బ్లాక్

యాపిల్ ప్రత్యేకించి 37.40 కోట్ల మేర అకౌంట్లను గత ఏడాది బ్లాక్ చేసింది. ఇందులో డెవలపర్, కస్టమర్ అకౌంట్లు ఉన్నాయని యాపిల్ ఒక నివేదికలో తెలిపింది. తమ ప్రమాణాలకు అనుగుణంగా లేవని ఒక్క 2023లోనే ఒకటిన్నర కోట్లకు పైగా రేటింగ్స్, రివ్యూలను కూడా తొలగించింది. పైరేట్ స్టోర్‌ఫ్రంట్స్‌లో 47000 బ్లాక్ చేసింది. ఒక్క ఏడాదిలో 1.8 బిలియన్ల డాలర్ల మేర అక్రమాలకు చెక్ పెట్టింది. 2020 నుంచి చూసుకుంటే అది ఏడు బిలియన్ డాలర్లుగా ఉంది. యాప్ స్టోర్ టీమ్‌లో 500 మంది



సభ్యులు ఉన్నారు. వారానికి 1,32,500 యాప్‌లను వారు రెవ్యూ చేస్తారు. గత ఒక్క ఏడాదిలో 6.9 కోట్ల మేర యాప్ దరఖాస్తులను సమీక్షించింది. వడపోత అనంతరం 1,92,000 యాప్స్‌కు మాత్రమే అనుమతిచ్చింది. మొత్తమ్మీద అకౌంట్స్, యాప్స్ విషయంలో స్క్రూటినీని పటిష్టపరుస్తోంది.

'అన్‌వాంటెడ్ ట్రాకర్' హెచ్చరికలు

యాపిల్ తాజాగా ఐఓఎస్ 17.5 అప్డేట్‌తో 'అన్‌వాంటెడ్ ట్రాకర్స్' హెచ్చరికలను పరిచయం చేస్తోంది. ప్రైవసీ, సెక్యూరిటీని పెంచే క్రమంలో ఈ ఫీచర్‌ను యాపిల్ అభివృద్ధిపర్చింది. అస్సలు తెలియని బ్లూటూత్ ట్రాకింగ్ డివైజ్ చొచ్చుకు వస్తోందని డిటెక్ట్ అయితే నోటిఫికేషన్స్‌తో ఐఫోన్, ఐపాడ్ యూజర్లకు దీంతో అలెర్ట్ నోటిఫికేషన్స్ అందుతాయి. డిటెక్టింగ్ అన్‌వాంటెడ్ లొకేషన్ ట్రాకర్స్(డియూఎల్‌టీ) ప్రమాణాలకు లోబడి ట్రాక్రింగ్ ఉంటుంది. ఎయిర్ ట్యాగ్స్‌కు సానుకూలత కూడా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే యూజర్ ఫోన్‌పై నిఘా పెట్టిన లేదా ఆ ఫోన్‌లు ముందుకు వస్తున్నట్టు తేలితే వెంటనే అలెర్ట్ పంపుతుంది. తద్వారా ఐఫోన్, ఐపాడ్ యూజర్ల ప్రైవసీ, వాటి భద్రతకు పూచీపడుతుంది. 'ఫౌండ్ మూవింగ్ విత్ యూ' అంటూ స్పయింగ్ ఫోన్ విషయమై అలెర్ట్ చేస్తుంది. ఆండ్రాయిడ్ 6.0, ఆపై రన్ అయ్యే ఆండ్రాయిడ్ డివైజ్‌లకు ఇటువంటి రక్షణను ఇప్పటికే కల్పించింది.



ఫొటోగ్రఫీ సవాళ్ళకు జవాబు వివో ఎక్స్100 అల్ట్రా



వివో విడుదల చేసిన మరో ఫోన్ 'వివో ఎక్స్100 అల్ట్రా'. మొబైల్ ఫొటోగ్రఫి అలాగే పర్ఫార్మెన్స్‌లో సరికొత్త ప్రమాణాలను ఇది నెలకొల్పుతుందని చెబుతున్నారు. కటింగ్ ఎడ్జ్ ఫీచర్స్‌తో రివల్యూషనరీ కెమెరా సిస్టమ్‌ను అమర్చారు. ఒక ఇంచీ టైప్ మెయిన్ కెమెరా ప్రత్యేకించి సోనీకి చెందిన ఎల్‌వైటీ-900 సెన్సర్‌ను ఉపయోగిస్తోంది. దీంతో స్పష్టతకు తోడు ఫొటో డీటైల్‌గా ఉండనుంది. దీంతో పాటు పెరిస్కోప్ కెమెరా కూడా ఉంది. 200ఎంపి రిజల్యూషన్‌తో 3.7 ఆప్టికల్ జూమ్ కేపబిలిటీ ఉంది. బ్యాక్‌లైటింగ్, లో-లైట్ కండిషన్స్‌ను అధిగమించేందుకు వీలుగా బ్లూఇమేజ్ అల్గోరిథమ్‌ను పరిచయం చేసింది. ఈ విషయమై ఎనిమిదేళ్ళుగా పరిశోధనను కొనసాగించింది. దీంతోపాటు వీ3+ ఇమేజింగ్ చిప్ కూడా ఉంది. క్వాలిటీపరంగా రాజీపడకుండా ఉండేందుకు దీన్ని కలిపారు. జింబాల్ స్టెబిలైజేషన్, అల్ట్రావైడ్ లెన్స్‌తో ఉన్న మెయిన్ కెమెరా స్టన్నింగ్ ఫొటోలు తీసుకునేందుకు తోడ్పడుతుంది. 6.7 ఇంచీల ఈ2ఎల్‌టీపీఓ అమోల్డ్ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉంది. 16జీబీ ర్యామ్, ఒక టీబీ మేరక్ స్టోరేజీ సదుపాయం ఉన్నాయి. 5,500 ఎంఎహెచ్ బ్యాటరీ ఉంది. వైర్డ్ 80 వాట్స్ వైర్‌లెస్ 30 వాట్స్ చార్జింగ్ సదుపాయం ఉంది. చైనాలో ఈ నెల 28న విడుదలవుతున్న ఈ స్మార్ట్‌ఫోన్ ఫొటోగ్రఫీపరంగా ఎదరయ్యే సవాళ్ళకు సమాధానం చెప్పనుంది.

త్వరలో వివో వై200 ప్రొ

వివో కొత్త స్మార్ట్ ఫోన్ 'వివో వై200 ప్రొ'ని ఇండియన్ మార్కెట్లోకి విడుదల చేయనుందని సమాచారం. '91 మొబైల్స్' నివేదిక ప్రకారం మన దేశంలో దీని ధర రూ.25,000గా ఉండనుంది. 3డి కర్వ్ డిస్‌ప్లేతో ఫోన్ ఆకట్టుకునేలా ఉంది. క్వాల్కామ్ స్నాప్‌డ్రాగన్ 695 ఎస్ఓసీతో సజావైన పర్ఫార్మెన్స్‌కు తోడు 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉంది. ఫొటోగ్రఫి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిసింది. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్(ఓఐసీ)తో యాంటీ షేక్ కెమెరాను కలిపింది. స్టడీ షాట్స్‌కు ఈ ఏర్పాటు ఉపయోగపడనుంది. నైట్ ఫొటోగ్రఫీ, పోర్ట్రయిట్ మోడ్ కూడా ఉన్నాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) సర్టిఫికేషన్ వెబ్‌సైట్స్‌లో కనిపించడంతో భారత దేశంలో ఈ ఫోన్ విడుదలపై వార్తలు గుప్పుమన్నాయి. సర్టిఫికేషన్ వెబ్‌సైట్స్‌లో ఉన్న మోడల్ నంబర్ ఒకటి కాగా మార్చిలో లీక్ అయిన వివరాల ఫోన్ నంబర్ మరొకటి. మొత్తమ్మీద రీబ్రాండింగ్ వ్యూహంగా నిపుణులు అంచనా వేస్తున్నారు.



గూగుల్ సెర్చ్ పవర్ పెంపు



గూగుల్ తాజాగా ఏఐ పవర్డ్ సెర్చ్ ఫీచర్‌ను ఆరంభించింది. ఫలితంగా జవాబులు త్వరితగతిన పొందొచ్చు. అదే సమయంలో ఆర్గనైజ్డ్(పద్ధతిగా) ఫలితాలను అందుకోవచ్చు. దీన్నే సెర్చ్ జనరేటివ్ ఎక్స్‌పీరియెన్స్ అంటోంది. యూజర్లు అందరికీ ఏఐ పవర్డ్ 'ఓవర్‌వ్యూస్'పేరుతో దీన్ని గూగుల్ తీసుకు వచ్చింది. గత ఏడాదే ఆరంభించినప్పటికీ ఇన్నాళ్ళు ఇది టెస్టింగ్‌లోనే ఉంది. ఇప్పుడు అమెరికాలో ఇది డిఫాల్ట్ ఫీచర్‌గా అందుబాటులోకి వచ్చింది. దీన్ని త్వరలోనే విస్తరించనున్నారు. ఈ నేపథ్యంలోనే వెబ్‌సైట్ ట్రాఫిక్ చర్చల్లోకి వచ్చింది. రాబోయే సంవత్సరాల్లో పాతిక శాతం మేర నష్టం వస్తుందని కూడా భావిస్తున్నారు. అయినప్పటికీ గూగుల్ తన కమిట్‌మెంట్‌కే నిబద్ధం కావాలని అనుకున్నట్టు సమాచారం.

ఐఫోన్, ఐపాడ్‌లో ఐ ట్రాకింగ్

యాపిల్ - ఐఫోన్, ఐపాడ్‌లలో సరికొత్త ఫీచర్ 'ఐ ట్రాకింగ్'ను తీసుకువస్తోంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ సామర్థ్యాల సహాయంతో ఈ ఫీచర్ పనిచేస్తుంది. ఐఫోన్, ఐపాడ్‌ల్లోని ఫ్రంట్ కెమెరా యూజర్ కళ్ళను ఫాలో అవుతుంది. తద్వారా సెట్టింగ్స్ అలాగే



యాప్స్ పెద్ద ఇబ్బంది లేకుండా యూజర్ నేవిగేట్ చేసుకోవచ్చు. . ఫిజికల్ బటన్స్ వంటివి కూడా ఉపయోగించవచ్చు. డ్వెల్ కంట్రోల్ ఫీచర్ ఈ విషయంలో సహాయపడుతుంది. కంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న యూజర్లు సరిగ్గా చూసుకుని పనిచేసుకునేందుకు వీలుగా గతంలో ప్రత్యేక యాక్సెసరీలను కొనుగోలు చేసుకునే వారు. ఇప్పుడు వారికి ఆ ఇబ్బంది ఉండదు. మ్యూజిక్ హెపటిక్స్ మరొకటి. ఐఓఎస్ అప్డేట్‌తో ఐఫోన్‌లోకి వస్తోంది. వినికిడి లోపం ఉన్న వారు, వినడానికి చాలా ఇబ్బంది పడుతున్న యూజర్లకు ఇది బాగా ఉపయోగపడుతుంది. యూజర్ సంగీతం వింటున్నప్పుడు మ్యూజిక్‌కు అనుగుణంగా ట్యాప్స్, టెక్స్‌ట్యూర్స్‌ని టాప్టిక్ ఇంజన్ ప్లే చేస్తుంది. అలాగే ఐఫోన్, ఐపాడ్ మధ్య వోకల్ షార్ట్‌కట్స్‌ను కూడా యాపిల్ తీసుకువస్తోంది. 'సిరి' సేవలు పొందడానికి తోడు పలు క్లిష్టమైన టాస్క్‌ల పూర్తికి అది ఉపయోగపడుతుంది. స్పీచ్ రికగ్నిషన్ మరొకటి. ఇబ్బందుల కారణంగా స్పీచ్ సరిగ్గా లేకుంటే వినడానికి వీలుగా ఇది మలుస్తుంది. కదులుతున్న వాహనాల్లో ప్రయాణికులకు ఎదురయ్యే మోషన్ సిక్‌నెస్‌ను తగ్గించేందుకు వెహికల్ మోషన్ క్యూస్ ఫీచర్ పనికొస్తుంది. వాహనాల్లోని కార్ ప్లే ఫీచర్‌కు మొదటిసారి వాయిస్ కంట్రోల్‌ని యాపిల్ తెస్తోంది.

జెమినీ నానోతో ఫ్రాడ్‌కాల్స్ అలర్ట్

గూగుల్ - ఆండ్రాయిడ్ డివైజ్‌ల కోసం జెమినీ నానో - 'పవర్డ్ స్కామ్ కాల్ డిటెక్షన్ ఫీచర్‌ను పరిచయం చేస్తోంది. మోసపూరిత భాష, సంబంధిత సంభాషణలను జాగ్రత్తగా ఇది విశ్లేషిస్తుంది. తద్వారా మోసగాళ్ళను గుర్తిస్తుంది. అలాగే ఆ సంభాషణ కొనసాగిస్తున్న సమయంలోనే యూజర్‌ని అలెర్ట్ చేస్తుంది. సంబంధిత వీడియోతో డిమాన్‌స్ట్రేషన్స్‌ను సైతం గూగుల్ ఏర్పాటు చేసింది. సేఫ్టీ ఫీచర్ ఎలా పని చేస్తుందో తద్వారా తెలియజేసింది. సంభాషణలను ఈ ఫీచర్ మానిటర్ చేస్తుంది. అదే సమయంలో సంభాషణలు ఎన్‌క్రిప్ట్ అవుతాయి. తద్వారా ఇదంతా ప్రైవేట్ వ్యవహారంగా ఉంటుంది. అయితే ఈ ఫీచర్ ఎప్పటికి యూజర్లకు అందుబాటులోకి వస్తుందన్న విషయం మాత్రం గూగుల్ తెలియజేయలేదు. ఈ ఏడాది చివర్లో విషయం బైటకు రావచ్చు. పిక్సెల్ 8, శాంసంగ్ గెలాక్సీ ఎస్24 సిరీస్‌లలో ప్రస్తుతం జెమినీ నానీ పనిచేస్తోంది.





గూగుల్ జెమినీకి మెమరీ ఫీచర్!




గూగుల్ జెమినీకి కొత్తగా 'మెమరీ' ఫీచర్ కలవనుంది. తద్వారా భవిష్యత్తు కాన్వర్సేషన్లను తెలియజేయగలుగుతుంది. అంటే యూజర్‌కు సంబంధించిన ఫ్యాక్ట్స్‌ను సేవ్ చేసి భవిష్యత్తులో గుర్తు చేయగలుగుతుంది. చాట్‌జీపీటీ ఈ ఫిబ్రవరిలో విడుదల చేసిన ఫీచర్ మాదిరిగానే ఇది కూడా ఉంటుందని భావిస్తున్నారు. దీనికి జెమినీ 'మెమరీ' అని పేరుపెట్టారు. గత ఏడాదే ఈ వివరాలను '9టుఫ్ గూగుల్' బైటపెట్టింది. ఎక్స్ ద్వారా విడుదలైన స్క్రీన్‌షాట్ ప్రకారం యూజర్ లైఫ్, వర్క్, స్టడీ లేదంటే తనకు ఏవైనా అలర్జీలు ఉంటే అవి కూడా గుర్తు చేస్తుంది. ఉదాహరణకు ఒక యూజర్‌కు చిన్నపాటి అలెర్జీ ఉంది అనుకుందాం. ఏదైనా ఆహార పదార్థం పడుతుందా లేదా అన్నది తెలియజేసి యూజర్ ఇబ్బంది పడకుండా చూస్తుంది. అలా యూజర్ వ్యక్తిజీవితంలోకి తొంగి చూస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే చాట్స్‌తో షేర్ చేసిన విషయాలను గుర్తుంచుకుని తగు హెచ్చరికలు చేస్తూ ఉంటుంది. యూజర్ అవసరాలను గురిస్తుంది. ఈ వెసులుబాటు వద్దనుకుంటే మెమరీని టర్నాఫ్ చేయవచ్చు. లేదంటే ఎప్పుడైనా ఇచ్చుకునేలా ఇన్ఫో మేనేజ్‌మెంట్ చేయవచ్చు.

21న ఇన్ఫినిక్స్ స్మార్ట్ ఫోన్

ఇన్ఫినిక్స్ జీటీ 20 ప్రొ మన దేశంలోకి ఈ నెల 21న వస్తోంది. గేమింగ్ ఔత్సాహికులకు ఇన్‌స్టోర్ ఇందులోని ప్రత్యేకత. మిడ్ రేంజ్ సెగ్మెంట్‌కు చెందిన ఈ ఫోన్ దీనికి ముందు వచ్చిన దాని మాదిరిగానే ఉండనుంది. 6.7 ఇంచీల అమోల్డ్ డిస్‌ప్లే, 10-బిట్ ఎఫ్‌హెచ్‌డీ, ఐ కేర్, 144హెచ్‌జెడ్ స్క్రీన్ రిఫ్రెష్ రేట్ ఉండనున్నాయి. ఇండియాలో విడుదల చేస్తున్న ఈ ఫోన్ ఫస్ట్ మీడియాటెక్ డైమెన్సిటీ 8200 అల్టిమేట్ 4ఎన్‌ఎం ఆక్టా-కోర్ ప్రాసెసర్ పవర్ కలిగి ఉంటుంది. 12జీబీ ర్యామ్, 256 యూఎఫ్ఎస్ 3.1 ఇంటర్నల్ స్టోరేజీ ఉంటాయి. గేమింగ్ ఎక్స్‌పీరియెన్స్ విషయంలో మెరుగైన అనుభవం కోసం పిక్సెల్ వర్క్‌తో ఇంటిగ్రేట్ అయింది. ఎక్స్5 టర్బో చిప్ కారణంగా రెండు ప్రయోజనాలు ఉంటాయి. 90ఎఫ్‌పీఎస్ హై ఫ్రేమ్ రేటు ఉంటుంది. దాంతో స్టాండర్డ్ డెఫినిషన్ వీడియోని హైడెఫినిషన్ రేంజ్‌కు మార్చగలుగుతుంది. అలాగే ఆడియో ఎక్స్‌పీరియెన్స్ కోసం జేబీఎల్‌తో భాగస్వామ్యాన్ని ఇన్ఫినిక్స్ కుదుర్చుకుంది. స్మార్ట్ ఫోన్ వేడెక్కకుండా ఉండేందుకు ఈ ఫోన్‌కు వీసీ చాంబర్ కూలింగ్ టెక్నాలజీ సపోర్టు ఉంది. 5000ఎంఏహెచ్ బ్యాటరీకి తోడు 45 వాట్స్ మేర సేఫ్ చార్జింగ్ సపోర్ట్ ఉంది. ఆండ్రాయిడ్ 14పై రన్ అవుతుంది. రెండేళ్ళ వరకు ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడ్స్ అలాగే మూడేళ్ళ వరకు సెక్యూరిటీ పేచస్ ఈ ఫోన్‌కు అందుతాయి. దీని రేటు పాతిక వేల రూపాయల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

'ఆస్క్ మి ఎనీథింగ్'కు అదనపు హంగులు



రెడిట్ 'ఆస్క్ మి ఎనీథింగ్' ఫీచర్‌కు కొత్త టూల్స్‌ని జోడించింది. గెస్ట్ కొలాబిరేటర్స్, షెడ్యూల్డ్ సెషన్స్ క్లియర్ ఎండింగ్స్, ఆర్‌ఎస్‌వీపీ ఆప్షన్స్, సార్టింగ్ ఫీచర్స్, కమ్యూనిటీ సపోర్ట్ కోసం డెడికేటెడ్ ఎఎంఏ(ఆస్క్‌మి ఎనీథింగ్) హబ్ ఉన్నాయి. అవి వరుసగా...

- ఇటు నిర్వాహకుడు, అటు పార్టిసిపెంట్స్ మధ్య ఎంగేజ్‌మెంట్ మరింత ఉన్నతంగా ఉండేందుకు ఎఎంఏ టూల్‌ని ప్రవేశపెట్టారు. సెలిబ్రిటీస్, పబ్లిక్ ఫిగర్స్, సంస్థలు వంటివి మరింత లోతుగా ఇంటరాక్షన్ జరుపుకొనేందుకు దీంతో వీలుపడుతుంది.
- గెస్ట్ కొలాబిరేటర్స్ ఈ వరుసలో మరొకటి. నిర్వాహకులు అయిదుగురు అతిథులను పిలుచుకోవచ్చు. వారితో కూడా జవాబులు ఇప్పించవచ్చు. తద్వారా చర్చను మరింత సుసంపన్నం చేసుకోవచ్చు.
- షెడ్యూల్డ్ ఏఎంఏ అంటే ఇలాంటి సమావేశాలను ముందుగానే ప్లాన్ చేసుకోవచ్చు. 21 రోజుల ముందే పార్టిసిపెంట్లకు తెలియజేయవచ్చు. అలా మొత్తం ప్రక్రియను స్ట్రీమ్‌లైన్ చేసుకోవచ్చు.
- క్లియర్ ఎండింగ్స్ అంటే ఎలాంటి సంశయానికి తావులేకుండా నిర్వాహకుడు సమావేశాన్ని ముగించవచ్చు. అంతేకాదు నిర్వాహకుడు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు ఇతర సోషల్ చానళ్లకు యూజర్లను డైరెక్ట్ చేయవచ్చు.
- ఆర్‌ఎస్‌వీపీ అంటే సింపుల్‌గా పార్టిసిపెంట్ల అటెండెన్స్‌ను ఒక క్లిక్‌తో పూర్తి చేయవచ్చు. సమావేశం ఆరంభం కావడానికి 24 గంటల ముందు నోటిఫికేషన్లను పంపుకోవచ్చు. ఇదంతా ఇబ్బంది లేకుండా సజావుగా జరిపించవచ్చు.
- సార్టింగ్ ఆప్షన్స్ ఇంకొకటి. జవాబు వచ్చినవి, రానివి ఏవి అన్నవి సులువుగా పార్టిసిపెంట్స్ తెలుసుకోవచ్చు. తద్వారా చర్చను అవసరమైన వాటి దిశగా నడిపించవచ్చు. అంటే చర్చను సమర్థంగా సాగించవచ్చు.
- ఏఎంఏ హబ్ అంటే కేంద్రీకృత రిసోర్స్, కమ్యూనిటీ మెంబర్లు ఈ వనరులతో సొంతంగా ఏఎంఏలు నిర్వహించుకోవచ్చు. ఒకరకంగా ఇది ఉన్న వనరును సద్వినియోగం చేసుకోవడం కిందకు వస్తుంది.





ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ • శనివారం 18 మే 2024

diksuchi@andhrajyothy.com

నిఫ్టెమ్‌లో పీహెచ్‌డీ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్(నిఫ్టెమ్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. సంస్థ నిబంధనల ప్రకారం ఫుల్ టైమ్ అభ్యర్థులకు ఫెలోషిప్ అందిస్తారు.

రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో మూడు దశలు ఉంటాయి. మొదటి దశలో జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంట. కనీసం 40 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే తరవాతి దశలకు అనుమతిస్తారు.
- రెండో దశలో డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ ఉంటుంది. ఇది స్పెషలైజేషన్‌కు సంబంధించి ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, అబ్‌స్ట్రాక్ట్ రైటింగ్, కేస్ స్టడీస్ ఉంటాయి. పరీక్ష సమయం గంట.
- మూడో దశలో ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు ఎంచుకొన్న పరిశోధనాంశానికి సంబంధించి ప్రజంటేషన్ ఇవ్వాలి. ఇంటర్వ్యూలో కనీసం 50 శాతం స్కోర్ సాధించినవారిని మాత్రమే అడ్మిషన్ ప్రక్రియకు ఎంపిక చేస్తారు.
- డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తూ విభాగాలవారీగా మెరిట్ జాబితా రూపొందిస్తారు.

విభాగాలు-సీట్లు

అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ ఇంజనీరింగ్ విభాగంలో 9 సీట్లు, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో 9 సీట్లు, ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్ విభాగంలో 9 సీట్లు ఉన్నాయి.

పరిశోధనాంశాలు

లైఫ్ సైన్సెస్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, రిడక్షన్ స్ట్రాటజీస్ ఫర్ ప్లాంట్ ఫుడ్- యాంటీ న్యూట్రిషనల్ ఫాక్టర్స్, నాన్ థర్మల్ ప్రాసెసింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అప్లికేషన్స్, పోస్ట్ హార్వెస్ట్ హార్టికల్చర్ అండ్ టెక్నాలజీ, మష్రూమ్ ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ అగ్రీ బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్ట్రాటజీ, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఫైనాన్స్-అకౌంటింగ్-ఎకనామిక్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్‌ఆర్, ఎక్స్‌పెరిమెంటల్ ఫిజిక్స్, నానో మెటీరియల్స్-బయోసెన్సర్స్, మేథమెటికల్ మోడలింగ్(బయాలజీ/ఎకాలజీ/ఇన్ఫెక్షియస్ డిసీజ్), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటేషనల్ మోడలింగ్, బయోపాలిమర్స్, ఫుడ్ సేఫ్టీ, మెషిన్ లెర్నింగ్ ఫుడ్ సేఫ్టీ అండ్ సప్లయ్ చెయిన్, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితరాలు.



అర్హత

సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. యూజీసీ/సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/ఐకార్ నుంచి నెట్/జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత లేదా జాతీయ స్థాయిలో ఏదేని ఫెలోషిప్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 20న
- **పరీక్ష కేంద్రం:** నిఫ్టెమ్ క్యాంపస్, కుండ్లీ, సోనెపట్ జిల్లా
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 1న
- **ఇంటర్వ్యూలు:** జూలై 2, 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 8న
- **మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 12
- **అడ్మిషన్ ప్రక్రియ ముగింపు:** జూలై 15న
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in

ఎన్‌సీఈఆర్‌టీ సెట్

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ)-టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీఈఈ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్ ఆర్ఐఈల్లో(రీజనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్) అడ్మిషన్స్ పొందవచ్చు. తెలుగు రాష్ట్రాలు సహా కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, తమిళనాడు, పుదుచ్చేరి అభ్యర్థులు మైసూరు ఆర్ఐఈకి దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడ బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ, బీఈడీ, ఎంఈడీ, ఎమ్మెస్సీఈడీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీఈడీ ప్రోగ్రామ్‌నకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ అప్లయ్ చేసుకోవచ్చు.



బీఎస్సీ బీఈడీ

ఇది నాలుగేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్(పీసీఎం స్ట్రీమ్); ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ లేదా కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ(సీబీజడ్ స్ట్రీమ్)తో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు ఉండాలి. స్ట్రీమ్‌కు 55 చొప్పున మొత్తం 110 సీట్లు ఉన్నాయి.

బీఏ బీఈడీ

ఇది కూడా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామే. ఆర్ట్స్/కామర్స్/సైన్స్ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. మొత్తం 55 సీట్లు ఉన్నాయి.

బీఈడీ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సైన్స్ అండ్ మేథ్స్, ఇంగ్లీష్ అండ్ సోషల్ సైన్స్ గ్రూప్‌లతో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. కనీసం 50 శాతం మార్కులతో బీఏ/బీఎస్సీ/ఎంఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు; సైన్స్, మేథ్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్‌నకు 55 సీట్లు ఉన్నాయి.

సీఈఈ 2024 వివరాలు

పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ ఇన్ ఇంగ్లీష్ నుంచి 20, టీచింగ్ ఆప్టిట్యూడ్/ఆటిట్యూడ్ నుంచి 30, రీజనింగ్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లకు ఇంటర్ స్థాయిలో; డిగ్రీ, పీజీ లెవెల్ ప్రోగ్రామ్‌లకు డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. తప్పుగా గుర్తించిన సమాధానానికి అరమార్కు కోత విధిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది.

ఎంఈడీ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్) ఉత్తీర్ణతతోపాటు బీఈడీ/బీఏబీఈడీ/బీఎఈడీ/బీఎస్సీబీఈడీ/బీఎస్సీఈడీ పూర్తిచేసి ఉండాలి. మొత్తం 55 సీట్లు ఉన్నాయి.

ఎమ్మెస్సీ ఈడీ

ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంపీసీ(మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు 22 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- ప్రోగ్రామ్‌ను అనుసరించి ఇంటర్/డిగ్రీ పరీక్షలను 2022, 2023లో పూర్తిచేసినవారు; 2024లో రాసిన/రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ఎన్‌సీఈఆర్‌టీ సీఈఈ 2024 తేదీ:** జూన్ 16
- **ఫలితాలు విడుదల:** బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ, ఎమ్మెస్సీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 5న; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 10న
- **వెబ్‌సైట్:** https://cee.ncert.gov.in

అశోక్‌నగర్ గిరిజన గురుకులంలో డిగ్రీ

వరంగల్ జిల్లా-అశోక్‌నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమీ ఫర్ మెన్(టీటీడబ్ల్యూఆర్ఏఎఫ్‌పీఏ-ఎం)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ(ఎంపీసీ), బీఏ(హెచ్‌ఈపీ) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు చొప్పున మొత్తం 80 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామ్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు, మెడికల్ టెస్ట్‌లు, లెక్చరెట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. రాష్ట్రానికి చెందిన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ, ఇతర కేటగిరీల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. భోజనం, వసతి ఉచితం. నిబంధనల ప్రకారం అవసరమైన డ్రెస్‌లు, బుక్స్, మెడికల్ కేర్, పరీక్ష ఫీజు సమకూరుస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. 2023లో ఇంటర్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి పదహారేళ్లు నిండి ఉండాలి. ఎత్తు కనీసం 152 సెం.మీ ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం పట్టణాల్లో రూ.2,00,000; గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000 మించకూడదు. తెలుగు మీడియం అభ్యర్థులు కూడా ఎంట్రెన్స్ రాయవచ్చు. ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.

టెస్ట్‌ల వివరాలు: ఎంట్రెన్స్ ఎగ్జామ్ 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్ సిలబస్ ఆధారంగా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, ఫిల్ ద బ్లాంక్స్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఇచ్చిన స్పేస్‌లో మాత్రమే గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు.

- ఫిజికల్ టెస్ట్‌లో 100 మీటర్ల స్ప్రింట్, 400 మీటర్ల రన్, సిటప్స్, షటిల్ రేస్, అబ్‌స్టాకిల్ టెస్ట్ ఉంటాయి.
- మెడికల్ టెస్ట్‌లో నిర్దేశించిన మేరకు ఎత్తు, బరువు పరిశీలిస్తారు. కళ్లు, చెవులు, పళ్లు పరీక్షిస్తారు. టాటూ, ఫ్లాట్ ఫుట్, నాక్ నీస్, కలర్ బ్లైండ్‌నెస్, సర్జరీస్, క్రానిక్ డిసీజెస్ తదితరాలను పరిశీలిస్తారు.
- లెక్చరెట్‌లో ఇచ్చిన అంశంపై అనర్గళంగా మాట్లాడాలి.
- చివరలో పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది.
- రిటెన్ టెస్ట్ స్కోర్‌కు 20 మార్కులు, పదోతరగతి స్కోర్‌కు 5 మార్కులు, ఇంటర్ స్కోర్‌కు 15 మార్కులు, ఫిజికల్ టెస్ట్ స్కోర్‌కు 15 మార్కులు, సెల్ఫ్ అప్రయిజల్‌కు 10 మార్కులు, లెక్చరెట్‌కు 15 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- **రిటెన్, ఫిజికల్, మెడికల్ టెస్ట్‌ల సెంటర్:** టీటీడబ్ల్యూఆర్ఏఎఫ్‌పీ అకాడమీ(ఎం), అశోక్‌నగర్, వరంగల్ జిల్లా.
- **వెబ్‌సైట్:** tgtwgurukulam.telangana.gov.in/

SCHOLARSHIP ALERT

Mirae Asset Foundation Scholarship Program

Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or post-graduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/MAFS1

India Fellow Social Leadership Program 2024-25



Description: India Fellow Social Leadership Program 2024-25 is an opportunity offered by the India Fellow for graduate students and young professionals between 20 and 30 years of age. It is an 18-month leadership program designed to help participants develop their skills and make a positive impact on communities.

Eligibility: Open for Indian citizens aged between 20 to 30 years. Applicants must be graduates in any discipline or about to complete graduation by the fellowship start date. Students must be ready for an 18-month full-time commitment to the fellowship and prepared to be placed in any part of the country and any thematic area.

Prizes & Rewards: A monthly stipend of up to 22,000 and other benefits

Last Date to Apply: 31-05-2024

Application: Online applications

Short Url: www.b4s.in/aj/IFSA2

Aspire Leaders Program 2024

Description: The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.

Eligibility: This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than 8,00,000. Only first-generation learners are eligible to apply for the program. Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.

Prizes & Rewards: Free access to training modules, live sessions by Havard faculty, and much more

Last Date to Apply: 03-07-2024

Application mode: Online applications

Short Url: www.b4s.in/aj/ALPS1

buddy4study.com

లిటిల్స్



సమయస్ఫూర్తి

ఒక ఊరిలో విక్రముడు అనే జమీందారు ఉండేవాడు. అతనికి కోపం ఎక్కువ. మతిమరుపు ఉండేది కాస్త. కంటిచూపు సరిగా ఉండేది కాదు. డబ్బు ఎక్కువే. తన ఇంటి దగ్గరకు పని చేయటానికి వచ్చిన వారిని రాచి రంపాన పెట్టేవాడు. అయితే వారికి డబ్బులు మాత్రం బాగా ఇచ్చేవాడు. అయితే ఇంటి పని, పొలం పని అయినా సరిగ్గా చేయకపోతే మాత్రం చివాట్లు తప్పవు. ముక్కోపి కావటంతో ఆయన డబ్బులు వద్దు.. ఆయన పని వద్దు అని ఆ ఊరిలో జనాలు అనుకున్నారు.


జమీందారు పేరుకే జమీందారు. పెద్ద ఇల్లు ఉన్నా.. అతనికి పలికే వాళ్లు లేరు అనుకునేవాళ్లు ఊరి జనాలు. జమీందారు వాలకం చూసి ఇతర ఊరి వాళ్లు కూడా ఆయన దరిదాపుల్లోకి రాలేదు. అయితే తన తోటలోని ఇంటికి రంగులు వేయించాలని అనుకున్నాడు. అయితే రంగులు వేయటానికి పనివాడు దొరకలేదు. దీంతో ఎలా ఇలా అయ్యిందే అని ఆలోచించుకునే సమయంలో సోమనాథుడు అనే వ్యక్తి అక్కడికి వచ్చాడు. ఆయన ఊరు వంద కిలోమీటర్ల దూరం. 'ఏ దైనా పని ఇప్పించండి అయ్యా' అన్నాడు. 'ఈ ఊరిలోనే పదిరోజులు ఉండటానికి ఒక చిన్న గది కావాలి' అన్నాడు. జమీందారు మిక్కిలి సంతోషంతో ఇలా అన్నాడు. 'మా తోటలో ఇల్లు ఉంది. అక్కడ ఇంటికి రంగులు పూయాలి. అక్కడే ఇష్టం వచ్చినన్ని రోజులు ఉండు. అయితే రంగుమాత్రం బాగా పూయాలి. లేకుంటే డబ్బులు ఇవ్వను' అన్నాడు.

సోమనాథుడు 'సరే' అన్నాడు. ఒక చెక్కపెట్టె ఇచ్చాడు. ఈ రంగు వచ్చేట్లు గోడలకు వేయి అన్నాడు. వారం రోజుల్లో ఆ ఇంటికి రంగులు వేశాడు. ఆ చెక్క పెట్టె తీసుకుని పోల్చి చూశాడు. చక్కగా రంగులు వేశాడు. ఇంత పని వాడివి అని నాకు తెలీదు.. అని చెప్పిన డబ్బులు ఇచ్చాడు. కొన్నాళ్ల తర్వాత జమీందారు తన భార్యతో ఆ తోటలోని గదికి వెళ్లాడు. 'ఆహా.. రంగు పూయించి మంచి పని చేశారండి' అన్నది. 'సోమనాథుడనే వ్యక్తి ఈ పని చేశాడు. మన దగ్గర ఉద్యోగం ఇద్దామనుకున్నా' అన్నాడు. వెంటనే తన భార్య ఆ చెక్క పెట్టెను గోటితో గీకింది. రంగు వచ్చింది. 'ఆహా.. మీ సోమనాథుడు ఎంత తెలివి ఉపయోగించాడు. ముందు చెక్కపెట్టెకు రంగేసి ఆ తర్వాత ఇంటికి వేశాడు. మీ మతిమరుపు, కంటిచూపు తెలిసిందేమో అతనికి' అన్నది. వెంటనే జమీందారు ఇంత మోసం చేశాడా అన్నాడు. అతని తెలివిని మెచ్చుకోండి అన్నది జమీందారు భార్య. అంతే కదా.. అన్నాడు జమీందారు.









డైలీ సుడోకు - 310

	8	5				1	2	3
7	9				1			
		2			8		7	6
				1	2		9	
	4		9		5		3	
	2		8	7				
9	5		1			2		
			7				1	8
3	1	7				4	5	

సుడోకు - 309 సమాధానం

2	9	6	3	5	1	7	4	8
7	5	1	2	8	4	3	6	9
3	8	4	6	9	7	5	1	2
5	1	2	9	6	3	8	7	4
6	3	8	7	4	5	2	9	1
9	4	7	1	2	8	6	5	3
4	7	5	8	3	9	1	2	6
8	2	9	5	1	6	4	3	7
1	6	3	4	7	2	9	8	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.